ఫిబ్రవరి
2024

సంపుటి :19 సంచిక : 9

214

వెల రూ. 15/-

MARXISTU

# మార్క్సిస్టు


## సైద్ధాంతిక మాసపత్రిక

ఈ సంచికలో........

లెనిన్ బోధనలు విజ్ఞానాన్నే కాదు విశ్వాసాన్నీ కలిగిస్తాయి
గుప్తుల కాలం: భూస్వామ్య సంబంధాలు
దురాక్రమణ సైన్యానికి ప్రజా ప్రతిఘటన
యుపిలో మహిళలకు భద్రత లేదు
ప్రజా సాహిత్యం, ప్రజా కళలు
భారత ఆర్థికాభివృద్ధి : గణాంకాల మిథ్య
పశ్నిద్దామా వద్దా అనేదే అసలు ప్రశ్న
భగవద్గీత-ఒక పరామర్శ

# భగవద్గీత-ఒక పరామర్శ

**పిబి చారి**



రచయిత హైదరాబాద్‌లోని ఇసిఐఎల్‌లో రిటైర్డ్ సీనియర్ మేనేజర్

భగవద్గీత అనే మాటకు భగవంతుని గీతం అని అర్థం. మహా ఇతిహాసంగా ప్రసిద్ధికెక్కిన మహా భారతం 6వ పర్వంలో 23-40 శ్లోకాలలో భగవద్గీత దర్శనమిస్తుంది. విష్ణువు అవతారాలలో 8వ అవతారం కృష్ణావతారం. యదుకృష్ణుడు కురుక్షేత్ర సంగ్రామంలో పాండవ వీరుడైన అర్జునుడికి రథసారథిగా సాయపడ్డాడు. రథసారథి అయిన కృష్ణుడికి అర్జునుడికి మధ్య జరిగిన సంభాషణను సంజయుడు దృతరాష్ట్రుడికి నివేదిస్తాడు. అదే భగవద్గీత.

కురుక్షేత్ర సంగ్రామం ప్రారంభమవుతుండగా అర్జునుడు ఉన్నట్టు ఉండి యుద్ధమంటే విరక్తి చూపుతాడు. అన్నదమ్ములను దాయాదులను నిర్మూలించే మారణహోమంలో ప్రముఖ పాత్ర పోషించలేనంటాడు. మహా మారణకాండకు మనస్సు సిద్ధపరిచేందుకు అర్జునుడు అడిగే ప్రశ్నలకు సమాధానంగా కృష్ణుడు ఒక తాత్వికచట్రాన్ని వివరించాడు. అదే భగవద్గీత. అయితే కృష్ణుడు ఎన్ని చెప్పినా అర్జునుడు భయపడినదే చివరకు జరిగింది.

దివ్యవాక్కులుగా పేరొందిన ఈ గీతను ఒక్కొక్కరు ఒక్కోరకంగా వివరించారు. ఒక వివరణకు మరో వివరణకు పొంతన లేదు. వీటిని చూస్తే అసలు మూలంపైనే సందేహాలు తలెత్తక మానవు. ఒక నైతిక తత్వం అది ఏదైనా కానీ, అందరికీ ఒకే విధంగా అర్థం కావాలి. అలా కాకుండా సమాజంలోని రకరకాల వారు దానిని రకరకాలుగా అర్థం చేసుకున్నారంటే అర్థం ఏమిటి ? ఆ తత్వంలోనే పరస్పర భిన్నమైన అవగాహనలు ఇమిడి ఉన్నాయన్నమాట. అందువల్లనే భగవద్గీతనుండి ఎవరికి తోచిన అర్థం వారు లాగగలిగారు.

మహాత్మాగాంధి గీతలో అహింసను ప్రధానంగా చూసారు. ఆదిశంకరుడు గీతలో అద్వైతాన్ని దర్శించాడు. సర్ రాధాకృష్ణన్ గీత ఒక నైతిక ప్రబోధం అని భావించారు. జాతీయోద్యమ నాయకుడైన బాల గంగాధర తిలక్ గీత అన్నది శక్తిని సమకూరుస్తుందని, కార్యాచరణను బోధిస్తుందని అంటాడు. క్రీ.శ.10వ శతాబ్దపు యమునాచార్యుడు, నారాయణుడే అత్యుత్తమమైన బ్రహ్మస్వరూపం అని చెప్పటం గీత ముఖ్య ఉద్దేశ్యం అంటాడు. అలానే విశిష్టాద్వైత రామానుజాచార్యులు, ద్వైతవాదమధ్వాచార్యులు, మరో రకంగా గీత ఉద్దేశ్యాలను అర్థం చేసుకున్నారు. అరవింద ఘోష్ అయితే గీతా అధ్యయనం కొరకు స్వతంత్ర పోరాటాన్నే వదిలి వేసాడు. వీరందరు గీతను ఆశ్రయించినవారే. కానీ గత నుండి రకరకాల అర్థాలను లాగారు. అందువల్ల దీని మూలాన్ని ఏమేరకు విశ్వసించాలన్నదే పెద్ద ప్రశ్నార్థకమవుతున్నది. కానీ ప్రజల వైపు నుండి వ్యవస్థను పరామర్శించిన తాత్వికులు ఎవరూ కూడా భగవద్గీతను ఆశ్రయించలేదు. కబీర్ కానీ, తుకారాం కానీ, చైతన్యుడుకానీ, వేమనగాని.

గీతలో కొంత మతబోధన, తాత్వికత, కొంత లౌక్యం, కొంత ధైర్యవచనం, కొంత వీర స్వభావం గురించిన ప్రేరణ, ప్రతిఫలాపేక్ష, చివరకు బెదిరింపు అన్నీ కలగలిసి ఉన్నాయి.

భగవద్గీతలో ప్రధానంగా కనిపించే అంశాలు :

1) వర్ణ వ్యవస్థను బలంగా సమర్థించటం

2) గీతకన్నా ముందు కాలంలో ప్రచారంలో ఉన్న పరస్పర విరుద్ధమైన విభిన్న భావాలు, సాంఖ్య, యోగ, మీమాంస, వేదాంత, బౌద్ధ సంప్రదాయాలు ఇవన్నీ ఫలానా అని చెప్పకుండా అన్ని తన అభిప్రాయాలుగా చెప్పటం.

3) భక్తి భావాన్ని ప్రవేశ పెట్టటం

గీత 4-13 -చాతుర్వర్ణం మయాసృష్టం - గుణకర్మ విభాగశః

తస్య కర్తారమపి మాం - విర్ధ్వకర్తా రమవ్యయమ్ .

ఈ నాలుగు కులాలు వాళ్ళ గుణ కర్మలను అనుసరించి తేడాను సృష్టించింది నేనే అంటాడు కృష్ణుడు. భగవంతుని గొప్ప పనుల జాబితాలో ఈ తేడాల సృష్టికూడా ఒకటి. గీత 9-32 మాం హే పార్థ ! వ్యపాశ్రిత్య - యేపిస్యుః పాపయోనయః

స్త్రీయో వైశ్యాస్తధా శూద్రా - తేపి యాంతిపరాంగతిమ్ పప

అంతేకాదు నన్ను శరణుజొచ్చినవారు, ఎవరైనా సరే వారు పాపిష్టి జన్మనెత్తిన స్త్రీలు, వైశ్యులు, సూద్రులు ఎవరైనా సరే అంటే ఏమిటి ? మొత్తం స్త్రీలు, చమటోడ్చి పనిచేసే వైశ్యులు, శూద్రులు పాపిష్టి జన్మ పొందినవారన్నమాట.

గీతలో అంతర్వాహినిగా సాగే భక్తిభావం అంతకు ముందున్న శ్వేతాశ్వరోపనిషత్ నుండి గ్రహించిందే. ఆ ఉపనిషత్తు నుండి అనేక శ్లోకాలను గీత సంగ్రహించింది. అలాగే గీత 2-55.72 భాగంలోని భావాలు బౌద్ధమతం నుండి గ్రహించినవే. గాంధీమహాత్ముని ఆశ్రమంలో రోజు ప్రార్థనలలో ఉపయోగించేది ఈ భాగం నుండే. అలాగే కఠోపనిషత్తు నుండి అనేక పద్యాలను గీతలో చేర్చారు. ఉపనిషత్తుల నుండి కాపీ కొట్టిన గీతాకారుడు వాటన్నింటిని వాసుదేవకృతం అనిపించాడు. శ్రీకృష్ణుడు ఉపనిషత్తు అనే గోవును పితికి గీతామృతం అనే పాలను అర్జునుడికి ఇచ్చాడు. కృష్ణుడు పాలు పితుకున్నది ఈ ఉపనిషత్తుల నుండే. ఉపనిషత్తులు గోవులు, కృష్ణుడు వాటిని పితికే గోపాలుడు. పాలు గీతామృతం. ఆ పాలు త్రాగిన దూడ ధీమంతుడైన అర్జునుడు. ఈ సాక్ష్యాలను బట్టి గీతా రచన ఉపనిషత్తుల, అలానే బౌద్ధమతం తర్వాతనే రచించబడిరదనేది నిష్కర్మగా చెప్పవచ్చు. అందుకే దీని రచనా కాలాన్ని క్రీ.శ. 150-350 మధ్య అయి ఉంటుందని చరిత్రకారులు నిర్ధారణ చేసారు.

గీత వేదక్రతువులైన యజ్ఞయాగాదులను నిరశించింది. వేదాలు పట్టుకు వేళ్ళాడుతూ వేదక్రతువులను నిర్వహించటం ద్వారా పవిత్రత, అధికారం లభిస్తాయి అనుకునేవారు మూరు?లు అంటాడు కృష్ణుడు.

వేదకాలంలో పాపము, భక్తి అనేవి వైదిక భావాలేకావు. గీతలో కృష్ణుడు చెప్పుకున్నట్లుగా వైదిక దేవతలెవరు సకల పాపాలను ప్రక్షాళన చేయగలమని చెప్పుకోలేదు.

గీత 18-66 సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం ప్రజ

అహం త్వాం సర్వ పాపేభ్యః మోక్షయి

(మిగతా 34వ పేజీలో)

## ఈ సంచికలో...


1. భగవద్గీత-ఒక పరామర్శ
పిబి చారి .......2

2. లెనిన్ బోధనలు విజ్ఞానాన్నే కాదు విశ్వాసాన్నీ కలిగిస్తాయి
బివి రాఘవులు .......4

3. గుప్తుల కాలం: భూస్వామ్య సంబంధాలు
ఎంవిఎస్ శర్మ ........11

4. దురాక్రమణ సైన్యానికి ప్రజా ప్రతిఘటన
హనన్ అవ్రువి .......15

5. యుపిలో మహిళలకు భద్రత లేదు
అశుతోష్ శర్మ........17

6. ప్రజా సాహిత్యం, ప్రజా కళలు
మావో జె డాంగ్......20

7. భారత ఆర్థికాభివృద్ధి : గణాంకాల మిథ్య
సిపి చంద్రశేఖర్.......27

8. ప్రశ్నిద్దామా వద్దా అనేదే అసలు ప్రశ్న
రొమిలా థాపర్......30



సంపాదకుడు :
**ఎస్.వెంకట్రావు**

సంపాదక వర్గం :
**బి.వి.రాఘవులు**
**తమ్మినేని వీరభద్రం**
**ఎస్.వీరయ్య**
**తెలకపల్లి రవి**

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తరపున

ప్రచురణ కర్త, ముద్రాపకుడు: బి.వి.రాఘవులు
సంపాదకుడు : ఎస్.వెంకట్రావు
ఫోన్: ఎడిటర్ : 94900 99333

ముద్రణ: ప్రజాశక్తి ప్రింటర్స్ అండ్ పబ్లిషర్స్ ప్రై. లి., 14-12-19, కృష్ణనగర్, తాడేపల్లి(మ), గుంటూరు(జి)
మేనేజర్: కె.హరికిషోర్: 94900 99422
email:venkataraosankarapu@gmail.com
email:marxistap@gmail.com
visit cpi(m) site at: cpim.org


# మీడియాపై ఉక్కుపిడికిలి

సామ దాన బేధ దండోపాయాలతో మీడియాను లొంగదీసుకోవడంలో ప్రపంచవ్యాపిత అపఖ్యాతి మూటగట్టుకున్న నరేంద్ర మోడీ ప్రభుత్వం తాజాగా మరో దారుణానికి ఒడిగట్టింది. ఇప్పటికే మీడియా స్వేచ్ఛ విషయంలో భారత దేశ స్థానాన్ని ప్రపంచంలోనే అట్టడుగు స్థాయికి నెట్టేసిన మోడీ ఇప్పుడు టివి ఛానళ్లు, ఒటిటి, యూట్యూబ్ ఛానళ్లు వంటి డిజిటల్ మీడియా మొత్తాన్ని తన గుప్పిట్లో పెట్టుకునేందుకు మరో నల్ల చట్టాన్ని రూపొందించి ప్రజల మీదకు వదిలారు. ప్రసార సర్వీసుల (నియంత్రణ) బిల్లు, 2023 పేరుతో కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఈ బిల్లు ఇప్పటికే మిణుకు మిణుకు మంటున్న భారత ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛను పూర్తిగా కొడిగట్టిస్తుంది. మూడు దశాబ్దాలుగా ఉన్న కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్ నియంత్రణ చట్టం, 1995 స్థానంలో ఈ కొత్త బిల్లును రూపొందించిన ప్రభుత్వం ప్రస్తుతం 'ప్రజాభిప్రాయం' కోసం విడుదల చేసింది. ఈ చట్టానికి ముందు కేంద్ర ప్రభుత్వం, సమాచార ప్రసారాలకు సంబంధించి మరో మూడు చట్టాలు చేసింది. ఈ చట్టాలన్నిటి ఉద్దేశం విస్తరిస్తున్న మీడియాను, డిజిటల్ డేటాను కేంద్ర ప్రభుత్వ గుపెట్లో పెట్టుకోవడమే. తనకు నచ్చని మీడియా సంస్థల పీకనొక్కడమే.

కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన తాజా చట్టంలో తనకు నచ్చని మీడియా కంటెంట్‌ను సెన్సార్ చేసే నిబంధనలున్నాయి. ఇది అన్ని రకాల మీడియాపైనా అంటే సినిమాలు, టెలివిజన్ ఛానళ్లు, ఒటిటి వేదికలు, చివరికి స్వతంత్ర యూట్యూబ్ ఛానళ్లను కూడా ప్రభుత్వ ఉక్కు పిడికిలిలోకి తెచ్చేస్తుంది. టివిలోనూ, ఇంటర్ నెట్‌ద్వారానూ ప్రసారమయ్యే అన్ని రకాల కార్యక్రమాలను నియంత్రించేందుకు, లేక సెన్సార్ విధించేందుకు ఈ చట్టం కేంద్ర ప్రభుత్వానికి ఏకపక్షమైన అధికారాలు ఇస్తుంది. వాట్సాప్, టెలిగ్రామ్, సిగ్నల్ వంటి మెసేజింగ్ సర్వీసులపైన కూడా సెన్సారు విధించే అధికారం దీని వల్ల కేంద్రానికి దక్కుతుంది. ఈ వేదికల మీద ప్రసారమయ్యే వార్తలు, సాంస్కృతిక కార్యాక్రమాలు కూడా ప్రభుత్వం విధించే కోడ్‌కు లోబడి ఉండాలి. "కార్యక్రమం" అనే పదానికి ఈ చట్టంలో విస్తృతమైన అర్థం ఇచ్చారు. బ్రాడ్‌కాస్టింగ్ నెట్‌వర్క్ ద్వారా పంపే ఎటువంటి ఆడియోవిజువల్ కంటెంట్ అయినా లేక సంకేతం, రాత, ఫోటోలు అయినా ఈ నిర్వచనం కిందకు వస్తాయి. ఇవన్నీ ప్రభుత్వ సెన్సార్‌షిప్పుకు గురయ్యే అవకాశాలుంటాయి.

ఈ చట్టం గనుక అమల్లోకి వస్తే స్మార్ట్ ఫోన్ ఉపయోగించేవారందరూ ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే దండనార్హులవుతారు. దాంతో ఈ చట్టాన్ని ఉపయోగించుకుని ప్రభుత్వం యూట్యూబ్ జర్నలిస్టులనూ, వార్తా విశ్లేషకులను, డిజిటల్ న్యూస్ వెబ్‌సైట్‌లను తన అదీనంలోకి తీసుకో గలుగుతుంది. వార్తలు తనకు అనుకూలంగా వస్తే సరేసరి లేకుంటే వాటిపై చర్యలు తీసుకుంటుంది.

ఇప్పటికే మన దేశం మీడియా స్వేచ్ఛ విషయంలో ప్రపంచంలోని 194 దేశాల్లో 150వ స్థానానికి పిడిపోయింది. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విషయంలో మన దేశం స్థాయి క్రమంగా తగ్గుతూ ఇప్పుడు నియంతలు పాలించే దేశాల స్థాయికి దిగజారింది. మోడీ హయాంలో జర్నలిస్టులపై దాడులు కూడా బాగా పెరిగినట్లు 'జర్నలిస్ట్స్ వితవుట్ బౌండరీస్' సంస్థ వెల్లడించింది. ఇప్పటికే కార్పొరేట్ మీడియా మోడీ భజన చేస్తుండగా కాస్తో కూస్తో ప్రజల పక్షం వహించే మీడియాపై దాడులు చేయించి, కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్న వైనాన్ని ఇటీవల న్యూస్ క్లిక్ మీడియా పోర్టల్‌పై పోలీసుల దాడి, దాని అధిపతి ప్రబీర్ పుర్కాయస్థతో సహా పలువురు జర్నలిస్టుల అరెస్టు తెలియజేస్తున్నది.

మోడీ నాయకత్వంలోని ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను ఒక్కొక్కటిగా తన గుప్పెట్లో పెట్టుకుంటూ దేశాన్ని ఫాశిస్టు నియంతృత్వం వైపు తీసుకు పోతున్న విషయం గత కొంత కాలంగా అందరూ గుర్తిస్తున్న విషయమే. మీడియాపై వేటు వేయడమంటే మన రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటనా స్వేచ్ఛపైన, ప్రజాస్వామ్యం పైన వేటు వేయడమే. సంపూర్ణ నియంతృత్వానికి మార్గం వేసే ఈ చర్యలను ప్రజాతంత్ర వాదులు తీవ్రంగా ప్రతిఘటించాల్సిన అవసరం ఉంది.



లెనిన్ శత వర్ధంతి ప్రత్యేక వ్యాసం

# లెనిన్ బోధనలు విజ్ఞానాన్నే కాదు విశ్వాసాన్నీ కలిగిస్తాయి



రచయిత సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు

బివి రాఘవులు

(హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన లెనిన్ శతవర్ధంతి సభలో సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు కామ్రేడ్ బివి రాఘవులు ఉపన్యాసం)

### లెనిన్-భౌతికవాదం

భౌతికవాదాన్ని నిరంతరం రక్షించుకో వలసిన అవసరం విప్లవకారులకు వుంది. భౌతికవాదాన్ని రక్షించుకోకపోతే భావవాదం ప్రధాన సిద్ధాంతంగా ప్రజల్లో వ్యాపిస్తుంది. అది విప్లవాలకు ఆటంకంగా మారుతుంది. పాలక వర్గాలకు తోడ్పడుతుంది. పాలకవర్గా లను రక్షించడంలో భావవాదం ముఖ్యపాత్ర వహిస్తుంది.

భావవాదం అనేక రూపాల్లో వుంటుంది. అనేక వ్యవస్థల్లో ఇమిడి వుంటుంది. మత వ్యవస్థ, విద్యా వ్యవస్థ, కుటుంబ వ్యవస్థ, రాజకీయ వ్యవస్థ తదితరాల్లో ఇమిడి ఉంటుంది.

భావవాదం సమాజంలో అనేక రూపాల్లో వుంటుంది. కాలంతోపాటు అది రూపాలు కూడా మార్చుకుంటుంది. ఆయా వ్యవస్థల్లో నిక్షిప్తమై అనేక రూపాల్లో వస్తున్న ఈ భావవాదానికి విప్లవకారులు నిరంతం సమా ధానం చెపుతూ వుండాలి. దాన్ని తిప్పికొట్టకుండా, ఏదో మనం యూనియన్ నడుపుకుంటాం, జీతాలు పెంచుకుంటాం, ఇళ్ళ స్థలాల కొరకు పోరాడతాం, గుడిసెలు వేయిస్తాం అంటే విప్లవం ముందుకు పోదు. అందుకే లెనిన్ అంత విప్లవోద్యమంలో తలమునకలు అయినప్పుడు కూడా "భౌతిక వాదం, అనుభవాత్మక విమర్శ" (మెటీరియ లిజం అండ్ ఎంపీరియో క్రిటిసిజం) అన్న పుస్తకం రాసారు. వాస్తవంగా ఈ పుస్తకం రాసిన సందర్భం ఏమిటంటే 1905 ఫిబ్రవరి విప్లవం ఓడిపోయింది. 1906లో అంతా నిరాశ కమ్ముకుంది. విప్లవం మీద నమ్మకం పోయింది. అరవై వేల బోల్షివిక్ పార్టీ సభ్యత్వం ఆరు వేలకు పడిపోయింది. పార్టీనుండి బయటకు పోయిన వారు ఊరకే ఉండలేదు. రకరకాల తప్పుడు సిద్ధాంతాలు ముందుకు తెచ్చారు. భౌతివాదం పనికిరానిదన్నారు. కమ్యూనిజాన్ని దేవుడుగా చేసి ప్రచారం చేస్తే, దేవుడి మీద నమ్మకం వున్న ప్రజలందరూ మన వెనుక వస్తారన్నారు. శాస్త్రవిజ్ఞానం ద్వారా, ప్రకృతి సూత్రాలద్వారా ఒక అతీంద్రియ శక్తిని అర్థం చేసుకోలేమని చెప్పారు.

బెర్నార్డ్ మాథ్యూస్ అనే ఆయన ఒక కమ్యూనిస్టు. ఆయన భౌతికవాదం పేరుతో భావవాదాన్ని ముందుకు తీసుకువచ్చాడు. నేను భావవాదిని అని చెప్పి ఎవరైనా ముందుకు వస్తే వాళ్ళను ఓడించడం సులభం. కానీ భౌతికవాదినని చెప్పి భావవాదాన్ని ప్రచారం చేసే వాళ్లను ఓడించటం చాలా కష్టం. ఎందుకంటే, వాళ్ళు మనతోనే వుంటారు. మనం మాట్లాడినట్లే మాట్లాడు తారు. మనం వాడిన పదాలనే వాడుతారు. మనకంటే గట్టిగా మాట్లాడుతారు. అటువంటి వారికి ప్రజలను మభ్య పెట్టే శక్తి ఎక్కువగా వుంటుంది. అందువల్ల భావవాద భావజాలం మీద, ముఖ్యంగా తాత్విక భావాల మీద పోరాడటం ముఖ్యమైన అంశం.

ఇప్పుడు భారతదేశంలో హిందుత్వ సిద్ధాంతం పేరుతో భావవాద భావజాలం ప్రచారం అవుతున్నది. ఇస్లాం పేరుతో కూడా అటువంటి ఒక అభివృద్ధి నిరోధక భావజాలం ముస్లిం ప్రజలలో ప్రచారమవుతోంది. కానీ ఈరోజు అధికారాన్ని, రాజ్యాంగ యంత్రాంగాన్ని దగ్గర పెట్టుకొని, మీడియాని చేతుల్లో పెట్టుకుని, మొత్తం భావజాల యంత్రాంగం అంటే సోషల్ మీడియా, సిని మాలు, సంస్కృతి, పత్రికలు, టీవీలు...మొత్తాన్ని గుప్పిట్లో పెట్టుకుని విస్తారం గా ప్రచారం చేసుకుంటున్న హిందుత్వ భావజాలం భౌతికవాద వ్యతిరేకమైనది, సైన్సుకు వ్యతిరేకమైనది, ప్రమాదకరమైనది.

ఉదాహరణకు అయోధ్యలో రాముని విగ్రహ ప్రతిష్టను రాజకీయం చేయడాన్ని మనం విమర్శిస్తున్నాం. ఎందుకు? ఒక మత వ్యవహారాన్ని రాజకీయ వ్యవహారంగా మార్చడం తగదని మనం విమర్శ చేస్తున్నాం. మనం లౌకికవాద దృక్పథం నుండి ఈ విమర్శ చేస్తున్నాం. కొంతమంది సనాతన ధర్మం కోణం నుంచి విమర్శ చేస్తున్నారు. ఈ విమర్శ అభ్యుదయ దృక్పథం నుంచి కాదు.

ఇటువంటి వాళ్ళ ఉచ్చులో పడి మనం కూడా అదేరకమైన విమర్శ చేస్తే అది తప్పు. నిజానికి ఇటువంటి విమర్శలు చేసేవారు అతి భావవాదులు. ఈ అతి భావవాదుల విమర్శలను మనం నెత్తికెత్తుకొని, మన వాదనలు సమర్థించుకోవడానికి ప్రయత్నం చేయడం అంటే మనం కూడా భావవాదంలోకి పోవడమే అవుతుంది.

అందుకే, లెనిన్ రచనలు చదివితే భావవాదంతో జరిగే రోజువారి యుద్ధంలో మనం భౌతికవాద ఆయుధంతో ఎలా ఎదుర్కోవాలో చక్కగా అర్థమవుతుంది.

### లెనిన్-ఆర్థిక శాస్త్రం

రెండవది, ఆయన ఆర్థిక శాస్త్రంలో కూడా ఎక్కువ కృషి చేశారు. మార్క్స్ పెట్టుబడి గ్రంథం 3 వాల్యూములు, అదనపు విలువతో కలిపి నాలుగు వాల్యూమ్‌లు రాశారు. ఆ

**"సుందరయ్య గారు కాజ, అనంతవరం గ్రామాలలో వ్యవసాయక ఆర్థిక వ్యవస్థను విశ్లేషణ చేశారు. లెనిన్ వ్యవసాయం మీద రాసిన ఈ పుస్తకాలు, మావో హ్యూనాన్ రాష్ట్ర రైతాంగంలో సర్వే చేసి 30 పేజీలతో చైనా గ్రామీణ ప్రాంతాల్లో వర్గ వ్యవస్థ మీద రాసిన పుస్తకం వీటన్నిటిని జోడించి సుందరయ్య గారు ఆ రెండు గ్రామాల్ని అధ్యయనం చేశారు."**

తర్వాత రోజా లగ్జెంబర్గ్ గుత్తపెట్టుబడి (మోనోపోలీ క్యాపిటల్) గురించి రాశారు. లెనిన్ 1893లో "రష్యన్ రైతాంగ జీవితంలో నూతన ఆర్థిక పరిణామాలు", 1899లో "రష్యాలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి" అనే రెండు పుస్తకాలు రాశారు. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే, మార్క్స్ పెట్టుబడి గ్రంథం రాశాడు కాబట్టి మనం దాన్ని చదివితే చాలు అన్నీ అర్థమయిపోతాయని అనుకోలేం. మార్క్స్ పెట్టుబడిదారీ విధానం మూల సూత్రాల గురించి రాశారు. ఆ మూల సూత్రాలను వినియోగించి నిర్దిష్టంగా ఏ సమాజం ఎలా అభివృద్ధి అవుతుందో తెలుసుకోవాలి. పెట్టుబడిదారీ సమాజాభివృద్ధిలో ఏది అభివృద్ధికరమైన ధోరణి, ఏది వెనక్కు లాగే ధోరణి అనేదాన్ని అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఆ రోజుల్లో పెట్టుబడి గ్రంథం చదివాము గనుక రష్యా గురించి మాకు అంతా తెలిసిపోయిందని కొంతమంది అనుకున్నారు. రష్యాలో కమ్యూనిజం తేవడం చాలా సులభమని వాదించిన వాళ్లు కూడా ఉన్నారు. ఎందుకంటే రష్యాలో గ్రామసీమల్లో వ్యక్తిగత ఆస్తి లేదు. భూమి మొత్తం సమిష్టిగానే ఉండేది. అప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో సమిష్టి భూ-యాజమాన్యం ఉంది కాబట్టి ఇక్కడ కమ్యూనిజాన్ని సులువుగా నిర్మించవచ్చు అని కొందరు వాదన చేశారు. అది తప్పు అని లెనిన్ చెప్పాడు. గ్రామసీమల్లో ఆరోజు పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందుతున్నదని చెప్పాడు. గ్రామంలో ఉన్న వ్యవసాయదారులందరూ చేసే సామూహిక వ్యవసాయం నుండి వచ్చే అదనపు ఉత్పత్తిని దోచుకుంటున్నది ప్రభువులు, భూస్వాములు. అందుకని అక్కడ కమ్యూనిజం ఉన్నదనుకుంటే పొరపాటు అని సోదాహరణంగా లెక్కలతో సహా వివరించాడు. దానికి ఆయన మండలం స్థాయిలో భూమి, గుర్రాలు, నాగళ్లు, బళ్లు, తట్టలతో సహా అన్నిటి లెక్కలూ వివరంగా తీసి పుస్తకంలో రాశారు.

ఇప్పటికీ భారతదేశంలో వ్యవసాయం గురించి చాలా చర్చలు జరుగుతున్నాయి. పెట్టుబడిదారీ విధానం ఆర్థిక వ్యవస్థలో ముఖ్యంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఎటువంటి మార్పులు తెస్తున్నది. ఎటువంటి వైవిధ్యాన్ని ముందుకు తెస్తున్నది, ఈ వైవిధ్యాలలో ఏది ప్రధానంగా ఉన్నది, ఏది ప్రభావితం చేస్తున్నది. ఇవన్నీ అర్థం చేసుకోకపోతే 140 కోట్ల జనాభా, అందులోనూ 60 శాతం గ్రామీణ వ్యవసాయ రంగంలో నివసించే భారతదేశంలో విప్లవం తీసుకురావాలంటే అంత సులభంగా సాధ్యమయ్యేది కాదు. అందువల్ల వ్యవసాయం గురించీ, ఆర్థిక అంశాల గురించీ లెనిన్ రాసిన రచనలు ఇప్పటికీ ఎంతో విలువైనవి. ఎప్పటికీ అవి ప్రామాణికమైనవి.

సుందరయ్య గారు కాజ, అనంతవరం గ్రామాలలో వ్యవసాయక ఆర్థిక వ్యవస్థను విశ్లేషణ చేశారు. లెనిన్ వ్యవసాయం మీద రాసిన ఈ పుస్తకాలు, మావో హ్యూనాన్ రాష్ట్ర రైతాంగంలో సర్వే చేసి 30 పేజీలతో చైనా గ్రామీణ ప్రాంతాల్లో వర్గ వ్యవస్థ మీద రాసిన పుస్తకం వీటన్నిటిని జోడించి సుందరయ్య గారు ఆ రెండు గ్రామాల్ని అధ్యయనం చేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కూడా అంత శాస్త్రీయంగా, అంత లోతుగా కాకపోయినా 80 గ్రామాలను అధ్యయనం చేసింది. ఇప్పుడు ఫౌండేషన్ ఫర్ అగ్రేరియన్ స్టడీస్ అనే సంస్థకు చెందిన కొందరు దేశవ్యాప్తంగా ప్రతి రాష్ట్రంలోనూ రెండుమూడు గ్రామాలు తీసుకుని అధ్యయనం చేస్తున్నారు. అలాగే అంతకుముందు ఉత్సా పట్నాయక్ వంటి వాళ్ళు కొన్ని గ్రామాల్ని అధ్యయనం చేశారు.

మొత్తంమీద చూసినప్పుడు ఈరోజు భారతదేశంలో వ్యవసాయం గురించి రెండు మూడు వాదనలు ఉన్నాయి. ఇప్పటికీ భారతదేశ గ్రామసీమల్లో సెమీ ఫ్యూడల్ ఆర్థిక వ్యవస్థ ప్రధానంగా ఉందని చెప్పేవారు ఉన్నారు. కొన్ని మార్పులు వచ్చినప్పటికీ పాత వ్యవస్థ కొనసాగుతోందని వీరు చెప్తూ ఉంటారు. మరికొంతమంది, సంపూర్ణంగా పెట్టుబడిదారీ విధానం వచ్చింది, భూస్వామ్య అవశేషాలు ఏమీ లేవు అంటారు. ఇక భూస్వామ్య విధానాన్ని నాశనం చేసే కర్తవ్యం ఏమీ లేదు కాబట్టి సోషలిజంలోకి పోవాలని అంటారు. పెట్టుబడిదారీ విధానం తీవ్రత ఎంత? ఏయే ప్రాంతాల్లో వచ్చింది? వంటి చర్చలు కూడా జరుగుతున్నాయి. అటువంటి చర్చ మన పార్టీలో కూడా జరుగుతోంది, 1946, 1947 కాలంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, వర్లి పోరాటం జరిగిన నాటి పరిస్థితులు అలాగే ఉన్నాయా, లేక ఏమైనా మారాయా? అలాగే మన వ్యవసాయ రంగంలో రాజ్యం ప్రవేశించి వ్యవసాయంలో జోక్యం చేసుకొని హరిత విప్లవం ద్వారా చేసిన మార్పులు, 1991 సరళీకృత ఆర్థిక విధానాలు పెట్టిన తరువాత వచ్చిన తీవ్రమైన మార్పుల స్వభావం ఏమిటి? ఇటువంటి చాలా అంశాలు చర్చకు వస్తున్నాయి. ఈ చర్చలను దృష్టిలో పెట్టుకోకుండా, ఎటువంటి మార్పులు వచ్చాయో అర్థం చేసుకోకుండా రైతు, కూలీ ఉద్యమాలను నిర్మించడం సాధ్యం కాదు.

ఇవన్నీ ఎందుకు ప్రస్తావించాల్సి వస్తోందంటే లెనిన్ రాసిన పుస్తకాలు చదివితే ఇప్పుడున్న చాలా సమస్యలకు నేరుగా పరిష్కారం దొరక్కపోవచ్చు గాని పరిష్కార మార్గం మాత్రం దొరుకుతుంది.

### లెనిన్ – విప్లవోద్యమాలు

ఇక మూడవ అంశం, విప్లవాల గురించి, ఉద్యమాల గురించి కూడా లెనిన్ చాలా రాశారు. అందులో మనం ఎక్కువ ఇష్టపడే పుస్తకం "ఏం చేయాలి?'. ఆయన ఏం చదవాలి అని రాయలేదు, ఏం అధ్యయనం చేయాలి అని రాయలేదు. ఏం చేయాలి అని రాశాడు. అప్పట్లో బెర్న్‌స్టీన్ లాంటివాళ్ళు... ఏం చేయాలని ప్రశ్న ఏమిటి? అలా చేసుకుంటూ పోదాం, ఏది దొరికితే అది చేసుకుంటూ పోదాం, ఫలితం దానంతటదే వస్తుంది. అంతేకానీ దానికోసం ప్రత్యేకమైన ఆలోచన చేయటం ఏమిటి? అన్నారు. అంటే కాలికి ఏది తగిలితే దానిని పట్టుకుని పోవటమే! చిన్నచిన్నగా ఆర్థిక పోరాటాలు చేసుకుంటూ పోతే అదే సోషలిజానికి దారితీస్తుంది అనేవారు. లెనిన్ దానిని "ఆర్థిక వాదం" (ఎకనామిజం) అన్నాడు.

ఆర్థికవాదం మీద లెనిన్ పెద్ద పోరాటం చేశాడు. ఆలోచన అక్కర్లేదు, ప్రయత్నం అక్కర్లేదు,

> **“ ఆర్థికవాదం మీద లెనిన్ పెద్ద పోరాటం చేశాడు. ఆలోచన అక్కరలేదు, ప్రయత్నం అక్కర్లేదు, రేపు ఏం చేయాలనే దృక్పథం అక్కరలేదు, ఏరోజు ఏం తోస్తే అది చేసుకుంటూ పోతే విప్లవం అదే వస్తుంది అంటే అది తప్పు అన్నాడు లెనిన్. మనకు వ్యూహం ఉండాలి, ఎటువంటి వ్యూహం అనుసరించాలో మార్గం ఉండాలి. ప్రణాళికలు అమలు జరిపేందుకు నిర్మాణం ఉండాలి. దానిని నిర్వహించేందుకు కార్యకర్తలు ఉండాలి. ఇవన్నీ ఉంటేనే విప్లవం వస్తుంది అని చెప్పాడు. ”**

రేపు ఏం చేయాలనే దృక్పథం అక్కర్లేదు, ఏరోజు ఏం తోస్తే అది చేసుకుంటూ పోతే విప్లవం అదే వస్తుంది అంటే అది తప్పు అన్నాడు లెనిన్. మనకు వ్యూహం ఉండాలి, ఎటువంటి వ్యూహం అనుసరించాలో మార్గం ఉండాలి. ప్రణాళికలు అమలు జరిపేందుకు నిర్మాణం ఉండాలి. దానిని నిర్వహించేందుకు కార్యకర్తలు ఉండాలి. ఇవన్నీ ఉంటేనే విప్లవం వస్తుంది. లేకపోతే ఉద్యమాలు వస్తుంటాయి, కొన్ని గెలుస్తాం కొన్ని ఓడిపోతాం. కానీ వ్యవస్థ మాత్రం మారదు అని చెప్పాడు. అందుకని మూడు పుస్తకాలు; ఒకటి 'ఏం చేయాలి', రెండవది 'ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కు', మూడవది, 'ప్రజాస్వామ్య విప్లవంలో సోషల్ డెమోక్రాట్ల రెండు ఎత్తుగడలు'...ఈ పుస్తకాలలో ఉద్యమానికి సంబంధించిన ప్రక్రియ ఎలా ఉంటుంది, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం ఎలా ఉండాలి అని చెప్పారు. (కమ్యూనిస్టు పార్టీని నాడు సోషల్ డెమోక్రాటిక్ పార్టీగా పిలిచేవారు)

### లెనిన్–సామ్రాజ్యవాదం

పెట్టుబడిదారీ విధానం ప్రపంచవ్యాప్త స్వభావం కలిగి ఉందని, ప్రధానంగా ఇంగ్లాండు, యూరోప్ దేశాల్లో పుట్టి పెరిగిన పెట్టుబడి ప్రపంచమంతటా వ్యాపిస్తుందని మార్క్స్ చెప్పాడు. లెనిన్ వచ్చేనాటికి అది వ్యాపించింది, పెట్టుబడిదారీ విధానాన్ని నాశనం చేసినప్పుడే నిరాటంకంగా నిరభ్యంతరంగా సోషలిజం కమ్యూనిజంలోకి ప్రవేశిస్తుంది. అప్పటిదాకా ఇది ఆటంకాలు, అపజయాలు, వ్యతిరేకతను ఎదుర్కొంటుందని మార్క్స్ చెప్పాడు. లెనిన్ దానిని మరింత స్పష్టంగా చెప్పాడు. ఈ విషయాలన్నిటిని అర్థం చేసుకోవడానికి సామ్రాజ్యవాదం అనే పదానికి సైద్ధాంతిక నిర్వచనం ఇచ్చి, దాని లక్షణాలు పేర్కొని, దానిని ఎదుర్కొనే శక్తులను గుర్తించి, ఆ ఎదుర్కొనే కర్తవ్యాన్ని స్పష్టంగా చెప్పాడు లెనిన్. అందుకనే “సామ్రాజ్యవాదం పెట్టుదారీ విధానానికి అత్యున్నత దశ” అనే పుస్తకం రాసాడు. ప్రపంచ పెట్టుబడి దారీ విధానాన్ని అర్థం చేసుకోకుండా భారత దేశ పెట్టుబడి దారీ విధానాన్ని అర్థం చేసుకుంటామని మనం అనుకోలేం. మన పార్టీలలోనే ఈ ప్రపంచ పరిణామాల గురించి ఎక్కువ చర్చలు జరుగుతాయి. బయట అతి తక్కువ చర్చలు జరుగుతాయి. అవికూడా విడివిడిగా జరుగుతాయి. ఉక్రయిన్ యుద్ధం గురించి చర్చ జరుగుతుంది, మరోసారి ఇజ్రాయిల్ హమాస్ మధ్య జరుగుతున్న ఘర్షణ/ఉద్రిక్తతల గురించి చర్చ జరుగుతుంది. లేకపోతే మాల్దీవులు భారత దేశం మధ్య ఉన్న ఉద్రిక్తతల గురించి జరుగుతుంది. పాకిస్తాన్ – ఇరాన్ గురించి చర్చ జరుగుతుంది. వీటన్నిటిలో అంతర్లీనంగా వున్న సంబంధం ఏమిటనే చర్చ మనమే చేస్తున్నాం. ఇతరులు చేయరు. చేస్తే ఈ పెట్టుబడిదారీ విధానం అందరికీ అర్థం అయిపోతుంది. అందుకని చేయరు. సామ్రాజ్యవాదం మీద లెనిన్ ఏమి చెప్పారు? అనేది మనం తెలుసుకుంటేనే ఈ పరిణామాలు మనకు అర్థం అవుతాయి.

మరీ ముఖ్యంగా ప్రస్తుత పరిస్థితులలో ఆ గ్రంథానికి చాలా విలువ వున్నది. సాధారణంగా మన కామ్రేడ్స్‌లో కూడా ఎక్కువ మాటాడుకున్నా తక్కువగా చదివే పుస్తకం ఇదే. అందుకని ఒకసారి మళ్ళీ నెమరు వేసుకోవటం మంచిది. లెనిన్ ఆరోజు సామ్రాజ్యవాదం మీద ఏదైతే రాసాడో అది ఈ నాటికీ అలాగే వున్నదని కాదు. కొన్ని మార్పులు వచ్చాయి. దీని గురించి ప్రభాత్ పట్నాయక్ 'సామ్రాజ్యవాద సిద్ధాంతం' (ది థియరీ ఆఫ్ ఇంపీరియలిజం) పేరుతో లెనిన్ గ్రంథాన్ని సమీక్షిస్తూ రాశారు. ఆనాటికీ ఈ నాటికీ సామ్రాజ్యవాదంలో వచ్చిన మార్పులు చేర్పులు అన్నింటినీ పేర్కొంటూ రాశారు. ఈ రెండు పుస్తకాల్ని కలిపి చదివితే ఈనాటి ప్రస్తుత పరిస్థితి ఏమిటో అర్థం అవుతుంది. ఆ గ్రంథంలో లెనిన్ చెప్పిన ముఖ్య లక్షణాలు చూస్తే, మొదటిది, మార్క్స్ రాసిన నాటికి లెనిన్ కాలంనాటికి పెట్టుబడిదారుల్లో తీవ్రమైన మార్పు వచ్చింది. లెనిన్ కాలానికి పెట్టుబడిదారీ విధానం గుత్తపెట్టుబడిదారీ విధాన దశలోకి వచ్చింది. మార్క్సనాటికి పోటీ పెట్టుబడిదారీ విధానం ఉంటుంది. అప్పుడు ఒక పెట్టుబడికి మరో పెట్టుబడికి ఘర్షణ ఉండేది. లెనిన్ కాలానికి మోనోపోలీ అంటే గుత్తపెట్టుబడి దారీ విధానం వచ్చింది. ఇంతకుముందు బ్యాంకు, పరిశ్రమ పెట్టుబడులు వేరుగా ఉండేవి. ఇప్పుడు పారిశ్రామిక పెట్టుబడిదారు లూ, బ్యాంకు పెట్టుబడిదారులు అందరూ కలిసిపోయి ద్రవ్యపెట్టుబడిదారు లయ్యారు. రెండవది. చిన్న చిన్న పెట్టుబడులు అన్నీ కలిసి పెద్ద పెట్టుబడులు అయ్యాయి. అభివృద్ధి చెందిన పెట్టుబడిదారీ దేశాల్లో నలుగురో, ఐదుగురో గుత్తపెట్టుబడిదారులు కలిసి ప్రధాన పెట్టుబడుల్నీ, మొత్తం ఆర్థిక వ్యవస్థనూ శాసించే పరిస్థితి వచ్చింది. లెనిన్ నాటికి ఇంగ్లాండు, ఫ్రాన్స్, జర్మనీ, అమెరికా, ఇటలీ... ఇటువంటి దేశాల్లో ఈ స్థితి వచ్చింది. ఈ పెట్టుబడులకు తమ తమ దేశాల్లో దోచుకోవడానికి అవకాశాలు తగ్గిపోయాయి. పెట్టుబడికి నిరంతరం లాభం ఉండాలి. ఏ రోజు లాభం రాదో ఆరోజు పెట్టుబడి చచ్చిపోయినట్టే. ఆ దేశాల్లో పెట్టుబడికి దోచుకోడానికి అవకాశం తగ్గిపోయింది. కాబట్టి పెట్టుబడి ఇతర దేశాల్లో పెట్టి లాభాల రూపంలో దోచుకోవాలి. అప్పుడే ఆ లాభం నిలబడుతుంది. అందుకని గుత్త పెట్టబడి దారులు లక్ష్యం మారింది. పెట్టుబడిని విదేశాలకు ఎగుమతి చేసి అక్కడి కార్మికుల్ని దోపిడీ చేసుకొని, అక్కడి వనరుల్ని కొల్లగొట్టి లాభం సంపాదించాలనేది వారి ముఖ్య లక్షణమైంది. ఈ లక్షణం నుండి వచ్చిన ఇంకో లక్షణం ఏంటంటే, ఏ దేశానికి పోవాలి అనేది. అప్పటికే అన్ని దేశాల్లో ఆక్రమించుకొని కొంత మంది ఉన్నారు. బ్రిటీష్ వాడు భారతదేశాన్ని ఫ్రాన్‌వాడు వియత్నాంని ఆక్రమించుకున్నాడు, చైనాలో తలా ఒక ప్రాంతాన్ని ఒక్కొక్కరు ఆక్రమించుకున్నారు. ఆఫ్రికాను ఇటలీ వంటి దేశాలు ఆక్రమించుకున్నాయి. ఫిలిపైన్స్‌ని అమెరికా ఆక్రమించుకున్నది.. ఇటువంటి పరిస్థితుల్లో జపాన్‌కి, జర్మనీ వంటివాటికి జాగా కరువు అయిపోయింది. కాబట్టి మీరేనా దోచుకునేది మాకూ వాటాకావాలని తగాదా వచ్చింది. ఇది యుద్ధాలకు దారితీసింది. ఆ రకంగా గుత్తపెట్టుబడిదారీ విధానం వనరుల కోసం, మార్కెట్ల కోసం ప్రపంచాన్ని పునర్విభజన చేసుకోడానికి యుద్ధాలకు దారితీస్తుంది.

అందువల్ల గుత్తపెట్టుబడిదారుల ముఖ్య లక్ష్యం యుద్ధం. గుత్త పెట్టుబడిదారీ విధానం ఉన్నంత వరకూ పునర్విభజన కోసం తగాదాలు ఉంటాయి, యుద్ధం అనివార్యం. ఈ లక్షణాల్ని కలిపి సామ్రాజ్యవాదం అనాలి అని లెనిన్ చెప్పాడు.

పెట్టుబడిదారీ విధానపు అన్ని దశల్లోనూ సామ్రాజ్యవాద లక్షణం ఉంటుంది. మొదటిది, వలసవాదం. అదికూడా ఒక సామ్రాజ్యవాదమే. లెనిన్ కాలం నాటికి గుత్త పెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం ఆవిర్భవించింది. ఈ సామ్రాజ్యవాద లక్షణమే పునఃపంపిణీకోసం రెండు ప్రపంచ యుద్ధాలకు దారితీసింది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భవించింది. ఇదో ముఖ్యమైన మార్పు. అప్పటివరకూ గుత్తపెట్టుబడిదారుల మధ్యే తగాదా ఉండేది. సోషలిస్ట ప్రపంచం తరువాత గుత్త పెట్టుబడిదారుల మధ్య నిరంతరం యుద్ధం జరిగే వాతావరణం తగ్గింది. అప్పటికే మూడో వంతు ప్రపంచం సోషలిజంలోకి మారింది. మనం మనం తగాదాపడితే మొదటికే మోసం వస్తుందని గ్రహించిన పెట్టుబడిదారీ దేశాలు తమ మధ్య తగాదాలను చర్యల ద్వారా పరిష్కరించుకోడానికి ప్రయత్నించారు. సోషలిజాన్ని దెబ్బతీయడమే ఉమ్మడి లక్ష్యంగా పనిచేయడం ప్రారంభించారు. ఆ రకరంగా రెండో ప్రపంచ యుద్ధం తర్వాత సామ్రాజ్యవాదుల మధ్య ఉండే తాగాదాలు పరిమితం అయ్యాయి. వైరుధ్యాలను పరిష్కరించుకునే ఏర్పాటుగా ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ వంటి సంస్థలను నెలకొల్పారు.

**ద్రవ్యపెట్టుబడి**

అయితే, ఇరవయ్యో శతాబ్దం రెండవ అర్ధభాగంలో పరిస్థితి మళ్లీ మారిపోయింది. ప్రధానమైన సోషలిస్టు వ్యవస్థ దెబ్బతినిపోయింది. గ్లోబలైజేషన్, లిబరలైజేషన్ వచ్చింది. అంటే సామ్రాజ్యవాదంలో మరో మార్పు వచ్చింది.

సోషలిజం ప్రమాదం ఈరోజు లేకుండా పోయింది కాబట్టి, సామ్రాజ్యవాదానికి ఎవరిమీదా పెత్తనం చేయాల్సిన అవసరం లేకుండా పోయిందని, అందుకని సామ్రాజ్య వాదం అంతమైపోయింది అనే కొత్త సిద్ధాంతం వచ్చింది. కానీ లెనిన్ చెప్పినదాని ప్రకారం ఇది పూర్తిగా తప్పుడు సిద్ధాంతం.

ఇంతకుముందులాగా సామ్రాజ్యవాదానికి సమ ఉజ్జీలైన సోషలిస్టు దేశాలు లేవనేది వాస్తవం. అయితే సోషలిస్టు వ్యవస్థ దెబ్బతిన్నా

> **“ పెట్టుబడిదారీ విధానపు అన్ని దశల్లోనూ సామ్రాజ్యవాద లక్షణం ఉంటుంది. మొదటిది, వలసవాదం. అదికూడా ఒక సామ్రాజ్యవాదమే. లెనిన్ కాలం నాటికి గుత్తపెట్టుబడిదారీ సామ్రాజ్యవాదం ఆవిర్భవించింది. ఈ సామ్రాజ్యవాద లక్షణమే పునఃపంపిణీకోసం రెండు ప్రపంచ యుద్ధాలకు దారితీసింది. రెండో ప్రపంచ యుద్ధం అనంతరం సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భవించింది. దాంతో అప్పటివరకూ గుత్త పెట్టుబడిదారుల మధ్య నిరంతరం యుద్ధం జరిగే వాతావరణం తగ్గింది. ”**




ప్రపంచలో అత్యధిక భాగం కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలున్నాయి. వాటిని దోచుకునే పని సామ్రాజ్యవాదానికి ఉంది. దాన్ని ఎదుర్కొనే పని ఆ ప్రజలకు ఉంది. ప్రజా పోరాటాలను అణచిపెట్టకపోతే సామ్రాజ్యవాద దోపిడీ ఆగిపోతుంది. కాబట్టి దోపిడీని రక్షించుకోవాలంటే సామ్రాజ్యవాద పెత్తనం ఉండాల్సిందే, ఆ పెత్తనాన్ని కాపాడుకోడానికి యుద్ధాలు ఉండాల్సిందే. రెండోది, ఈ వర్ధమాన దేశాల్లో పాలకులపై అసంతృప్తి అభ్యుదయ శక్తుల ఎదుగుదలకు దారితీయవచ్చు. అది మళ్లీ సోషలిజానికి దారితీస్తే సామ్రాజ్యవాదానికి ప్రమాదం. మూడోది, చైనా, వియత్నాం, క్యూబా వంటి దేశాలు ఇంకా కమ్యూనిస్టు దేశాలుగానే ఉన్నాయి. ఆ దేశాలు ఇప్పుడు సోవియట్ కాలంలో లాగా ఎదురు తిరగగలిగే స్థితిలో లేకపోయినా క్రమేణా అవి అభివృద్ధి చెంది ఆర్థిక వ్యవస్థలు బలపడుతూ వాటిని ఆదర్శంగా తీసుకొని అన్ని దేశాల్లో అభ్యుదయ శక్తులు పెరిగే అవకాశం ఉంది. కాబట్టి సోవియట్ యూనియన్ తరహాలో వాళ్లని ఎదగకుండా ఇప్పుడే పక్కన పెట్టాలని సామ్రాజ్యవాదులు ప్రయత్నిస్తున్నారు. లెనిన్ అధ్యయనాన్ని గనుక మనం తీసుకుంటే, సోవియట్ కూలిపోయినంత మాత్రాన సామ్రాజ్యవాదం కూలిపోలేదు. ఇప్పటికీ సామ్రాజ్యవాదం ఉంది. ఈరోజు సరళీకరణ ఆర్థిక విధానాలు వచ్చిన తర్వాత ప్రపంచం మొత్తానికి ద్రవ్యపెట్టుబడి విస్తరించి, ఇంతకుముందుకంటే మరింతగా దోచుకోవడానికి తెగబడుతోంది.

ఈరోజు ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యాన్ని ఫైనాన్స్ పెట్టుబడి నియంత్రిస్తోంది. మోడీగారు మేక్ ఇన్ ఇండియా అని చెప్పవచ్చు కానీ ఆ మేక్ ఇన్ ఇండియాలో పెట్టుబడి ఎక్కడిది? అంతర్జాతీయ పెట్టుబడే. సరళీకరణ విధానాలు వచ్చిన తర్వాత గ్లోబల్ ఫైనాన్స్‌కి నిరంతరం లాభాలు రావాలంటే, అత్యధిక జనాభా ఉన్న ఆసియా, ల్యాటిన్ అమెరికా అలాగే ఆఫ్రికా దేశాలనుండే రావాలి. వాటిపై తమ నియంత్రణ ఉంటేనే ఇది సాధ్యం అవుతుంది. అందుకనే నేడు మనం కొనే వస్తువులపైన, వాహనాలకు వాడే డీజిల్, పెట్రోల్, గ్యాస్ వంటి వాటిపైన ద్రవ్యపెట్టుబడి కంట్రోల్ ఉంది. అలాగే ఇప్పుడు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సు, డిజిటలైజేషన్, మొత్తం ఈ డిజిటల్ ఎకానమీ, మీడియా...

**❝ అయితే 1991 తర్వాత, సోషలిస్టు వ్యవస్థ కూలి పోయిన తర్వాత సామ్రాజ్యవాదం యుద్ధాలు అపేస్తుందని అనుకున్నారు. కానీ ఇరాన్-ఇరాక్ మధ్య యుద్ధం వచ్చింది. యుగోస్లేవియాలో యుద్ధం జరిగింది. సెర్బియా యుద్ధం, పాలస్తీనా ఇజ్రాయిల్‌కూ మధ్య, పశ్చిమాసియాలో అనేక సార్లు యుద్ధాలు వచ్చాయి. ఇవన్నీ సామ్రాజ్యవాదుల జోక్యంతో జరిగిన యుద్ధాలే. ఈ రకంగా చూసుకుంటే యుద్ధాలు ఎక్కడా ఆగలేదు. ❞**

ఇవన్నీ అంతర్జాతీయ ద్రవ్యపెట్టుబడి నియంత్రణలోనే ఉన్నాయి. ప్రస్తుతం మన దేశ మీడియాపై అదానీలు, అంబానీలకు పూర్తి కంట్రోలు ఉన్నట్లు మనకు కనిపిస్తోంది. కానీ అదానీ, అంబానీ కంపెనీల్లో పెట్టుబడులు ఎవరివి? అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిదారు లవే. కాబట్టి ఈ రోజుకీ ప్రపంచం మీద ద్రవ్య పెట్టుబడి నియంత్రణ ఉంది. తన పట్టును రక్షించుకోవాలంటే, ద్రవ్యపెట్టుబడి ఆయా దేశాల్లోని ఆర్థిక వ్యవస్థలపైనా, ఉద్యమాలపైనా నియంత్రణ చేయాలి. అందుకనే సామ్రాజ్యవాదం ఎక్కడకీ వెళ్లలేదు. లెనిన్ చెప్పినట్లు సామ్రాజ్యవాదం ఉంది. అది ఉన్నంతకాలం దోపిడీ, యుద్ధాల ప్రమాదం ఉంటాయి.

అయితే అప్పటికీ ఇప్పటికీ ఒకటే తేడా ఏమిటంటే, సామ్రాజ్యవాదుల మధ్య పెద్దఎత్తున వైరుధ్యం ఉండి తాగాదా పడే పరిస్థితి ఇప్పుడు లేదు. సోషలిస్టు వ్యవస్థ బలంగా ఉన్నప్పుడు కూడా అది యుద్ధానికి వ్యతిరేకం కాబట్టి, అది ప్రపంచ యుద్ధాన్ని నివారించింది, స్థానిక యుద్ధాలను కూడా పరిమితం చేయడానికి ప్రయత్నాం చేసింది. సోవియట్ యూనియన్ కూడా దెబ్బతిన్న తర్వాత చైనా, వియత్నాం ఇటువంటి దేశాలు ఈ రోజు సామ్రాజ్యవాదం కన్నా బలహీనంగా ఉన్నాయి. ఒకవేళ అవి సామ్రాజ్యవాదులతో సమ ఉజ్జీలుగా బలపడి నా సరే యుద్ధాన్ని కోరుకోవు. మళ్ళీ ఈ సామ్రాజ్యవాద దేశాల మధ్య తగాదాలు తీవ్రమై వాళ్లు ప్రపంచ యుద్ధాని తీసుకురావాలే తప్ప, లేక అమెరికానే ఏకపక్షంగా మొత్తం సర్వనాశనం చేయాలనే ఆలోచనతో దేశాలపై దాడి చేస్తే తప్ప ప్రస్తుతానికి అమెరికా కోర కుండా ప్రపంచ యుద్ధం వచ్చే అవకాశం లేదు.

అయితే 1991 తర్వాత, సోషలిస్టు వ్యవస్థ కూలిపోయిన తర్వాత సామ్రాజ్యవాదం యుద్ధాలు అపేస్తుందని అనుకున్నారు. కానీ ఇరాన్–ఇరాక్ మధ్య యుద్ధం వచ్చింది. యుగోస్లేవియాలో యుద్ధం జరిగింది. సెర్బియా యుద్ధం, పాలస్తీనా ఇజ్రాయిల్‌కూ మధ్య, పశ్చిమాసియాలో అనేక సార్లు యుద్ధాలు వచ్చాయి. ఇవన్నీ సామ్రాజ్యవాదుల జోక్యంతో జరిగిన యుద్ధాలే. ఈ రకంగా చూసుకుంటే యుద్ధాలు ఎక్కడా ఆగలేదు. తాజాగా అమెరికా – ఇరాక్‌పైనా, ఆఫ్ఘనిస్తాన్ పైనా చేసిన యుద్ధాలు, ఇప్పుడు ఇజ్రాయిల్–హమాస్‌కు మధ్య జరుగుతున్న యుద్ధం మనముందున్నాయి. ఉక్రెయిన్‌కి–రష్యాకు మధ్య ఘర్షణ జరుగుతోంది. ఇప్పుడు పాకిస్తాన్–ఇరాన్ బాంబులు వేసుకున్నాయి. ఇరాన్ హౌతీలు ఎర్ర సముద్రంలో దాడులు జరుపుతున్నాయి. ఇవన్నీ చూస్తే యుద్ధం ఎక్కడా ఆగలేదు. వాస్తవానికి లెక్కలు చెబుతున్నదేంటంటే, రెండో ప్రపంచ యుద్ధంలో చనిపోయిన వాళ్లకంటే ఈ ప్రాంతీయ యుద్ధాల్లో చనిపోయినవారు అనేక రెట్లు ఎక్కువగా ఉన్నారు. కాబట్టి సామ్రాజ్యవాదం ఎక్కడ ఉంటే అక్కడ యుద్ధం ఉంటుంది.

ఈ యుద్ధాలు ఎందుకొస్తున్నాయని చూస్తే, లెనిన్ చెప్పిన లక్షణాలవల్లే. ఒకటి సామ్రాజ్యవాదులకు మార్కెట్లు కావాలి. ఉన్న వాటిని రక్షించుకోవాలి. ముఖ్యంగా ఎనర్జీ మార్కెట్. ఇంధనంపై ఆధిపత్యం. దానిపైన కంట్రోల్ లేకపోతే అమెరికా బలహీనపడిపో తుంది. అందుకని ఆ ఇంధనంపై ఆధిపత్యం కోసం అమెరికా నాలుగు పద్ధతుల్ని అనుసరిస్తుంది.

ఒకటి : సౌదీ అరేబియా ఇటువంటి దేశాల్లో ఉండే రాజరిక నియంతృత్వ వ్యవస్థల్ని రక్షించడం ద్వారా అక్కడ పెత్తనం కొనసాగి స్తోంది. ఈ రాచరిక వ్యవస్థలు ఎక్కడ ఉంటే అక్కడ ప్రజల్ని అణచివేస్తాయి. ప్రజాస్వామ్యం కూలిపోతుంది.

రెండవ పద్ధతి : దేశాలన్నింటిలోనూ సరళీకరణ విధానాల్ని పెట్టి, అంతర్జాతీయ ఫైనాన్స్ పెట్టుబడిని ప్రవేశించేలా చేసి ఆ పెట్టుబడిమీద ఆ దేశాలు ఆధారపడేలా చేసి, అమెరికాకు ఎదురు తిరిగితే మీ ఆర్థిక వ్యవస్థ అంతా కుప్పకూలిపోతుందని భయపెడుతూ, వాళ్లని గుప్పిట్లో పెట్టుకుంటోంది.

మూడో పద్ధతి : చమురు సమృద్ధ దేశాలైన పశ్చిమాసియా దేశాల మధ్య ఇజ్రాయిల్ అనే చిన్న దేశాన్ని ఏర్పాటు చేసి, దానికి ఆయుధాలు, డబ్బు ఇచ్చి ప్రోత్సహించి అరబ్బు భూభాగాలతో నిరంతరం వైరంలో ఉండేట్టు చేసి, ఆ ప్రాంతంపై పట్టు సాధిం చడం.

నాలవ పద్ధతి : అరబ్ దేశాల్లో అనేక తెగల ప్రజలు ఉన్నారు. మన దేశంలో కులాల మధ్య కొట్లాటల్ని సృష్టించినట్లు, ఆఫ్రికా, అరబ్ దేశాల్లో తెగల మధ్య ఘర్షణల్ని సృష్టిస్తోంది. ఈ అంతర్గత ఘర్షణల్లో మునిగే క్రమంలో అమెరికా ఆధిపత్యం గురించి మర్చిపోయే పరిస్థితి కలిగిస్తుంది.

అలాగే ఈరోజు చైనాను నిలువరించడం కోసం దక్షిణ చైనా సముద్రంలో అమెరికా ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తోంది. చైనాకు వ్యతిరేకంగా భారతదేశాన్ని తన యుద్ధ వ్యూహంలో జూనియర్ భాగస్వామిగా చేసుకుం టున్నది. మాల్దీవుల్లో నేడు జరుగుతున్న ఘటనలను అర్థం చేసుకోవాలంటే కూడా సామ్రాజ్య యుద్ధ వ్యూహాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ఇటీవల మోడీ గారు లక్షదీవులకు వెళ్లారు. బీచ్‌లో కొన్ని ఫొటోల్ని తీసుకున్నారు. దాంతో ఆగకుండా మీరు పెళ్ళిళ్లు విదేశాల్లో ఎందుకు చేసుకుంటున్నారు. ఇంత సుందరమైన ప్రాంతంలో చేసుకోవచ్చుగా అని ట్విట్టర్ వేదికగా చెప్పారు. టూరిజానికి ఇంతకంటే గొప్ప ప్రదేశం ఎక్కడ ఉందని ప్రశ్నించారు. దీనిపై మాల్దీవుల్లో ముగ్గురు మంత్రులకు కోపం వచ్చింది. మన దేశ ప్రధాని ఉగ్రవాది అని అవహేళన చేస్తూ ట్విట్టర్‌లో పెట్టారు. ఒక దేశ ప్రధానిని అలా అంటే ఊరుకుంటారా..! మన వాళ్లకు కోపం వచ్చింది. ఆ దేశానికి వెళ్ళకూడదు, అక్కడికి వెళ్లి పెళ్ళిళ్ళు చేసుకోకూడదు, అక్కడ సినిమాలు తీయకూడదని సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. ఈజీ మై ట్రిప్ టిక్కెట్లు రద్దు చేసింది. మీ దేశం నుండి రాకపోతే చైనా నుండి మాకు టూరిస్టులు వస్తారు అని మాల్దీవుల నాయకులు ప్రకటన చేశారు. అసలు దీనికి పూర్వరంగాన్ని పరిశీలిస్తే మాల్దీవుల జనాభా 5 లక్షల 25వేలు. వారిలో లక్షకుపైగా విదేశస్తులు. భారతదేశం నుండి జీవనభృతి కోసం అక్కడికి వెళ్ళిన వాళ్లు 33 వేల మంది. అంత

**❝ అరబ్బు దేశాలలో చైనా ప్రభావం పెరుగుతోంది. మధ్య ప్రాచ్యంలో చిరకాల ప్రత్యర్థులైన సౌదీ అరేబియా. ఇరాన్‌ల మధ్య స్నేహాన్ని చైనా పెంచించి. కాబట్టి ఇంధనంపై పట్టు ఉన్న దేశాల్ని ఏదో ఒక రకంగా దెబ్బకొట్టాలని అమెరికా చూస్తోంది. ఈ రోజు అమెరికా ఈ ప్రాంతంలో చేస్తున్న వ్యూహాత్మక దాడులకు ఇదే ప్రధాన కారణం. అటువంటి అమెరికా పంచన భారతదేశం చేరింది. కాబట్టి ఈ విధానం భారతదేశ ఆర్థిక వ్యస్థకీ, విదేశాం గ విధానానికీ చాలా నష్టం కలిగిస్తుంది. ❞**

చిన్నదేశానికి ఉన్న ప్రాధాన్యత ఏంటి అని చూస్తే. ఇది హిందూ సముద్రంలో వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగి ఉంది. చైనాకు ఎగుమతి అయ్యే నూనెలో 80 శాతం ఆ ప్రాంతం ద్వారానే వెళ్తుంది. ఆ ప్రాంతాన్ని గుప్పెట్లో పెట్టుకోవడం ద్వారానే చైనాను కంట్రోల్ చేయవచ్చు. అమెరికాకు చైనాను కంట్రోల్ చేయాలంటే ఎక్కడో దక్షిణ చైనా సముద్రానికి పోనక్కరలేదు. ఈ దీవులపై వాళ్లకు కంట్రోల్ ఉంటే చాలు. అమెరికా ఇక్కడకు వచ్చి కంట్రోల్ చేయడం కష్టం. కాబట్టి అమెరికా తరపున భారతదేశం కంట్రోల్ చేస్తుంది. భారతదేశ ప్రభావం కింద మాల్దీవులుంటే అమెరికాకు ఉపయోగం. మాల్దీవుల్లో 99 శాతం మంది ముస్లింలు. మన దేశంలో లౌకిక విధానాన్ని పాటిస్తున్నంత కాలం, మనం అలీన విధానం పాటిస్తున్నంత కాలం ఆ దేశంతో మనకు పెద్ద సమస్య రాలేదు. ఐక్య రాజ్యసమితిలో పాలస్తీనా ప్రజల కోసం వారి హక్కుల కోసం మాట్లాడుతున్నంత కాలం అరబ్ దేశాలతో మనం స్నేహంగా వ్యవహరిస్తూ, అలాగే ఇరుగుపొరుగు దేశాలతో స్నేహంగా ఉన్నప్పుడు మతం అనే సమస్య ముందుకు రాలేదు. ఎప్పుడైతే మన దేశంలో హిందూత్వ ధోరణి పెరిగిందో మాల్దీవుల అంతర్గత రాజకీయాల్లో దాని ప్రభావం పడింది. కానీ మన విదేశాంగ విధానాన్ని సామ్రాజ్యవాద ప్రయోజనం శాసిస్తున్నంత కాలం, చైనా దాని పురోభివృద్ధిని ఆపడానికీ, దాన్ని ప్రపంచంలో ఒంటరిపాటుని చేయడానికీ భారతదేశం పావుగా ఉపయోగపడుతున్నంత కాలం అమెరికా పన్నిన వ్యూహంలో భాగంగా మాల్దీవుల సమస్య ముఖ్యమైన అంశంగా ఉంటుందని మనం అర్థం చేసుకోవాలి.

ఇజ్రాయిల్ – హమాస్ మధ్య ఘర్షణ చూస్తే ఎన్ని దుర్మార్గాలు చేసినా ఇజ్రాయిల్ అక్కడ ఉండాలన్నది అమెరికా ఆకాంక్ష. అందుకే దాని దుర్మార్గాలను అమెరికా సమర్థిస్తోంది. ఇప్పుడు గాజా యుద్ధ పర్యవసానాలు ప్రమాదకరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. హౌతీ తిరుగుబాటుదారులు ఎర్ర సముద్రంలో నౌకలపై బాంబులు వేయడం ప్రారంభించారు. వీళ్ళు ఎందుకిలా చేస్తున్నారు? పాలస్తీనా మీద ఇజ్రాయిల్ యుద్ధం చేస్తున్నది కాబట్టి ఇజ్రాయిల్‌కి సహకరించే వారిమీద తాము దాడి చేస్తామని హౌతీలు ప్రకటించారు. ప్రపంచంలోని వ్యాపారంలో 20 శాతం సూయిజ్ కాలువ ద్వారా ఎర్ర సముద్రంలోకి, అక్కడనుండి అరేబియా సముద్రంలోకి వస్తుంది. ఇప్పుడు ఎర్ర సముద్రంలో జరిగే దాడుల్ని రక్షించుకోవడానికి అతి దగ్గరగా ఉండి సహాయం చేయగలిగే రెండు దేశాలు పాకిస్తాన్, భారతదేశం. పాకిస్తాన్ అమెరికా మాట వినటం లేదు. భారత నౌకాదళం అమెరికా ఓడల్ని రక్షిస్తున్నట్లు, ప్రాణనష్టం జరగకుండా చూస్తున్నట్లు చెబుతున్నారు. ఈరోజు అమెరికాతో వ్యూహాత్మక సంబంధం పెట్టుకున్నారు కాబట్టి భారత ప్రభుత్వం వారికి అక్కడ సహాయం చేస్తోంది. దీనివల్ల భారతదేశానికి నష్టం జరిగే ప్రమాదం ఉంది. గాజా యుద్ధంలో తొలుత ఇజ్రాయిల్ పక్షం వహించిన భారత ప్రభుత్వం చమురు ఉత్పత్తులు ఆపేస్తున్నట్లు ఆ ప్రాంత దేశాలు ప్రకటించడంతోనే వెనక్కి తగ్గి ఐక్య రాజ్యసమితిలో పాలస్తీనాకు అనుకూలంగా ఓటు వేసింది. ఈరోజు ఎర్ర సముద్రం మీద అమెరికాకో, ఇజ్రాయిల్‌కో సహాయకారిగా భారత్ ముందుకుపోతే అరబ్ దేశాలన్నీ మన దేశాన్ని బాయ్‌కాట్ చేసే ప్రమాదం ఉంది. మన దేశానికి కావలసిన చమురు, సహజవాయువుల్లో 80 శాతం ఈ ప్రాంతం నుండే దిగుమతి అవుతోంది. కాబట్టి అక్కడ మనం శాంతిని కోరుకోవాలి. కానీ ఈ రోజు మన ప్రభుత్వం అమెరికాతోనూ, సామ్రాజ్య వాదంతోనూ అంటకాగి వాళ్ల ప్రయోజనాల్ని రక్షించే విధంగా వ్యవహరిస్తోంది. యుద్ధం ఇంకా కొనసాగితే మన దేశంతో సహా ఈ ప్రాంత దేశాలన్నీ సమిధలు అవుతాయి. గుత్తపెట్టుబడిదారుల లాభాలు మాత్రం స్థిరంగా ఉంటాయి. స్థిరంగా ఉండటమే కాకుండా యుద్ధాల వల్ల వారి లాభాలు ఇంకా పెరుగుతాయి. ఎందుకంటే, యుద్ధ సామగ్రిని తయారు చేస్తోన్న అమెరికా తుపాకులు, బాంబులు, ఆయుధాలు అమ్ముకుంటుంది. దానివల్ల ఆ దేశంలో ఉద్యోగిత పెరుగుతుంది. అమెరికా ఆర్థిక వ్యవస్థ దెబ్బతినిపోయే పరిస్థితి నుండి ఇప్పుడు ఉక్రెయిన్, గాజా యుద్ధాల వల్ల మళ్ళీ కోలుకుంటోందని చెబుతున్నారు.

అలాగే రష్యా దగ్గర గ్యాస్, ఆయిల్ ఇంధనం ఉంది. యూరప్ రష్యాపై ఆధారపడ కుండా ఉండాలంటే యుద్ధం జరగాలి. అందుకే ఉక్రెయిన్‌ను ఎగదోసి యుద్ధాన్ని ప్రోత్స హించింది అమెరికా. అమెరికా ఆంక్షల వల్ల రష్యా ఆయిల్ అమ్ముడు పోవటం లేదు కాబట్టి ఆ దేశం ఎవరు అడిగితే వాళ్లకు చవగ్గా ఇస్తున్నది. మన దేశంలో అంబానీ ఆ చమురు ను చవగ్గా కొని, ఇక్కడ రిఫైన్ చేసి యూరప్‌కు అమ్ముకుంటున్నాడు. బహుశా వాళ్ళ జీవితంలో ఎప్పుడూ రాని లాభం ఈ రెండేళ్ళలోనే వచ్చింది.

అరబ్బు దేశాలలో చైనా ప్రభావం పెరుగుతోంది. మధ్య ప్రాచ్యంలో చిరకాల ప్రత్యర్థులైన సౌదీ అరేబియా. ఇరాన్‌ల మధ్య స్నేహాన్ని చైనా పెంచింది. కాబట్టి ఇంధనంపై పట్టు ఉన్న దేశాల్ని ఏదో ఒక రకంగా దెబ్బకొట్టాలని అమెరికా చూస్తోంది. ఈ రోజు అమెరికా ఈ ప్రాంతంలో చేస్తున్న వ్యూహాత్మక దాడులకు ఇదే ప్రధాన కారణం. అటువంటి అమెరికా పంచన భారతదేశం చేరింది. కాబట్టి ఈ విధానం భారతదేశ ఆర్థిక వ్యవస్థకీ, విదేశాంగ విధానానికీ చాలా నష్టం కలిగిస్తుంది.

ఈ ప్రాంతంలో అమెరికా చేస్తున్న యుద్ధాల వల్ల ఎక్కడో ఎవరికో నష్టం జరిగితే మన ప్రజలు పట్టించుకోకపోవచ్చు. కానీ మన ప్రభుత్వ విదేశాంగ విధానం వల్ల మన ఆర్థిక వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది. చిన్న దేశమైన మాల్దీవుల పట్ల మన ప్రభుత్వం వ్యవహరించిన తీరువల్ల జరిగే నష్టాన్ని చూస్తున్నాం. అరేబియన్ సముద్రం చాల కీలకమైనది. దాని గుండా మనకు నూనె సరఫరా జరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు సామ్రాజ్యవాదంపైనా, దాని అధిపత్యం పైనా మనం పోరాటం చేయాల్సిన అవసరం ఏమిటో బోధపడుతుంది.

**ఆశాజనక పరిణామాలు**

చైనా, వియత్నాం, ఇతర సోషలిస్టు దేశాలు అంతర్జాతీయంగా అనేక రకాల ఆర్థిక సంబంధాలు పెట్టుకుని ఎదుగుతున్నాయి. కాబట్టి అంతర్జాతీయ పెట్టుబడిలో వచ్చే సమస్యల ప్రభావం ఆయా దేశాల మీద కూడా

**"రష్యాలో బోల్షివిక్ పార్టీలో కూడా లెనిన్‌ని నమ్మినవాళ్ళు తక్కువ. అంతటి నిస్పృహ వాతావరణం ఆనాడు ఉన్నది. అయినా 1917 అక్టోబర్ నాటికి విప్లవం వచ్చింది. అందువల్ల కొన్ని పరిస్థితులు వచ్చినప్పుడు వేగంగా మార్పులు వస్తాయి. అలా వేగంగా మార్పులు వచ్చినప్పుడు పరిణామాలు వేగంగా జరుగుతాయి."**

ఉంటుంది. ప్రపంచంలో ఇంత జరుగుతుంటే, దాడికి గురవుతున్న దేశాలకు చైనా ఎందుకు మద్దతు ఇవ్వదు అనే చర్చ జరుగుతోంది. నిజానికి చాలా సందర్భాల్లో చైనా మద్దతు ఇస్తోంది. పరోక్షంగా ఉక్రెయిన్, పాలస్తీనాకు చైనా మద్దతు ఇస్తోంది. కాని సోవియట్ యూనియన్ చేసినట్లు ప్రత్యక్షంగా రాగలిగినటు వంటి పరిస్థితి లేదు. ఇటువంటి పరిస్థితుల్లో అంతర్జాతీయంగా సామ్రాజ్యవాదం ఆటలు సాగుతున్నాయి. అలాగే అమెరికాలో ట్రంప్, భారత దేశంలో మోడీ మాదిరిగా మితవాద శక్తులు బలం పుంజుకుంటున్నాయి. ఇంకోవైపు విప్లవోద్యమం బలహీనపడినట్లు కనపడుతోంది. కమ్యూనిస్టు పార్టీల ఎదుగుదల లేదు. ఇక విప్లవానికి అవకాశం ఉన్నదా..! అనే ఆలోచనలు వస్తున్నాయి. కమ్యూనిజానికి భవిష్యత్ ఉన్నదా..! సామ్రాజ్యవాదమే ఉన్నతమైనదా..! అనిపిస్తుంది. ఇటువంటివి చూసినప్పుడు విప్లవ శక్తులకు నిరాశ, నిస్పృహ వాతావరణం వస్తుంటాయి. ఇటువంటి పరిస్థితుల్లోనే చరిత్రను ఒకసారి నెమరువేసు కోవాలి.

ఇప్పుడే కాదు నిరాశ, నిస్పృహలు లెనిన్ కాలంలో కూడా వచ్చాయి. 1905లో రష్యాలో మొదటి సారి విప్లవం వచ్చింది. కానీ విఫలమయింది. నాటి నుండి 1915 వరకు అక్కడ మన కంటే ఎక్కువ నిస్పృహ ఏర్పడే సందర్భాలు ఉన్నాయి. ఇక మనకు ప్రపంచ యుద్ధం, మనుషులు చనిపోయే పరిస్థితి వంటివి లేవు. కానీ వాళ్లు మొదటి ప్రపంచ యుద్ధంలో లక్షలాది మంది చనిపోయారు. లెనిన్ చెప్పినట్లు రెండవ ఇంటర్నేషనల్‌లోని మొత్తం కమ్యూనిస్టు పార్టీలు బూర్జువా వర్గం పంచన చేరిపోయాయి. యుద్ధం కావాలని చెప్పాయి. అప్పటి సోషల్ డెమోక్రాటిక్ పార్టీ సభ్యులు పార్లమెంటుల్లో యుద్ధాలకు గ్రాంట్లు పెంచాలని బూర్జువా ప్రతినిధులతోపాటు ఓట్లు వేశారు. రష్యాలో బోల్షివిక్ పార్టీలో కూడా లెనిన్‌ని నమ్మినవాళ్ళు తక్కువ. అంతటి నిస్పృహ వాతావరణం ఆనాడు ఉన్నది. అయినా 1917 అక్టోబర్ నాటికి విప్లవం వచ్చింది. అందువల్ల కొన్ని పరిస్థితులు వచ్చినప్పుడు వేగంగా మార్పులు వస్తాయి. అలా వేగంగా మార్పులు వచ్చినప్పుడు పరిణామాలు వేగంగా జరుగుతాయి.

ఇప్పుడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి చూస్తే అంత హుషారుగా ఏమీ లేదు. ఒక రకరమైన ఆర్థిక స్థంభన ఏర్పడింది. ఇప్పుడు అక్కడక్కడా కనపడుతున్న అభివృద్ధి కూడా తాత్కాలికమే. మరోవైపు సోషలిస్టు వ్యవస్థ దెబ్బతిన్నా మిగిలి ఉన్న సోషలిస్టు దేశాలు పురోభివృద్ధి సాధిస్తున్నాయి. ఈరోజు అంతర్జాతీయ పెట్టుబడి తన లాభాల కోసం ప్రపంచంమీద దోపిడీ తీవ్రం చేస్తుంటే దాని పర్యవసానంగా ప్రజలు తీవ్రమైన అశాంతికి గురవుతున్నారు. దాంతో వారు పోరాటాలు, ఉద్యమాలు చేస్తున్నారు. ఆ ఉద్యమాల ప్రతిఫలమే ప్రపంచంలో నేడు కనిపిస్తున్న అశాంతి.


సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించేశక్తులు, మితవాదాన్ని, మత ఛాందసాన్ని వ్యతిరేకించే శక్తులు ముందుకు వస్తున్నాయి. ఈ పోరాటాలు అన్నీ ఇప్పుడు విజయం సాధించక పోవచ్చు. కానీ ఈ అపజయాలనుండి ప్రజలు సరైన మార్గం ఎంచుకునే పద్ధతి వస్తుంది. భారత దేశంలో 1857లో జరిగిన పోరాటాన్ని ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం అని మార్క్స్ అన్నాడు. నాడు బ్రిటీష్ చక్రవర్తిపై పోట్లాడిన వాళ్లు అభ్యుదయవాదులు కారు. ఊడగొట్టిన జమిందార్లు, రాజులు, మత ఛాందసంతో ప్రభావితులైన సైనికులు అందులో పాల్గొన్నారు. బ్రిటీషువాళ్ల పరిపాలన వల్ల ప్రజలంతా విసిగి వేసారిపోయారు. అందువల్ల నాడు ఎవరు తిరుగుబాటు చేస్తే వారి వెనుక వెళ్లారు. దేశం మొత్తం మీద రైతాంగం వీరి వెనుక చేరింది. ఏ భూస్వాములైతే, ఏ రాజులైతే తమని ఇప్పటి వరకు దోపిడీ చేశారో అటువంటివారికి సానుకూలంగా రైతాంగం కదిలారు. ఆ పోరాటమే ఒక అభ్యుదయ జాతీయోద్యమానికి ప్రాతిపదిక అయ్యింది.

కాబట్టి ఈ రోజు కూడా అటువంటి స్థితులే ఉన్నాయి. ఏ దేశంలో ఏ మూల అటువంటి అభ్యుదయ శక్తులు ప్రధానమైన శక్తులుగా ముందుకు వస్తాయో చెప్పలేం. ఆ రోజ రష్యాలో విప్లవం వస్తుందని కూడా ఎవ్వరూ చెప్పలేదు. నిజానికి రాదని అనుకున్నారు. అప్పుడు లెనిన్ మాత్రమే చెప్పాడు. సామ్రాజ్యవాదం అంతా ఒక గొలుసు లాంటిది. బలమైన లింకులు ఉన్నచోట తెగదు. బలహీనమైన లింకు ఉన్న చోటు తెగిపో తుంది. కాబట్టి రష్యాలో సామ్రాజ్యవాద లింకు బలహీనంగా ఉంది, ఇక్కడ తెగిపోతుందని లెనిన్ చెప్పాడు. అందుకనే ఇక్కడ విప్లవం తెద్దాం అన్నాడు. ఈరోజు మళ్లీ ప్రపంచంలో అభివృద్ధి శక్తులు ప్రధానమైన పాత్ర నిర్వహిస్తు న్నాయన్న వాతావరణాన్ని మనం గమనించాలి. ఆశ్చర్యకరమైన రీతిలో ఈ మార్పు వస్తుందని మనం గమనంలో పెట్టుకోవాలి. ఇది కేవలం ఆశ కాదు. చారిత్రకంగా పరిశీలన చేసి, సామ్రాజ్యవాద స్వభావాన్ని మనం అర్థం చేసుకుంటే, అది ఎటువంటి శక్తుల్ని గుర్తిస్తుందో, ఎటువంటి శక్తుల్ని వినియోగించుకుంటుందో, ఎటువంటి వాటిని నాశనం చేసే ప్రయత్నం చేస్తుందో అర్థం చేసుకుంటే అటువంటి ఆశావాదం మనకు కలుగుతుంది. ఒక శాస్త్రీయమైన ఆశావాదం కలుగుతుంది.

అలాగే ఈ పదేళ్లలో మన దేశంలో మోడీ పాలన కూడా మనకు ఈ విషయాన్నే చెబుతోంది. మన దేశంలో జి-20 నిర్వహించ డం, అమెరికా అధ్యక్షుడితో సెల్ఫీలు దిగడం ఇవన్నీ భారత దేశంలో అడుగంటుతున్న ప్రతిష్టను నిలబెట్టుకోడానికి చేసే బిల్డప్పులే. అంతర్జాతీయంగా మన దేశం విజయాలు సాధిస్తున్నట్లు బాకాలూదుకోవడం, మన దేశాన్ని విశ్వగురువుగా చూపించుకోవడం.. ఇవన్నీ కూడా ప్రజల్లో అసంతృప్తినుండి దృష్టిని మళ్లించే ప్రయత్నాల్లో భాగమే. మనం మన దేశంలోని పరిస్థితుల్ని జాగ్రత్తగా అర్థం చేసుకుంటే భవిష్యత్తుపై విశ్వాసం, మనమీద మనకు ఆత్మ విశ్వాసం కలుగుతుంది. లెనిన్ శత వర్ధంతి సందర్భంగా ఇంకోసారి ఆయన రచనలు చదివి ఆకళింపు చేసుకుంటే ఈ ఆత్మవిశ్వాసం ద్విగుణీకృతమవుతుంది.

❊

# గుప్తుల కాలం: భూస్వామ్య సంబంధాలు


రచయిత ప్రజాశక్తి మాజీ సంపాదకుడు

ఎంవిఎస్ శర్మ

**(మార్క్సిస్టు నవంబర్ సంచికలో గుప్త సామ్రాజ్యం ఆవిర్భావం నుంచి విచ్ఛిన్నం దాకా వివరించాను. ఆ తర్వాత వ్యాసం ఇప్పుడు ఇస్తున్నాం.)**

గుప్తుల కాలంలో భారత ఉపఖండంలో భూ యాజమాన్య సంబంధాలు మార్పులకు లోనయ్యాయి. భారత భూభాగంలో భూస్వామ్య వ్యవస్థ సంబంధాలు అప్పటి నుంచీ నెలకొని క్రమంగా బలపడ్డాయి.

ప్రాచీన భారతీయ సమాజం అంతిమంగా భూస్వామ్య సమాజంగా మార్పు చెందడంలో కీలకపాత్ర పోషించినది భూదానాలు (గ్రాంట్లు). ప్రాచీన భారతంలో రాజ్యంలోని యావత్తు భూమీ పరిపాలించే రాజు అధీనంలో ఉండేది. వ్యవసాయోత్పత్తి కార్యకలాపాలలో ప్రధానంగా పాల్గొనే రైతాంగం వైశ్యులుగా, వివిధ రకాల శారీరక శ్రమ చేసేవారు శూద్రులుగా ఉండేవారు. ప్రభుత్వ అధికారులు వైశ్యులవద్దనుండి వివిధ రకాల పన్నులను వసూలు చేసేవారు. ఆ విధంగా జమపడిన ధనం నుండి ఉద్యోగులకు, సైనికులకు జీతాలు చెల్లించేవారు. పురోహితులకు కానుకలు, దక్షిణలు ఆ ధనంనుండే ఇచ్చేవారు. ప్రఖ్యాతి పొందిన హస్తకళల ఉత్పత్తులను, ఆభరణాలను, వస్త్రాలను, విలాస వస్తువులను ఖరీదు చేయడానికి ఆ ధనమే ఆధారం. ఐతే క్రీ.శ. 3, 4 శతాబ్దాల మధ్య తలెత్తిన సామాజిక సంక్షోభంలో ఈ పెత్తనానికి దిగువ తరగతులనుండి తీవ్ర వ్యతిరేకత రావడంతో (అక్టోబర్ మాసం సంచికలో ఈ సంక్షోభ కాలం గురించి వివరించాను) వ్యవస్థ అస్తవ్యస్తం అయిపోయింది. బలప్రయోగంతో పరిస్థితిని చక్కబెట్టగలిగిన అవకాశాలు ఏమాత్రమూ లేవు. దాంతో ప్రభువులు తమ అధికారాన్ని నిలబెట్టుకోడానికి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించక తప్పలేదు. సామంతులకు, దండనాయకులకు, పురోహితవర్గాలకు జీతాలు, కానుకలు ఇచ్చేబదులు భూమిని గ్రాంట్ల రూపంలో ఇవ్వడం మొదలైంది. ఆ విధంగా రాజు నుండి దానం రూపంలో పొందిన భూమి మీద జీవిస్తున్న రైతులనుండి పన్నులను, అక్కడ ఉండే శూద్రులనుండి శ్రమ రూపంలో సేవలను పొందే అధికారం రాజు నుండి అధికారులకు, పురోహిత వర్గాలకు సంక్రమించింది.

ఈ ఆధిపత్య వర్గాలు తమ పరిధిలో ఉండే రైతాంగం విధేయతతో వ్యవహరించేలా, రాజు అధికారాన్ని అంగీకరించి లోబడివుండేలా చూసుకునేవారు. అంతేగాక అప్పటివరకూ సాగులోకి తీసుకురాని భూములను వ్యవసాయ యోగ్యంగా మార్చి వ్యవసాయ విస్తరణకు కూడా పూనుకున్నారు. దాంతో ఉత్పత్తి పెరిగింది. సంక్షోభం నివారించబడింది. ఆదివాసీ తెగల ప్రజలు నివసించే గ్రామాలను దానంగా పొందిన పురోహిత వర్గాలు అక్కడి తెగలను వైదిక మతం పరిధిలోకి, కుల వ్యవస్థ చట్రంలోకి తీసుకురావడానికి ఈ భూదానాలు ఉపయోగపడ్డాయి. ఆ విధంగా పాలకవర్గాల భావజాల ఆధిపత్యం కూడా బలపడింది.

రాజ్యం యొక్క సైన్యం యావత్తూ అంతవరకూ ప్రభువు ఖజానా నుండే వేతనాలు పొందే విధానం పోయి, ఆయా ప్రాంతాల మీద అధికారం చెలాయించే దండనాయకుల పరిధిలో సైన్యాలు పోషించబడడం మొదలైంది. శాంతి, భద్రతల నిర్వహణ, వివాదాల పరిష్కారం, సైనిక దళాల నిర్వహణ ఈ దండనాయకుల పరిధిలో జరిగేవి. వీరినే సామంత ప్రభువులు అని కూడా పిలిచేవారు. ఈ మొత్తం బాధ్యతలు నిర్వహించడానికి కొంత విస్తీర్ణంలోని భూమిని వీరికి ప్రభువు కేటాయించేవారు.

కేవలం వ్యవసాయం మీద మాత్రమే గాక పశువుల మేతకు వినియోగించే భూములపై ఆ పశువుల యజమానులనుండి పన్ను వసూలు చేసేవారు. తోళ్ళు, కర్రబొగ్గు, మద్యం, ఉప్పు, చెక్కెర, వంటి సరుకులమీద కూడా పన్నులు వసూలు చేసేవారు. చేతివృత్తుల సరుకుల రవాణా, అమ్మకాలు కూడా పన్నుల పరిధిలో ఉండేవి. ఇంతవరకూ ఈ పన్నుల వసూలు కేంద్రీకృతం అయివుండేది. భూదానాలు మొదలయ్యాక ఆ భూమి పరిధిలో అన్ని రకాల పన్నుల వసూలు ఆ దానాలు పొందినవారి పరిధిలోకి వచ్చింది. అలా దానం పొందిన భూమి పరిధిలో లభించే భూ నిక్షేపాలు, ఖనిజాలు సైతం దానం పొందినవారికే చెందేవి.

కేంద్రీకృత పన్నుల వ్యవస్థ నడిచిన కాలంలో సవివరమైన జనాభా లెక్కలు అవసరం అయేవి. భూముల రికార్డులు, వాటి స్వభావం, సాగుచేసే పంటల వివరాలు సేకరించడం కూడా అవసరం అయేది. ఇందుకోసం పెద్ద యంత్రాంగం కూడా ఉండేది. ఆ ఉద్యోగులనందరినీ పోషించడం ప్రభుత్వానికి పెద్ద భారంగా పరిణమించేది. కాని భూదానాల రూపంలో అధికారాలు వికేంద్రీకరించ బడడంతో ఆ భారం తప్పిపోయింది.

భూదానాలు, అధికారాల వికేంద్రీకరణ ప్రభువు అధికారాన్ని పరిమితం చేశాయి. ప్రాచీన కాలంలో పెద్ద పెద్ద కోటలు, దుర్గాలు అవసరంగా ఉండేవి. కాని ఇప్పుడు ప్రభువుకు అనేక రాజధానులు వచ్చాయి. వీటిని స్కందావారాలు అనేవారు. ఇప్పుడు కోటలు కేవలం ప్రభువును, అతడి కుటుంబాన్ని, పరిచర్యలు చేసేవారిని, కొద్దిమంది సంపన్నులను

> **"పరిమితం అయిపోయిన ప్రభువు అధికారంతో మొత్తం రాజ్యాన్ని తన పెత్తనంలో ఉంచుకోవడం సాధ్యం కాదు. అందుచేత రాజుకు ఇప్పుడు దైవత్వాన్ని అపాదించి ఆ కొరవను భర్తీ చేయడానికి పురోహితవర్గాన్ని ఉపయోగించారు. ఎవరు ఎక్కడ ఏ యుద్ధంలోనైనా విజయాలు సాధిస్తే వాటి ఘనత అంతా రాజు ఖాతాలోనే వేయడం ద్వారా రాజు కీర్తిని ఇనుమడింపజేయడానికి ప్రయత్నించేవారు."**

రక్షించడానికి మాత్రమే ఉపయోగపడేవిధంగా చిన్నవిగా నిర్మించడం మొదలైంది.

పరిమితం అయిపోయిన ప్రభువు అధికారంతో మొత్తం రాజ్యాన్ని తన పెత్తనంలో ఉంచుకోవడం సాధ్యం కాదు. అందుచేత రాజుకు ఇప్పుడు దైవత్వాన్ని అపాదించి ఆ కొరవను భర్తీ చేయడానికి పురోహితవర్గాన్ని ఉపయోగించారు. ఎవరు ఎక్కడ ఏ యుద్ధంలోనైనా విజయాలు సాధిస్తే వాటి ఘనత అంతా రాజు ఖాతాలోనే వేయడం ద్వారా రాజు కీర్తిని ఇనుమడింపజేయడానికి ప్రయత్నించేవారు. అశోకుడు ప్రజల సంక్షేమానికి పాటుపడే ప్రభువుగా, శాంతి కాముకుడిగా అభివర్ణించుకున్న శాసనాలు ఉన్నాయి. అదే గుప్తుల కాలానికి వచ్చేసరికి రాజును "పరమేశ్వర మహారాజాధిరాజ" అని, "పరమ భట్టారక" అని, "అపర విష్ణువు" అని పొగడడం, రాణిని లక్ష్మీదేవి ప్రతిరూపంగా చెప్పడం మనకు కనిపిస్తుంది.

భూస్వామ్య యుగంలో ప్రతీ రాజూ తాను సూర్యవంశానికో లేక చంద్ర వంశానికో చెందినవాడినని చెప్పుకోడానికి తాపత్రయపడేవాడు. రాజులకు ఘనమైన వంశ చరిత్ర, ఉన్నతమైన కులంలో పుట్టినట్లు సారస్వతం సృష్టించారు. రాజులకు అసాధారణ మహిమలు ఉన్నట్టు ప్రచారం జరిగేది. రామాయణంలో, మహా భారతంలో ఇతర పురాణాలలో అటువంటి మహిమల గాథలు చాలా కనిపిస్తాయి.

**శూద్రులు-సామాజిక మార్పులు**

కలికాలంలో ప్రాచీన వర్ణాశ్రమ కట్టుబాట్లను, దాదాపుగా బానిసలమాదిరిగా జీవించవలసిన పరిస్థితులను ప్రతిఘటించడం ప్రారంభమైంది. భూదానాల అనంతరం వ్యవసాయంలో వచ్చిన మార్పులు, శూద్రుల సామాజిక స్థితిగతులలో చాలా మార్పులకు దారి తీశాయి. భూములను దానాలుగా పొందిన పురోహితవర్గాలకు, ఉన్నతాధికారులకు తమ ఆధీనంలోని భూములనుండి అత్యధిక ప్రయోజనం పొందడం అవసరం. ముఖ్యంగా దేవాలయాలకు, ఆరామాలకు ఇచ్చిన భూముల విషయంలో ఆ భూములమీద సాగు జరగడం దేవాలయాల. పురోహితవర్గాల నిర్వహణకు అవసరం. అందుచేత తమ వద్ద సేవకులుగా ఉండే శూద్రులకు దుక్కిటెద్దులను ఇచ్చి భూమిని కేటాయించి వ్యవసాయం చేయించే పద్ధతి కొన్ని చోట్ల అమలులోకి వచ్చింది. అలాంటి ఏర్పాటు జరిగిన చోట పండిన పంటలో ఆరోవంతు భూస్వామి వసూలు చేసేవాడు. (ఎక్కువ చోట్ల) స్వంత పశువులు ఉన్న రైతులు కూడా ఉండేవారు. ప్రాచీన భారత సమాజంలో కూలీలుగానో, లేక బానిసలుగానో పరిగణించబడే శూద్రులు ఇప్పుడు వ్యవసాయదారులుగా గుర్తింపు పొందారు. ఇది ముఖ్యంగా కొత్తగా వ్యవసాయం విస్తరించినందువలన ఏర్పడిన గ్రామాలలో పాటించారు. ఆ విధంగా ఏ హక్కులూ లేనివారిగా అంతవరకూ ఉండే శూద్రులలో గణనీయమైన భాగం ఇప్పుడు రైతులుగా, కౌలుదారులుగా గుర్తింపు పొందారు. క్రీ.శ.7వ శతాబ్దం నాటికి ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది.

ఆంధ్ర ప్రాంతంలో భూములను కౌలుకు ఇవ్వడం అనే సాంప్రదాయం కొత్తగా వ్యవసాయం విస్తరించిన భూముల విషయంలో మొదలైంది. ఈ పద్ధతి మొదలైనది పల్లవుల కాలంలో క్రీ.శ. 3 వ శతాబ్దం లో. క్రీ.శ. 5, 6 శతాబ్దాలనాటికి ఆదివాసీ తెగల ఆవాస ప్రాంతాలను బ్రాహ్మణులకు దానంగా ఇచ్చే విధానం ఆంధ్ర ప్రాంతంలో మొదలైంది.

క్రీ.శ.7వ శతాబ్దం నాటి ఒక శాసనంలో భూదానం పొందినవారు పొరుగు గ్రామాలనుండి రైతులను గాని, చేతివృత్తులవారిని గాని తమ భూభాగంలోకి అనుమతించరాదన్న నిబంధన కనిపించింది. ఇటువంటి పద్ధతి ఆ తర్వాత కాలంలో సర్వత్రా అమలులోకి వచ్చింది. గ్రామాలను " ధన-జన-సహితంగా" "జనత సమృద్ధం"గా, "స-ప్రతివాసి-జన-సమేతం"గా దానం ఇచ్చేవారు. అంటే ఆ గ్రామంలోని ప్రజలు దానం పొందినవారి ఆధీనంలోనే ఉండాలి. పొరుగు గ్రామాలవారికి అనుమతి లేదన్న నిబంధన కూడా దీనికి తోడై ఆర్థిక వ్యవస్థ ''మూసుకుపోయిన వ్యవస్థ'' గా మారిపోతూవచ్చింది.

భూములను సాగు చేసే వారికి చేతివృత్తులవారు తమ సేవలను అందించేవారు. దానికి ప్రతిఫలంగా పంటలు పండినప్పుడు అందులో ఒక చిన్న భాగాన్ని వారికి చెల్లించేవారు. ఈ సాంప్రదాయం క్రీ.శ.4వ శతాబ్దం నుండీ మొదలైందని చెప్పవచ్చు. కొన్ని చోట్ల చేతివృత్తులవారికి వారి సేవలకు ప్రతిఫలంగా చిన్న చిన్న భూభాగాలను కేటాయించిన దాఖలాలు కూడా ఉన్నాయి. సముద్రగుప్తుడి కాలంలో నలంద ప్రాంతంలోజారీ అయిన భూశాసనాలలో ఈ పద్ధతి కనిపిస్తుంది.

## 'మార్క్సిస్టు' పై మీ అభిప్రాయాలు తెలపండి!

'మార్క్సిస్టు' సైద్ధాంతిక మాసపత్రిక పైనా, పత్రికలోని నిర్దిష్ట వ్యాసాలపైనా మీ అభిప్రాయాలనూ, సూచనలనూ ఆహ్వానిస్తున్నాం. ఆయా వ్యాసాలపై మీరు చర్చించాల్సిన అంశాలున్నా, అదనపు సమాచారమున్నా క్లుప్తంగా రాసి పంపండి.

మీ లేఖలు అందాల్సిన చిరునామా!

**ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి ,**

**పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 9490098977**

దూర దేశాలతో జరిపే వాణిజ్యం శాతవాహనుల కాలంలో, కుషానుల కాలంలో ఉచ్ఛస్థాయిలో కొనసాగింది.(చూ. మ్యాప్) ఆ తర్వాత క్రమంగా క్షీణిస్తూవచ్చింది. రోమన్లతో వాణిజ్యం క్రీ.శ. 3 వ శతాబ్దం నాటికి దాదాపు అంతరించింది. ఇరాన్‌తో, బైజాంటియన్ రాజ్యంతో పట్టు వ్యాపారం క్రీ.శ.6వ శతాబ్దం నాటికి నిలిచిపోయింది. చైనాతో, ఆగ్నేయ ఆసియా దేశాలతో వ్యాపారం కొనసాగినా, సముద్రమార్గం ద్వారా ప్రధానంగా జరిగిన ఆ వ్యాపారంలో ప్రధాన లబ్ధిదారులుగా అరబ్బు మధ్య దళారీలు నిలిచారు. క్రీ.శ.6వ శతాబ్దం తర్వాత దాదాపు 300 సంవత్సరాలపాటు వాణిజ్యం పతనావస్థలో కొనసాగడంతో బంగారునాణేలు దాదాపు కనుమరుగయ్యాయి. వెండి, రాగి నాణేలకు కూడా కొరత ఏర్పడింది.

> **“ భూదానాలు, పట్టణాలు బలహీన పడడం, కలికాలంలోని సంక్షోభ పర్యవసానాలు. ఇవి ఒక విధమైన స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ రూపొందడానికి దారితీశాయి. మార్క్స్ దీన్ని “ఆసియా తరహా ఉత్పత్తి విధానం” అన్నాడు. మార్పుకు అవకాశంలేని, జడత్వంతో కూడిన వ్యవస్థగా పరిగణించాడు. దానిలోని వైరుధ్యా లను గుర్తించలేనపుడు మనకూ అలానే అనిపిస్తుంది. ఐతే ఉత్పత్తి సంబంధాలు భూస్వామ్యవ్యవస్థ తరహాలో పునర్నిర్మాణం అయిన తర్వాత అందులో ఎన్నో వైరుధ్యాలు, పరస్పర విరుద్ధ ప్రయోజనాలు కనిపిస్తాయి. ”**

వాణిజ్యం పతనం అవుతూ రావడంతో పట్టణాలు కూడా బలహీనం అవుతూవచ్చాయి. గుప్తులకాలంనాటికి కొద్ది పట్టణాలు మాత్రమే నిలదొక్కుకోగలిగాయి. మథుర, హస్తినాపురం, శ్రావస్తి, కౌశాంబి, రాజఘాట్, చిరంద్, వైశాలి, పాటలీపుత్రం వంటి పట్టణాలు క్రీ.శ.3 వ శతాబ్దం నాటికి వైభవోపేతంగా ఉండేవి. గుప్తుల కాలం నాటికి అవి దిగజారిపోయాయి. ఆ పట్టణాలన్నీ బౌద్ధులకు పవిత్ర స్థలాలు కావడం చేత వాటిని సందర్శించిన చైనా యాత్రికుడు



హ్యుయన్ త్సాంగ్ ఆ పట్టణాలన్నీ నిర్మానుష్యంగా శిథిలావస్థలో ఉన్నట్టు తన డైరీలో రాసుకున్నాడు.

భూదానాలు, పట్టణాలు బలహీన పడడం, కలికాలం లోని సంక్షోభ పర్యవసానాలు. ఇవి ఒక విధమైన స్వయంపోషక ఆర్థిక వ్యవస్థ రూపొందడానికి దారి తీశాయి. కార్ల్ మార్క్స్ దీనికి “ఆసియా తరహా ఉత్పత్తి విధానం” అని పేరు పెట్టాడు. ఎటువంటి మార్పుకూ అవకాశంలేని జడత్వంతో కూడిన వ్యవస్థగా పరిగణించాడు. ఆ వ్యవస్థలో ఇమిడివున్న వైరుధ్యాలను గుర్తించలేనప్పుడు మనకూ ఆ విధంగానే అనిపిస్తుంది. ఐతే ఉత్పత్తి సంబంధాలు భూస్వామ్య వ్యవస్థ తరహాలో పునర్నిర్మాణం అయిన తర్వాత అందులో ఎన్నో వైరుధ్యాలు, పరస్పర విరుద్ధ ప్రయోజనాలు కనిపిస్తాయి. అవన్నీ భూమిపై ఏ విధమైన హక్కు ఎవరికి ఉంది అన్నదాని చుట్టూ తిరుగుతాయి. అందుచేత ఆసియా తరహా సమాజం అనే దానిని ఏ మార్పూ లేని, జడత్వంతో కూడిన సమాజం అన్న అర్థంలో తీసుకుంటే అది మధ్య యుగాల భారతదేశానికి వర్తించదు. ఆసియా తరహా ఉత్పత్తి వ్యవస్థ అనేదానిని మనం స్వయంపోషకంగా ఉండిన తొలి మధ్యయుగాల భారతదేశ వ్యవస్థగా, తొలి దశలోని భూస్వామ్య వ్యవస్థగా పరిగణించాలి.

ఆసియా తరహా ఉత్పత్తి విధానం అన్నప్పుడు గ్రామంలో అంతరాలు లేని గ్రామ సమాజం అన్న అర్థం వస్తుంది. అటువంటి గ్రామంలో నివసించే కుటుంబాల మధ్య ఆర్థిక, సామాజిక అంతరాలు దాదాపు ఉండవు. ఇటువంటి పరిస్థితి మధ్య యుగాలలోని కొన్ని ఆదివాసీ గ్రామాల వరకూ వర్తిస్తుంది. అక్కడ భూమి, ఇతర వనరులు ఉమ్మడి సొత్తుగానే ఉండేవి. కాని గుప్తుల కాలం నాటికి గ్రామంలో మూడు, నాలుగు దొంతరలు (వర్గాలు) ఉండేవి. భూమిపై వారికి ఉండే హక్కు ప్రాతిపదికన ఆ వర్గాలు ఉండేవి. ఈ విభజనను భూదానాలు స్పష్టంగా ధృవీకరిస్తున్నాయి. భూమిమీద సర్వాధికారాలూ రాజువి. ఆ అధికారాన్ని రాజు తన తరఫున భూస్వామికి దఖలుపరుస్తాడు. భూస్వామి దానిమీద వ్యవసాయం చేయడానికి రైతుకు అనుమతినిస్తాడు. కొన్ని సందర్భాలలో ఆ రైతు తన భూమిని కౌలుకు మరొకరికి ఇస్తాడు. భూమి విషయంలో ఈ విధమైన అధికార పంపిణీ ఒకవైపు, పాలనా నిర్వహణలో జరిగిన వికేంద్రీకరణ ఫలితంగా కొంతమందికి సంక్రమించిన అధికారాలు ఇంకోవైపు గ్రామంలో కొత్త వర్గాలు రూపొందడానికి దారి తీశాయి. అగ్రవర్ణాల వారితోబాటు శూద్రులలో కొందరు గణనీయమైన మేరకు భూమిని సాగు చేసే అధికారాన్ని పొందారు. గ్రామంలోని ఆయా కులాల తరఫున పెద్దలుగా వ్యవహరించేవారికి తక్కిన వారి కన్నా ఉన్నతమైన సామాజిక హోదా ఉండేది. గ్రామ వ్యవహారాల్లో ఆ పెద్దల పాత్ర గణనీయంగా ఉండేది. ఇప్పటికీ వారి పాత్ర ఎంతో కొంతమేరకు గ్రామాల్లో కొనసాగుతోంది.

ధనిక రైతులకు దిగువన సామాన్య రైతులు ఉండేవారు. ప్రధానంగా పన్నులు చెల్లించే రైతులు వీరే. వీరిలో అత్యధికులు శూద్రులు.

నిర్బంధ చాకిరీ గ్రామంలోని వారందరిమీదా కొన్ని సందర్భాలలో అమలు జరిగేది. దీనిని విష్టి అనేవారు. తెలుగునాట దీనినే వెట్టి అన్నారు. రాజు కానీ, భూస్వామి కానీ వెట్టిచాకిరీకి ఆదేశించవచ్చు. చాకిరీ నిర్బంధం చేయడమే గాక, అందుకు ప్రతిఫలం కూడా ఏమీ లేకపోవడమే వెట్టి స్వభావం. ఐతే ఈ వెట్టిని రహదారులు, కాలువలు, కోటలు, రాజభవనాలు వంటివి నిర్మించే సందర్భాలలో మాత్రమే విధించే పద్ధతి మధ్య భారతంలో అమలులో ఉండేది. కాని దక్షిణ భారతదేశంలో వెట్టి వ్యవసాయ రంగంలో కూడా అమలు అయేది.

ఆ విధంగా క్రీ.శ.4–7 శతాబ్దాల మధ్య కాలంలో సామాజిక, ఆర్థిక దొంతరలు ఉండేవి. ఆ కాలపు భూశాసనాలు ఈ విషయానికి సాక్షీభూతంగా ఉన్నాయి. వివిధ దొంతరల ప్రజల నడుమ వైరుధ్యాలు ఉండడం వలన సమాజంలో మార్పులు జరుగుతూనే వుంటాయి.

***(తరువాయి వచ్చే సంచికలో)***


# FORM IV

**(Rule 8)**

**UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867**
**STATEMENT ABOUT OWENARSHIP AND OTHER PARTICULARS ABOUT MONTHLY MAGAZINE MARXISTU**

| | | |
|---|---|---|
| 1. Place of publication | : | Vijayawada, Hyderabad |
| 2. Periodicity of its Publication | : | Monthly |
| 3. Printer's Name | : | B.V. Ragavalu |
| Nationality | : | Indian |
| Address | : | D.NO.1 1 60/2<br>M.B.Bhavan, RTC X Roads<br>Hyderabad 20, Telangana State. |
| 4. Publisher's Name | : | B.V. Ragavalu |
| Nationality | : | Indian |
| Address | : | D.NO.1 1 60/2<br>M.B.Bhavan, RTC X Roads<br>Hyderabad 20, Telangana State. |
| 5. Editor's Name : S.Venkatrao | | |
| Nationality | : | Indian |
| Address | : | D.No.12 402/1/1<br>Amarareddy Colony,<br>Near Arvinda High School<br>Tadepalli, Guntur District – 522501, Andhra Pradesh. |
| 6. Names and addresses of individuals | : | B.V. Ragavalu |
| 7. Who own the newspaper and Partners or shareholders holding more than One percent of the total capital | : | D.NO.1 1 60/2<br>M.B.Bhavan,RTC X Roads<br>Hyderabad 20, Telangana State. |

**I, B.V. Ragavalu hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

**Sd/**
**Date : 31.01.2024** **(B.V.RAGHAVALU)**
**Publisher**

# దురాక్రమణ సైన్యానికి ప్రజా ప్రతిఘటన



రచయిత పియల్ఓ మాజీ అధికార పతినిధి

హనన్ అష్రవి

హనన్ దావూద్ మైఖేల్ అష్రవి, యాసర్ అరాఫత్ తర్వాత పాలస్తీనాలో బాగా గుర్తింపు పొందిన వ్యక్తి. పాలస్తీనా విమోచనా సంస్థకు (పిఅయల్ఒ) అధికార ప్రతినిధిగా పనిచేశారు. ఆమె ఒక పాలస్తీనా క్రిస్టియన్. **1996**లో పాలస్తీనా లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో జెరుసలెం ప్రతినిధిగా ప్రాతినిధ్యంవహించారు. **2006**లో తిరిగి ఎన్నికైనారు. **2020**లో పాలస్తీనా అథారిటీ, ఇజ్రాయిల్‌తో రక్షణ సమన్వయాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించింది. అందుకు నిరసనగా అష్రావి రాజీనామాచేశారు. ఆ ఒప్పందాలు పాలస్తీనా సమస్యను మినహాయి స్తాయని ఆమె నమ్మారు. అందుకే అబ్రహం ఒప్పందాలను (ఇజ్రాయిల్ పాలస్తీనాల మధ్య సయోధ్య ఒప్పందాలను) ఆమె విమర్శించారు. ఇటీవల పశ్చిమ తీరంలోని బిర్జెయిట్ యూనివర్శిటీ ట్రస్టీస్ బోర్డుకు ఛైర్ పర్సన్‌గా ఆమె నియమించబడ్డారు. **1990**లో ఇదే యూనివర్శిటీలో ఇంగ్లీష్ సాహిత్యాన్ని బోధించారు. ఆమె, రమల్లాలోని తన నివాసం నుండి 'ఫ్రంట్ లైన్'తో ఫోన్ ద్వారా సంభాషించారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

**ప్రశ్న : అక్టోబరు 7 హమాస్ సైనిక చర్య మిమ్మల్ని ఆశ్చర్యపరచిందా?**

**జవాబు :** ఆ చర్య, నన్ను ఆశ్చర్యపరచిందా లేదా అన్నది ముఖ్యం కాదు. ఇజ్రాయిల్ సైన్యాన్ని పాలస్తీనా యోధులు ఎదుర్కోవటం, నిలువరించటం అపూర్వమైనది. తన సేన ఓటమి ఎరుగనిదిగానూ, అత్యంత బలసంపన్నమైనదిగానూ చెప్పుకుని ఇజ్రాయిల్ విర్రవీగుతుంది. ఇప్పుడు, దాని బలహీనతలు పలు విధాలుగా బహిర్గతమైనాయి. అది గాజాను చుట్టుముట్టింది. నిరంతర బాంబు దాడులతో సాధారణ పౌరులను సంహరిస్తున్నది. అలాంటి దురాక్రమణ సేనకు వ్యతిరేకంగా సాగిన ప్రతిఘటనా చర్య అది.

**ప్రశ్న : పశ్చిమ దేశాలన్నీ ప్రతిఘటనను ఖండించాయి. ఇజ్రాయిల్ ప్రతి–దాడిలో వేలాది పాలస్తీనీయులు హతులౌతున్నారు. ఆ మానవ సంహారం నిరోధించబడదా?**

**జవాబు :** నేడు గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మారణకాండ అనేక దశాబ్దాలుగా కొనసాగుతున్నది. దీనికంటే ముందు గాజాపై జరిగిన ఐదు దాడుల్లో వేలాది పాలస్తీనా ప్రజలు చంపబడ్డారు. ఇది ఒక క్రమబద్ధమైన బీభత్సం. వారు, గాజాలోని ప్రజానీకాన్ని చాలా దూరం నుండి చంపారు. వారు బాధితులను తమ నేత్రాలతో ప్రత్యక్షంగా చూడాల్సిన అవసరం ఏర్పడలేదు. అది, ఇజ్రాయిల్ దురాక్రమణదారుల సైన్యం పాలస్తీనా పౌరులకు వ్యతిరేకంగా అవలంబిస్తున్న విధానం. ప్రధాన స్రవంతి మీడియా పాలస్తీనా ప్రజలకు ప్రాతినిధ్యంవహించటం లేదు. ఆ మీడియా, ఇజ్రాయిల్ వక్రీకరణలనే ఎలుగెత్తి చాటుతున్నది. సందర్భ శుద్ధిలేకుండా ఆ సంఘటనపై చర్చలు జరుపుతున్నది. వారి కట్టు కథలు పలుమార్లు ఖండనలకు గురైనాయి.

**ప్రశ్న : పాలస్తీనీయులకు ప్రతిఘటించే హక్కున్నదా?**

**జవాబు :** నిస్సందేహంగా 'అవును. ఉన్నది' అనేదే సమాధానం.

**ప్రశ్న : పాలస్తీనీయులకు, హమాస్ కేవలం మరణాలను, విధ్వంసాలను మాత్రమే సమకూర్చుతుందన్న భావన ఉంది. మీ అభిప్రాయమేమిటి?**

**జవాబు :** పశ్చిమ తీరంలో హమాస్ ఉందా? అక్కడ ఏం జరుగుతుందో మీకు అవగాహన ఉందా? అక్కడ పాలస్తీనీయులను చంపుతున్నపుడు ప్రపంచ నైతికత ఏమౌతున్నది? కేవలం పాలస్తీనీయులను మాత్రమే నైతిక బలం చూపాలని ఎందుకు అడుగుతున్నారు? ఈ ప్రశ్నలను మీరే వేసుకొండి. సమాధానాలు కనుగొనేందుకు ప్రయత్నించండి. పాలస్తినీయలను నిందించటం, వారు న్యూనతకు గురయ్యేలా చేయటమే ఆ నమూనాలో ఒక భాగంగా మారింది. పశ్చిమ తీరాన్ని ఈపాటికే వారు జయించుతున్నారు. అక్కడ ఇజ్రాయిలు సైన్యం మద్దతు పొందుతున్న సెటిలర్లకు, పాలస్తీనీయులకు మధ్య ప్రతి నిత్యం హింస కొనసాగుతున్నది. 2013వ సంవత్సరం పాలస్తీనీయుల పాలిటి ఒక 'రక్తతర్పణ కాలం'గా మారింది. అక్టోబరు 7కి ముందు కూడా అదే పరిస్థితి కొనసాగింది. ఇదంతా హమాస్ జాడేలేని వెస్ట్ బాంకులోనే జరిగింది.

ప్రతి రోజూ మేము దాడులకు గురౌతున్నాము. పశ్చిమ తీరంలోని ప్రతి పట్టణము, గ్రామాన్ని ఇజ్రాయిల్ సెటిలర్ల కాలనీలు ముట్టడిస్తున్నాయి. ప్రజలకు ఎలాంటి రక్షణ లేదు. ఈ పరిస్థితి నాకు ఆందోళన కల్గిస్తున్నది. ఈ హింసాకాండ, చీకటిలో నింపాదిగా జరుగుతున్నది. ప్రపంచానికి దీన్ని గురించి తెలియదు.

**ప్రశ్న : ఈ హమాస్ చర్య, పాలస్తీనీయుల లక్ష్యంపై చూపగల ప్రభావం ఎలా ఉంటుంది?**

**జవాబు :** ఈ ఘటనను, పాలస్తీనీయులపై ఉగ్రవాద ముద్రవేసేందుకు వినియోగించుకుంటారని ఆందోళన చెందుతున్నాను. గత 17 సంవత్సరాలుగా ముట్టడిలో మగ్గుతున్న గాజా ప్రజల ఆగ్రహాన్ని మీరు గమనించగల్గితే..... వారికి ఎలాంటి నమ్మకం లేదు. వారు కాల్పులకు గురయ్యారు. చంపబడ్డారు. తిండి, నీరు. భూమి ...వారికున్నదంతా గుంజుకున్నారు. వారిని మానవాధములుగా చూశారు. కనీస మానవ హక్కులను నిరాకరించారు.

**ప్రశ్న : హమాస్‌ను తుడిచేయాలన్న ఇజ్రాయిల్ డిమాండును పశ్చిమ దేశాలు బలపరుస్తున్నాయి. అనేక మంది, హమాస్‌ను, ఇస్లామిక్ స్టేట్ ఆఫ్ ఇరాక్ అండ్ సిరియా (ఐయస్ఐయస్)తో జమకడుతున్నారు.**

> **“హమాస్ అంటే ఏమిటో మీకు తెలుసా? ఇజ్రాయిలీలు దాన్ని తుడిచెయ్యాలని ప్రయత్నించారు. బాంబులువేశారు. తూటాల వర్షం కురిపించారు. ప్రజలను చంపేశారు. మొత్తం కుటుంబాలన్నింటినీ తరిమేశారు. కానీ హమాస్‌ను మాత్రం తుడిచేయలేక పోయారు. అదొక రాజకీయ, మిలిటరీ సంస్థ అని వారు అర్ధంచేసుకోలేదు. అదొక ప్రజా ప్రభుత్వానికి నాయకత్వ స్థానంలో ఉంది.”**



గాజాను సర్వ నాశనం చేస్తున్న ఇజ్రాయిల్ క్రూరత్వానికి ఈ దృశ్యం ఒక ప్రతిబింబం

**జవాబు :** హమాస్ అంటే ఏమిటో మీకు తెలుసా? ఇజ్రాయిలీలు దాన్ని తుడిచెయ్యాలని ప్రయత్నించారు. బాంబులువేశారు. తూటాల వర్షం కురిపించారు. ప్రజలను చంపేశారు. మొత్తం కుటుంబాలన్నింటినీ తరిమేశారు. కానీ హమాస్‌ను మాత్రం తుడిచేయలేక పోయారు. అదొక రాజకీయ, మిలిటరీ సంస్థ అని వారు అర్ధంచేసుకోలేదు. అదొక ప్రజా ప్రభుత్వానికి నాయకత్వ స్థానంలో ఉంది. దానికొక నిర్మాణం, సంస్థాపిత చట్టం, సాంఘిక సంక్షేమ ప్రణాళిక ఉన్నాయి. దాని పోరాట యోధులు, కేవలం ఒక మంద మాత్రం కాదు. బైటకు ఎక్కడా కన్పించరు. అది రాజకీయ నిర్మాణం (ఫాబ్రిక్) లో భాగం. వారు ఎన్నికల్లో నిలిచారు.

అలాంటి హమాస్‌ను వారెలా తుడిచేయబోతున్నారు? వారు ప్రజలందరినీ చంపేయనున్నారా? ఈ విషయమ్మై ఏంచెబుతారో గాజా ప్రజలను అడగండి. తమ కోసం హమాస్‌లో కనీసం కొందరైనా నిలుస్తారని వారు తప్పక చెబుతారు.

బాంబులేసి ప్రజలను చంపటంతోనే వారు హమాస్‌ను బల హీనపర్చ లేరు. ఆ ప్రజలు పాలస్తినా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పియల్ఒ) వంటి ఇతర సంస్థలను మేల్కొల్పుతారు. పియల్ ఒ చర్చల మార్గం పట్టిం ది. కానీ తిరిగి దాని కేమీ దక్కలేదు. మేము మంచిగా ఉండేందుకు ప్రయ త్నించాము. ప్రపం చం మా మాట వినేందుకు అవకాశ మిస్తుందని ఆశిం చాము. కానీ అది జరుగలేదు.

గాజాలో, దురా క్రమణా లేక ఉపసం హరణా? ఇజ్రాయిలు, ఈ రెంటిలో ఏదో ఒకదాన్ని ఎంపిక చేసుకోక తప్పని ఒక సంక్లిష్ట స్థితిలో ఉంది.

**ప్రశ్న : ఒస్లో శాంతి ఒప్పందం, రెండు రాజ్యాల విధానాన్ని ఆమోదించింది. ఆ అంశంలో పాలస్తినా నాయకత్వ శ్రేణుల్లో చీలికలు వచ్చాయని ఇజ్రాయిల్ నిందిస్తున్నది. మీరు కూడా ఆ ప్రక్రియలో భాగస్వామిగా ఉన్నారు. ఆ ప్రక్రియ ఎందుకు గాడితప్పిందో వివరించగలరా ?**

**జవాబు :** అదొక విషాద గాథ. ఆ ఒప్పందంపై మేము సంతకాలు చేశము. ఒస్లో ప్రక్రియ దిశగా పయనం ప్రారంభించాము. కానీ ఇజ్రాయిలు భూ కబ్జాలను, ‘సెటిల్‌మెంట్’ల నిర్మాణాన్ని కొనసాగించారు. వారి చర్యలను మేము సవాలుచేశాము. ఆ వైఫల్యానికి పాలస్తీనీయులను నిందించరాదు. వారు విస్తారమైన ప్రాంతాలను స్వాధీనం చేసుకోవాలని తలచారు. వారు మాతో ఇలా చెప్పారు : “జెరుసలెంలో పై భాగం మీ అధీనంలో ఉంది. దిగువ భాగాన్ని మేము తీసుకుంటాము.” మేము వారికిలో చెప్పాము : “ జెరుసలెం అనేది ఒక ఉల్లిపాయ కాదు. ముక్కలు చేయడానికి.” దాని పై చర్చలు జరుగుతుండేవి. కానీ ఎలాంటి ఫలితమూ రాలేదు.

అది 1995 నవంబరు. ఇజ్రాయిల్ ప్రధాని ఇట్జాక్ రాబిన్‌ను ఒక ఇజ్రాయిలు తీవ్రవాది హత్యచేశాడు. ఆ తీవ్రవాది ఒస్లో శాంతి ప్రక్రియను వ్యతిరేకించాడు. తర్వాత ఒస్లో ఒప్పందాన్ని వ్యతిరేకించిన బెంజిమెన్ నెతన్యాహు ఇజ్రాయిలు ప్రధానిగా ఎంపికయ్యాడు. శాంతి ప్రక్రియను ఆపాలని కోరాడు. అతడు ఆ పనిచేశాడు.

పాలస్తీనాలోని ఒక ప్రాంతంలో పౌర, రక్షణ విభాగాలు పూర్తిగా పాలస్తినా ప్రభుత్వపు అదుపులో ఉన్నాయి. రెండోచోట ఇజ్రాయిలు, పాలస్తినా అధారిటీల ఉమ్మడి అధీనంలో ఉన్న ప్రాంతం. ఇక్కడ ఇజ్రయిలీలు తాము కోరుకున్న ఏ చోటుకైనా రాగలరు. తలుపులు లేపేయగలరు. ప్రజలను అరెస్టుచేసి చంపేయ గలరు. వారు, ఒస్లో ప్రక్రియను మన్నించటం కంటే ఛిద్రం చేయటం ద్వారా గౌరవిస్తున్నామంటారు. ఇజ్రాయిల్, ఆ ప్రక్రియలో తనకు ఇష్టమైన అంశాన్నే ఎంపికచేసుకుని, స్వీకరిస్తుంది.... ఇజ్రయి లీలకు ‘ఒస్లో ప్రక్రియ’, మా భూమిని కబ్జా చేసేందుకు, కాల హరణానికి, అనేక అవాస్త వాలను వాస్తవాలుగా సృష్టించేందుకు ఒక సౌలభ్యమైన సాధనంగా ఉపకరిస్తున్నది. తమ సైన్యం రక్షణపట్ల ఇపుడు వారు పాలస్తీనీ యులను నిందిస్తున్నారు. ఎ మరియు బి రెండు ప్రాంతాల్లోని పాలస్తినా పౌరులను కాపాడుకునేందుకు పాలస్తినా రక్షణ దళాలకు అనుమతిలేదు.

**ప్రశ్న : భవిష్యత్‌లో ఈ ప్రక్రియ ఎలావుండబోతున్నది?**

**జవాబు :** ఇజ్రాయిల్ దురాక్రమలు, క్రూరత్వం అంతంకావాలి. అది మాకు అవస రం. అంతర్జాతీయ చట్టానికి, అంతర్జాతీయ మానవీయ చట్టానికి అందరూ కట్టుబడి ఉండాలి. పాలస్తీనియన్లు, తాము స్వచ్ఛందంగా నిర్వాసితులు కాలేదని, షరతులకు లొంగలేదన్న వాస్తవాన్ని విస్మరించజాలరు. ఈ వాస్తవాన్ని హమాస్ దాడి నిరూపిస్తున్నది. పాలస్తీనీయులు లొంగిపోలేదు. పాదాక్రాం తులు కాలేదు. అదే ఇజ్రాయిల్ మితవాద ఉన్మాదానికి కారణం. ఈ పరిస్థితే, మా విశ్వాసానికి వనరుగా నిలుస్తున్నది. ప్రపంచం, పాలస్తినా సమస్యను అర్ధంచేసుకునేందకు ఇది సరైన సమయము, సందర్భము. ఈ సమస్య పరిష్కారానికి అందరూ పూనుకోవాలి. ప్రపంచ శాంతిని కాపాడాలి.

❃

# యుపిలో మహిళలకు భద్రత లేదు



రచయిత ఫ్రంట్‌లైన్ పత్రిక
స్పెషల్ కరస్పాండెంట్

**అశుతోష్ శర్మ**

**2022** లో కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ఒక బహిరంగ సభలో మాట్లాడుతూ, ఉత్తర్ ప్రదేశ్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత శాంతిభద్రతలు వర్ధిల్లుతున్నాయని ప్రగల్భాలు పలికారు. "ఇప్పుడు రాష్ట్రంలో పదహారేళ్ళ పిల్లయినా బంగారు ఆభరణాలు ధరించి అర్ధరాత్రి 12 గంటలకు కూడా రహదారుల్లో నిర్భయంగా తిరగ గలదు. 2017లో బీజేపీ అధికారంలోకి వచ్చినందు వల్ల ఇది సాధ్యపడింది" అన్నారు.

కానీ వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి. రాష్ట్రంలో మహిళలపై జరిగే నేరాలు పెరిగాయి. ఇటీవలి కాలంలో వెలువడిన ఎన్‌సిఆర్‌బి గణాంకాల ప్రకారం ఉత్తర ప్రదేశ్‌లో మహిళల పట్ల జరిగే నేరాలు– అత్యాచారాలు, హత్యలు, కిడ్నప్‌లు, మానభంగాల తర్వాత జరిగే హత్యలు, గ్యాంగ్ రేప్‌లు – పెరిగాయని తెలియచేస్తున్నది. రాష్ట్రంలో 2020లో మహిళలపై 49,385 నేరాలు జరగ్గా 2021లో 56,082 నేరాలు 2022 లో 65,743 నేరాలు జరిగాయని ఎన్‌సిఆర్‌బి నివేదికలో నమోదయింది.

రాష్ట్రంలో 14,887 మంది మహిళలు కిడ్నప్ చేయబడగా, 2,168 మంది వరకట్న హత్యలకు బలయ్యారు. 20,371 మందిని భర్తలు, వారి బంధువులు హింసించారు. రాజస్థాన్ (5,399) తరువాత ఉత్తర ప్రదేశ్ లోనే అత్యధికంగా (3,690) మానభంగాలు జరిగాయి. ఇక్కడే అత్యధికంగా మూకుమ్మడి మానభంగాలు (62) కూడా జరిగాయి.

సామాజిక కార్యకర్త, లక్నో విశ్వ విద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్, ఫ్రంట్ లైన్ పత్రికతో మాట్లాడుతూ, "ఉత్తర్ ప్రదేశ్‌లో మహిళల రక్షణ గురించి బీజేపీ డంబాలు కొట్టుకుంటున్నది. నేరస్తులంతా తమ తమ కలుగులలోకి దూరిపోయారని వారి నాయకులు ప్రతిరోజూ ప్రచారాలు చేసుకుంటుంటారు. అసలు జరిగినది ఏమిటంటే, మహిళల పట్ల ఎంత ఘోరమైన నేరాలు చేసినా పోలీసులకి వ్యతిరేకంగా, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు చేయడానికి వీలు లేకుండా చేశారు. ఉత్తర్ ప్రదేశ్‌లో మహిళలు బయటికి రావడానికి అనుమతించినదే కేవలం రెండు మూడు దశాబ్దాల కిందట. కానీ మహిళలు, పిల్లల పట్ల జరుగుతున్న లైంగిక వేధింపులు ఆందోళన కలిగిస్తున్నాయి. హత్యలు చేసిన తర్వాత వారి శరీరాలను ఇదివరకెన్నడూ లేని విధంగా ఛిద్రం చేస్తున్నారు .

2023లో రాష్ట్రంలో అనేక సందర్భాలలో మహిళలను కిడ్నప్ చేసి, అనంతరం అత్యాచారం చేసిన తరువాత ఆ వీడియో క్లిప్‌లను సామాజిక మాధ్యమాలలో పెడుతున్నారు. రాష్ట్రంలోని కౌసంబి జిల్లాలో గత ఆగస్టులో 15 సంవత్సరాల బాలికపై జరిగిన ఇటువంటి సంఘటన సామాజిక మాధ్యమంలో వైరల్ అవడంతో ఆమె ఆత్మహత్య చేసుకుంది.

2023 నవంబర్ మాసంలో 25 సంవత్సరాల మహిళను ఆగ్రాలోని ఒక హోమ్ స్టే (అద్దెకి విడిదిగా ఇచ్చే ఇల్లు) లోకి బలవంతంగా లాక్కుని వెళుతున్న వీడియో వైరల్ అయింది. అందులో ఆ మహిళ సహాయం కోసం ఆక్రందన చేస్తున్న దృశ్యం హృదయాలను కలచి వేసింది. ఆమె చేత బలవంతంగా మత్తుపానీయం తాగించారు. ఆ తర్వాత మూకుమ్మడిగా అత్యాచారం చేశారు. డిసెంబర్ 30వ తేదీన మరో మహిళ ఆగ్రా నగరంలోని ఇన్నర్ రింగ్ రోడ్‌లో అచేతనంగా పడి ఉంది. ఆమె చేత ఒక రాజీ పత్రంపై సంతకం చేయించుకుని అమెను కారు నుంచి బయటకు తోసేశారని వార్త వచ్చింది.

బిజెపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారం చేపట్టగానే మహిళలపై వేధింపులు నిలువరించడానికంటూ 2017లో "రోమియో స్క్వాడ్"లు ఏర్పాటు చేశారు. ఆ తరువాతి కాలంలో 2021లో ఆయన ప్రభుత్వం మతమార్పిడుల నిరోధక చట్టం చేసింది. దీనినే "లవ్ జిహాద్ వ్యతిరేక చట్టం" గా పిలుస్తున్నారు. ఇదంతా మహిళలను రక్షించే పేరుతో జరిగింది.

ఇటువంటి చర్యలే కాక మిషన్ శక్తి, బేటీ బచావో అనే కేంద్ర ప్రభుత్వ నినాదాలు కూడా ప్రచారంలో పెట్టారు. రాష్ట్రంలో మహిళలు, పిల్లలపై బీజేపీ నాయకులలే లైంగిక అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అయితే బీజేపీ ప్రభుత్వం అధికార పార్టీ నాయకులు చేస్తున్న ఈ లైంగిక దాడులను తొక్కిపెట్టే ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శలొస్తున్నాయి.

బీజేపీ శాసన సభ్యుడు రామ్ దులారి గౌడ్ ఒక 15 ఏళ్ల బాలికను 2014 నుండి దఫ దఫాలుగా అత్యాచారం చేసి, ఆమెను గర్భవతిని చేసినందుకు సోంభద్ర జిల్లా అడిషనల్ సెషన్స్ జడ్జి అతనికి 25 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ 2023 డిసెంబర్ 15న తీర్పు చెప్పారు. ఇది బీజేపీని పెద్ద కలవరపాటుకు గురి చేసింది. (ఆ తరువాత ఆ పాప ఒక అమ్మాయిని ప్రసవించింది). కేవలం అలహాబాద్ హైకోర్టు జోక్యంతో ప్రత్యేక కోర్టు 2023 జనవరిలో గౌడ్ పై కేసు నమోదు చేసింది. అతడు ఉత్తర ప్రదేశ్ శాసనసభ నుంచి బహిష్కృతుడయ్యాడు కానీ, బీజేపీలో కొనసాగుతూనే ఉన్నాడు.

**" 2023లో కూడా దళిత మహిళలపై అనేక రకాల హేయమైన నేరాలు జరిగాయి. అక్టోబర్ 31వ తేదీ బాండ జిల్లా లోని పాటురా గ్రామంలో ఒక మిల్లులో పనిచేస్తున్న దళిత మహిళ శరీరం నేలపై చిన్నాభిన్నం చేయబడి, పడి ఉండగా కనిపించింది. ఆమె ఎడమ చేతిని నరికివేశారు. తలను మొండెం నుంచి వేరు చేశారు. శరీరంపై వస్త్రాలు లేవు. ఆమె వయసు 40 సంవత్సరాలు. "**



**2023 డిసెంబర్ 15న ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్రలో ఒక బాలికపై అత్యాచారం చేసినందుకు అరెస్టయిన బిజెపి శాసన సభ్యుడు రామ్ దులార్ గోండ్**

ఈ కేసును వాదించిన న్యాయవాది వికాస్ శాక్య, ప్రజా పౌర హక్కుల సంఘం కార్యవర్గ సభ్యుడు. అతడు ఫ్రంట్ లైన్‌తో మాట్లాడుతూ "పరిశోధన జరుగుతున్న కాలంలో కేసును ఉపసంహరించుకోమని బాలికపై అనేక రకాల వత్తిడులు తెచ్చారు. నేరస్థుడిని రక్షించడానికి పోలీసులు, ప్రాసిక్యూషన్ న్యాయవాదులు విశ్వ ప్రయత్నం చేశారు. తీర్పు వెలువడిన తర్వాత కూడా బెదిరింపుల పర్వం కొనసాగుతూనే ఉంది" అని చెప్పారు.

మరో కేసులో బెనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన ఐఐటిలో కునాల్ పాండే, ఆనంద్ అలియాస్ అభిషేక్ చౌహాన్, సాక్షం పటేల్ అనేవారు మహిళపై మూకుమ్మడి మానభంగానికి పాల్పడిన మూడు నెలలకు గాని వాళ్ళపై కేసు నమోదు చేయలేదు. దాంతో బీజేపీ ప్రభుత్వంపై తీవ్రమైన విమర్శలు వచ్చాయి. బాధితురాలు 20 ఏళ్ల బిటెక్ విద్యార్థిని. ఆమెపై అత్యాచారం చేసిన ముగ్గురు నిందితులను అయిదు రోజుల్లోనే ఆమె గుర్తించింది. కానీ పోలీసులు వారిని డిసెంబర్ 31వ తేదీన గాని అదుపులోకి తీసుకోలేదు. మొదట్లో అత్యాచారం చేసినట్లు కేసు నమోదు చేశారు. కానీ ఆ తర్వాత కోపోద్రేకాలతో నిరసనలు పెల్లుబికిన తర్వాత మాత్రమే మూకుమ్మడి మానభంగం జరిపినట్టు ఎఫ్ఐఆర్ లో నమోదు చేశారు.

నేరస్తులు బీజేపీతోనూ, ఆర్ఎస్ఎస్ తోనూ సహవాసం చేస్తున్నందు వలన వారిని రక్షిస్తున్నారని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్ అంతకు ముందు ఆరోపించారు. దానితో రాయ్ ప్రజలలో శత్రుత్వాన్ని పెంపొందిస్తున్నారని స్థానిక అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శాఖ ఆరోపించగా పోలీసులు రాయ్ పై కేసు నమోదు చేశారు.

"పోలీసుల వద్ద సిసిటివి ఫుటేజ్‌తో సహా అన్ని ఆధారాలు ఉన్నాయి. కానీ పోలీసులు మాత్రం వారిని అరెస్టు చేయకుండా నిమ్మకు నీరెత్తినట్లు కూర్చున్నారు. ప్రజాగ్రహం పెల్లుబికి ఆందోళనలు చేసిన తర్వాత మాత్రమే అది కూడా నేరం జరిగిన 5 రోజుల తర్వాత నేరస్తులను అదుపులోకి తీసుకున్నారు. "బీజేపి కి భేటీ బచావో అన్నది కేవలం ఒక నినాదం మాత్రమే" అని రాయ్ ఆరోపించారు. ఫాస్ట్ ట్రాక్ కోర్టులో నిందితుడిని వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఆకాంక్ష ఆజాద్ అనే విద్యార్థి చురుకైన సామాజిక కార్యకర్త. కేసు నమోదు చేసేందుకు పోలీసులు ఏ విధమైన చర్యలు తీసుకోవడం లేదని నిరసనలు తెలియ చేసిన 18 మంది విద్యార్థులపై రకరకాల ఐపిసి సెక్షన్‌లతో తప్పుడు కేసులు పెట్టారని ఆమె పత్రికల వారితో చెప్పారు. ఏబివిపి నాయకుల ప్రోద్బలంతో వారిపై షెడ్యూల్ కులాల , షెడ్యూల్డ్ తెగలపై (దాడుల నిరోధక ) చట్టాన్ని ప్రయోగించారని తెలిపారు. ఆమె జిల్లా పాలన వ్యవస్థను, పోలీసులను, విశ్వవిద్యాలయ పరిపాలన విభాగాన్ని కూడా తప్పు పట్టారు. వారంతా ఏబివిపితో కుమ్మక్కయి జరిగిన విషయాన్ని తొక్కిపెట్టడానికి తోడ్పడ్డారని ఆరోపించారు. బిఎచ్‌యులో నిరసనలు మొదలవగానే నిందితులు ముగ్గురూ వారణాసి వదిలి వెళ్లిపోయారు. పైగా వారు మధ్య ప్రదేశ్ ఎన్నికల్లో ప్రచారం కూడా చేశారు.

2023లో కూడా దళిత మహిళలపై అనేక రకాల హేయమైన నేరాలు జరిగాయి. అక్టోబర్ 31వ తేదీ బాండ జిల్లా లోని పాటురా గ్రామంలో ఒక మిల్లులో పనిచేస్తున్న దళిత మహిళ శరీరం నేలపై చిన్నాభిన్నం చేయబడి, పడి ఉండగా కనిపించింది. ఆమె ఎడమ చేతిని నరికివేశారు. తలను మొండెం నుంచి వేరు చేశారు. శరీరంపై వస్త్రాలు లేవు. ఆమె వయసు 40 సంవత్స రాలు. నిందితులు అధిపత్య కులాలవారు కావడంతో పోలీసులు నిందితులను కాపు కాస్తున్నారని 44 ఏళ్ల ఆమె భర్త ఆరోపించారు.

మరో భయంకరమైన సంఘటన ఏప్రిల్ లో ఉన్నావ్ జిల్లాలోని లాల్ ఖేడా గ్రామం లో జరిగింది. ఇక్కడ అత్యాచారం కేసులో ఇద్దరు నిందితులు బెయిలుపై వచ్చి ఒక గుంపును వెంటేసుకుని 14 ఏళ్ల దళిత బాలిక నివసించే గుడిసెకు నిప్పు పెట్టారు. అంతకు ముందు సంవత్సరం వారు ఆ బాలికపై దాడి చేశారు. నిందితులు బాలికను, ఆమె తల్లిని చితక్కొట్టి, అక్కడున్న ఇద్దరు పసివాళ్లను ఎగసిపడుతున్న మంటలలోకి విసిరేసారు. అందులో ఒక పాప ఆరు నెలల పసికందు.

ఆ పాప అత్యాచారం కారణంగా పుట్టిన బిడ్డ. రాష్ట్రంలో దళిత మహిళలు, బాలికలు అత్యంత దారుణంగా అత్యాచారాలకు, హత్యలకు గురవుతున్నారని, వారికి న్యాయం అందుబాటులో ఉండక పోవడం సర్వసాధారణం అయిపోయిందిని కాన్పూర్ లోకసభ మాజీ ఎంపి, సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు భాషిణి అలీ చెప్పారు.

2023 జూన్ మాసంలో బారాబంకి జిల్లాలో 17 ఏళ్ల బాలికపై కొందరు అత్యాచానం చేశారు. అయితే నిందుతులతో రాజీపడాలని ఆమె కుటుంబంపై పోలీసులు ఒత్తిడి తేవడంతో ఆ బాలిక ఆత్మహత్య చేసుకుంది. అదే నెలలో జలవుం జిల్లాలోని ఏకోది గ్రామంలో తన మైనర్ కూతురిని మూకుమ్మడిగా మానభంగం చేసిన వారిపై పోలీసులు ఏవిధమైన చర్యలు తీసుకోనందుకు ఆమె తండ్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్య చేసుకునే ముందు ఆ తండ్రి స్థానిక పోలీసులకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి జన్ సున్ వాయి (ప్రజల గళం వినిపించే పోర్టల్) పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేశారు.

డిసెంబర్ 29వ తేదీ ఆగ్రా పట్టణంలో ఉత్తర ప్రదేశ్ పోలీసు కానిస్టేబుల్ 22 ఏళ్ల దళిత మహిళను మానభంగం చేసి గొంతు నులిమి హత్య చేసాడు.

నేరస్తుల పట్ల ముఖ్యమంత్రి కుల, మత వివక్ష చూపిస్తున్నారని సుభాషిణి అలీ విమర్శించారు. "2020లో హత్రాస్ కేసులో బాధితురాలు వాల్మీకి కులానికి చెందినది. నిందితుడు ఆదిత్యనాథ్ లాగే ఠాకూర్ కులానికి చెందినవాడు. అందువలనే అమ్మాయిపై మానభంగం జరగలేదు అని ప్రకటించారు" అని సుభాషిణీ అలి అన్నారు.

రాష్ట్రంలో రాత్రి ఎనిమిది గంటల తర్వాత కోచింగ్ కేంద్రాలు ఆడపిల్లలకు చదువు చెప్పకూడదని నిషేధించడం పట్ల కూడా పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ఈ నిషేధం కేంద్ర ప్రభుత్వం సేఫ్ సిటీ ప్రాజెక్ట్ (భద్రమైన నగరం కార్యక్రమం)లో భాగం. అయితే ఈ నిబంధనలను డిసెంబర్‌లో వెనక్కు తీసుకున్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ ఢిల్లీని అత్యాచారాల ప్రధాన నగరంగా వర్ణిస్తూ, ఓటు వేసే ముందు ఢిల్లీ ఓటర్లను 'నిర్భయని గుర్తు చేసుకోవాలి" అన్నారు. కానీ తన పార్లమెంటు స్థానమైన వారణాసిలో ఓటు వేసే ముందు (బిహెచ్‌యు) ఐఐటి విద్యార్థిని పట్ల ఎందుకు మౌనంగా ఉన్నారని సుభాషిణి

**"2023 జూన్ మాసంలో బారాబంకి జిల్లాలో 17 ఏళ్ల బాలికపై కొందరు అత్యాచానం చేశారు. అయితే నిందుతులతో రాజీపడాలని ఆమె కుటుంబంపై పోలీసులు ఒత్తిడి తేవడంతో ఆ బాలిక ఆత్మహత్య చేసుకుంది. అదే నెలలో జలవుం జిల్లాలోని ఏకోది గ్రామంలో తన మైనర్ కూతురిని మూకుమ్మడిగా మానభంగం చేసిన వారిపై పోలీసులు ఏవిధమైన చర్యలు తీసుకోనందుకు ఆమె తండ్రి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు."**




బెనారస్ హిందూ యూనివర్సిటీకి చెందిన ఐఐటి విద్యార్థినిపై అత్యాచారం కేసు సందర్భంగా యుపి కాంగ్రెస్ అధ్యక్షుడు అజయ్ రాయ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని నిరసిస్తూ వారణాసిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పబ్లిక్ రిలేషన్స్ కార్యాలయం వద్ద ప్రదర్శన చేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

అలీ ప్రశ్నించారు. నేడు రాష్ట్రంలో మహిళల భద్రత ఎలా ఉందో ఈ పరిస్థితి వివరిస్తున్నది. "ఉన్నత కులాల వారు లైంగిక నేరాలు చేస్తే, వారికి శిక్షలు ఉండవు. కానీ అదే ముస్లింలు చేస్తే న్యాయం వెంటనే అమలవుతుంది. వారి ఇళ్లు నేలమట్టం చేయబడతాయి" అని ఆమె అన్నారు.

2023 సెప్టెంబర్ మాసంలో గోరకపూర్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో ఆదిత్యనాథ్ మాట్లాడుతూ "ఎవరైనా ఆడపిల్లను రోడ్డుపై వేధిస్తే వారిని యమధర్మరాజు దగ్గరికి పంపకుండా మమ్మల్ని ఎవరూ ఆపలేరు" అని భీకరంగా ప్రకటించారు.

ఈ ప్రకటనకు ముందు రోజే పోలీసులు తమ తుపాకీలను కాజేసి పారిపోయే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు ముస్లిం యువకులను కాల్చి చంపేశారు. ఆ ముగ్గురు యువకులను 17 ఏళ్ల బడికి వెళ్లే అమ్మాయిని అత్యాచారం చేసిన నేరానికి పోలీసులు అంతకు ముందు అరెస్టు చేశారు. అత్యాచారం తరువాత ఆ అమ్మాయి అంబేద్కర్ నగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించడానికి కూడా ఈ యువకులు కారణమని అభియోగాలు మోపారు.

కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా 2022 ఫిబ్రవరి నెలలో బహ్రైచ్‌లో జరిగిన ఒక ఎన్నికల మహాసభలో మాట్లాడుతూ "ఆదిత్యనాథ్ పరిపాలనలో భూతద్దం పెట్టి వెతికినా ఒక్క బాహుబలి కూడా కనిపించదు. ఎక్కడ చూసినా కేవలం బజరంగ బలి మాత్రమే కనిపిస్తాడు" అన్నారు. దీనికి కాంగ్రెస్ పార్టీకి చెందిన డొల్లి శర్మ సమాధాన మిస్తూ "భూతద్దాల అవసరం లేదు . నేరస్తులు నీ పక్కనే ఉన్నారు" అని బదులిచ్చారు.

**(అనువాదం: కె. ఉషారాణి)**

# ప్రజా సాహిత్యం, ప్రజా కళలు

మావో జె డాంగ్



**సాహిత్యం, కళలు గురించి యేనాన్ ఫోరమ్‌లో మావో జె డాంగ్ చేసిన ప్రసంగాల రెండవ భాగం దిగువ ఇస్తున్నాం. మొదటి భాగం గత డిసెంబర్ సంచికలో ప్రచురితమైంది. యేనాన్ 1942 మే నెలలో ఇరవై ఒక్క రోజుల పాటు జరిగిన యేనాన్ ఫోరమ్ సమావేశాల్లో మావో ప్రారంభ, ముగింపు ఉపన్యాసాలు చేశారు.**

కామ్రేడ్స్! ఈ నెలలో మన ఫోరం మూడుసార్లు సమావేశమయింది. సత్యాన్వేషణలో మనం ఉత్సాహపూరితమైన చర్చలు జరిపాం. వాటిలో పార్టీ సభ్యులూ, సభ్యులు కానివారు అయిన కామ్రేడ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని, సమస్యలను చర్చించి, వాటికి స్పష్టత కలిగించారు. ఇందువల్ల సాహిత్య, కళా ఉద్యమానికంతకూ చాలా లాభం కలుగుతుందని నేను నమ్ముతున్నాను.

ఒక సమస్యను చర్చించేటప్పుడు మనం వాస్తవం నుంచి ఉపక్రమించాలి గాని, నిర్వచనాలతో కాదు. సాహిత్యం గురించీ, కళల గురించీ ప్రమాణ గ్రంథాలు ఇచ్చే నిర్వచనాలు ఏమిటో చూసి, ఈనాటి సాహిత్య, కళా ఉద్యమాల మూలసూత్రాలను నిర్ణయించలేం. ఆ నిర్వచనాలను ఆధారం చేసుకుని, ఈనాడు ఉత్పన్నమయ్యే అభిప్రాయా లనూ, వివాదాలనూ పరిష్కరించబూను కున్నట్టయితే మనం తప్పుదోవన పడతాం. మనం మార్క్సిస్టులం. ఏ సమస్యనైనా పరిశీలించేటప్పుడు వాస్తవ విషయాలతో ఆరంభించాలిగాని శుష్క నిర్వచనాలతో కాదనీ, ఈ వాస్తవ విషయాల విశ్లేషణ ఆధారంతోనే మనం మూలసూత్రాలనూ, విధానాలనూ, కార్యక్రమాన్ని నిర్ణయించుకోవాలనీ మార్క్సిజం మనకు బోధిస్తున్నది. మనం ప్రస్తుతం సాహిత్యం గురించీ, కళను గురించీ జరుపుతున్న చర్చలో ఈ పద్ధతే అవలంబించాలి.

మనముందున్న ప్రస్తుత వాస్తవ విషయాలేమిటి? అయిదేళ్ళుగా చైనా జపానుతో సాగిస్తున్న ప్రతిఘటన యుద్ధం. ప్రపంచవ్యాపితంగా విస్తృతమైన ఫాసిస్టు వ్యతిరేక యుద్ధం. ప్రతిఘటన యుద్ధం పట్ల చైనాలోని పెద్ద భూస్వాములు, బడా బూర్జువాల అనిశ్చిత వైఖరీ, వారు ప్రజల పట్ల అమానుషంగా దోపిడీ చేసే పీడనా విధానం, (1919) మే 4 ఉద్యమం నుండి సాహిత్య, కళారంగాలలో జరుగుతున్న విప్లవోద్యమం, గత ఇరవై మూడేళ్ళుగా అది విప్లవానికి చేసిన గొప్ప సేవా, అందులో గల అనేక లోపాలు. ఎనిమిదవ రూట్, న్యూఫోర్త్ సైన్యాలకు గల జపాను వ్యతిరేక ప్రజా స్థావరాలూ, ఈ సైన్యాలతోనూ ఈ ప్రాంతాలకు చెందిన శ్రామిక, కర్షకులతోనూ అధిక సంఖ్యలో చేరిన రచయితలూ, కళాకారులకూ, స్థావరాలలోనూ, కొమింటాంగ్ ప్రాంతాలలోనూ ఉండే రచయితలకూ, కళాకారులకూ వాతావరణంలోనూ, కర్తవ్యాలలోనూ ఉండే తేడా, యేనాన్‌లోనూ, ఇతర జపాను వ్యతిరేక స్థావరాలలోనూ సాహిత్యం, కళల విషయంలో బయలుదేరిన వివాదాస్పద సమస్యలు,.... ఇవీ నేటి వాస్తవాలు. ఈ వాస్తవాలను దృష్టిలో పెట్టుకుని మనం మన సమస్యలను గురించి ఆలోచించాలి.

అయినప్పుడు కీలక విషయం ఏమిటి? ప్రజల కోసం ఎలా పనిచేయడం అనేదే కీలక విషయం అని నా ఉద్దేశం. ఈ సమస్యలు సముచితంగా పరిష్కారం అయితే తప్ప, మన రచయితలూ, కళాకారులు తమ వాతావరణానికి అనుగుణంగా ఉండలేరు. వారి విధి నిర్వహణకు లోపలి నుంచీ, వెలుపల నుంచీ అవరోధాల పరంపర కలుగుతుంది. ఈ రెండు సమస్యలను గురించీ, వాటికి అనుబంధించే విషయాలను గురించీ ఈ నా ముగింపు సమావేశంలో చర్చిస్తాను..

## 1

### మొదటి సమస్య :

### సాహిత్యమూ, కళలు ఎవరి కోసం?

ఈ సమస్యను మార్క్సిస్టులు, ముఖ్యంగా లెనిన్ ఏనాడో పరిష్కరించారు. 1905లోనే లెనిన్ మన సాహిత్యమూ, కళలను “లక్షల, కోట్ల సంఖ్యలో ఉండే శ్రామికులకు సేవ చెయ్యాలి” అని ఉద్ఘాటించి చెప్పాడు. ఈ సమస్య అదివరకే పరిష్కారం అయిపోయిందనీ, దీన్ని గురించి కొత్తగా చర్చించవలసినది ఏమీ లేదనీ, జపాను వ్యతిరేక స్థావరాలలో పనిచేసే రచయితలూ, కళాకారులూ అనుకోవచ్చు. కాని నిజం అది కాదు. అనేక మంది కామ్రేడ్‌లకు పరిష్కారం స్పష్టంగా కనిపించకుండా ఉన్నది. ఆ కారణంగా వారి భావోద్రేకాలూ, కృషీ, చర్యలూ, సాహిత్యం, కళలకు సంబంధించిన వారి విధానాలు ప్రజల అవసరాలకూ, ప్రత్యక్ష పోరాటావసరాలకూ తప్పనిసరిగా అంతో ఇంతో భిన్నంగా ఉండటం జరుగుతున్నది. నిజానికి కమ్యూనిస్టు పార్టీతోనూ, ఎనిమిదవ రూట్, న్యూఫోర్త్ సేనలతోనూ కలిసి విముక్తి సమరంలో పాల్గొంటున్న అసంఖ్యాకులైన సంస్కృతిక కార్యకర్తలూ, రచయితలూ, కళాకారులలో కొద్దిమంది తమ భవిష్యత్ మాత్రమే చూసుకుంటూ, తాత్కాలికంగా మాత్రమే మనతో ఉన్నవారై ఉండవచ్చు. కాని అత్యధిక సంఖ్యాకులు సమిష్టి ప్రయోజనం కోసం తీవ్రంగా కృషి చేస్తున్న వారే. ఈ కామ్రేడ్‌ల మీద ఆధారపడే మనం చాలా సాహిత్యమూ, నాటకాలు, సంగీతము, లలిత కళలూ సాధించుకున్నాం. ఈ రచయితల లోనూ, కళాకారులలోనూ చాలామంది

ప్రతిఘటన యుద్ధం ఆరంభమయినది మొదలు పని ప్రారంభించారు. అనేకమంది ఇతరులు యుద్ధానికి పూర్వం హెచ్చుగా విప్లవ చర్యలు చేసి, ఎన్నో బాధలనోర్చి, విస్తృత జనబాహుళ్యాన్ని తమ కార్యకలాపాలతో ప్రభావితులను చేశారు. అలాంటప్పుడు, ఈ కామ్రేడ్‌లలో కూడా కళలు, సాహిత్యం, ఎవరికి అన్న సమస్యకు స్పష్టమైన పరిష్కారం తెలియని వారు కొందరున్నారని ఎందుకు అంటున్నాం. విప్లవ సాహిత్యం, కళలు ప్రజా బాహుళ్యం కొరకు కాదనీ, దోపిడీగాళ్ళ కొరకూ, పీడకుల కొరకూ మాత్రమేననీ అనుకునేవారు ఇప్పటికీ ఇంకా ఉన్నారన్నది అనుకోదగిన మాటేనా?

> "నిజానికి దోపిడీగాళ్ళ కోసమూ, పీడకుల కోసమూ, సాహిత్యమూ, కళా లేకపోలేదు. ఫ్యూడల్ సాహిత్యం, కళలు భూస్వామ్యవర్గం కొరకు ఉన్నాయి. చైనాలో ఫ్యూడల్ యుగంలో పాలకవర్గం యొక్క సాహిత్యం, కళలు అలాంటివే. ఈనాడు కూడా అలాటి సాహిత్యం, కళల ప్రభావం చైనాలో ఇంకా హెచ్చుగానే ఉన్నది. బూర్జువా సాహిత్యం, కళలు బూర్జువాల కోసం ఉన్నాయి."

నిజానికి దోపిడీగాళ్ళ కోసమూ, పీడకుల కోసమూ, సాహిత్యమూ, కళా లేకపోలేదు. ఫ్యూడల్ సాహిత్యం, కళలు భూస్వామ్యవర్గం కొరకు ఉన్నాయి. చైనాలో ఫ్యూడల్ యుగంలో పాలకవర్గం యొక్క సాహిత్యం, కళలు అలాంటివే. ఈనాడు కూడా అలాటి సాహిత్యం, కళల ప్రభావం చైనాలో ఇంకా హెచ్చుగానే ఉన్నది. బూర్జువా సాహిత్యం, కళలు బూర్జువాల కోసం ఉన్నాయి.. లూసున్ విమర్శించిన లియాంగ్ షి–చియూ[2] లాటి వ్యక్తులు, సాహిత్యము, కళా వర్గాలకు అతీతమైనవి అన్నట్టు మాట్లాడతారు. కాని వారు బూర్జువా సాహిత్య, కళలను నెత్తికెత్తుకుని శ్రామిక సాహిత్యం, కళలను వ్యతిరేకిస్తారు. తరువాత సామ్రాజ్యవాదులకు సేవ చేసే సాహిత్యమూ, కళలు కూడా వున్నాయి. ఉదాహరణకు చౌత్సో–జెన్, చాంగ్ ట్జు–పింగ్[3] ప్రభృతుల రచనలు. వాటిని విద్రోహ సాహిత్యం, కళలూ అంటాం. మనకు సంబంధించినంత వరకు సాహిత్యము, కళలు ప్రజల కోసమే గాని పైన చెప్పిన ఏ వర్గం కొరకూ కాదు. చైనాలోని ఈనాటి దశకు చెందిన నూతన సంస్కృతి సామ్రాజ్యవాద వ్యతిరేక, ఫ్యూడల్ వ్యతిరేక సంస్కృతి, అది శ్రామిక నాయకత్వం పొందిన ప్రజా సంస్కృతి. ఈనాడు వాస్తవంగా ప్రజలకు సంబంధించిన ప్రతి విషయమూ విధిగా శ్రామికవర్గ నాయకత్వం కింద ఉండాలి. బూర్జువాల నాయకత్వం కింద ఉన్నదేదీ ప్రజలది అయి వుండటం అసంభవం. సహజంగా నూతన సంస్కృతిలో అంతర్భాగమైన నూతన సాహిత్యానికి, కళకూ కూడా ఇదే వర్తిస్తుంది. చైనాలోను, దేశాంతరాలలోను సాహిత్యం, కళలలో అనాదిగా ఉండిన పటిష్టమైన వారసత్వాన్నీ, సత్సంప్రదాయాలను మనం అందిపుచ్చుకోవాలి. కానీ లక్ష్యం మటుకు ప్రజా బాహుళ్యానికి సేవ చేయటంగానే ఉండాలి. పాత సాహిత్య, కళారూపాలను వినియోగించ డానికి కూడా మనం అభ్యంతరం చెప్పం. అయితే మన చేతుల్లో ఈ పాత రూపాలు సంస్కరించబడి, కొత్త భావాలతో నిండి, ప్రజలకు సేవచేయడంలో విప్లవాత్మకంగా రూపొందుతాయి.

అయితే ప్రజాబాహుళ్యం అంటే ఎవరు? మన ప్రజల్లో 90 శాతానికి పైగా ఉన్న అత్యధిక సంఖ్యాక శ్రామికులూ, కర్షకులూ, సైనికులూ, నగరవాసులైన పెటీ బూర్జువాలు. కనుక మన సాహిత్యం, కళలు ప్రధానంగా విప్లవ నాయకత్వం వహించే శ్రామికుల కోసం, తరువాత విప్లవానికి స్థిరమైన అనుచరులూ, అత్యధిక సంఖ్యాకులూ అయిన కర్షకుల కోసం. ఇంకా సాయుధ శ్రామిక, కర్షకుల కోసం అంటే విప్లవ సమరంలో ప్రముఖ శక్తిగా పనిచేసే ఎనిమిదవ రూట్, న్యూఫోర్త్ సైన్యాలకోసం, చివరిగా నగరాలలో పనిచేసే పెటీ బూర్జువాల కోసం, పెటీ బూర్జువా మేధావుల కోసం (ఈ ఉభయులూ విప్లవంలో మన పక్షాన ఉండి దీర్ఘకాలం మనతో సహకరించగలరు) ఉద్దేశించబడాలి. ఈ నాలుగు రకాల ప్రజలతో కూడినదే చైనా జాతిలోని అత్యధిక విస్తృత ప్రజా బాహుళ్యం.

పైన చెప్పిన నాలుగు రకాల ప్రజల కోసమే మన సాహిత్యమూ, కళలు పనిచేయాలి. వారికి సేవ చేయాలంటే మనం అవలంబించవలసినది కార్మిక వర్గ దృక్పథం. పెటీ బూర్జువా దృక్పథం కాదు. ఈనాడు పెటీ బూర్జువా దృక్పథాన్ని అంటిపెట్టుకున్న రచయితలెవరైతే ఉన్నారో వారు విప్లవ శ్రామిక, కర్షక, సైనిక జనసందోహాలకు నిజమైన సేవ చెయ్యలేరు. వారి అభిమానం ప్రధానంగా కొద్ది సంఖ్యలో ఉండే పెటీ బూర్జువా మేధావులపైనే కేంద్రీకరించి వుంటుంది. మన కామ్రేడ్‌లు కొందరు "ఎవరి కోసం?" అన్న సమస్యను సరిగా పరిష్కరించలేకపోవడానికి సూక్ష్మ కారణం ఇదే. సిద్ధాంత విషయంగా నేనీమాట అనటం లేదు. సిద్ధాంతపరంగా మనలో ఎవరూ శ్రామిక, కర్షక, సైనిక బాహుళ్యాన్ని పెటీ బూర్జువా మేధావుల కంటే తక్కువగా చూడరు. నేను చెబుతున్నది ఆచరణ గురించీ, చేతలను గురించి. ఆచరణలో, చేతలలో వారు పెటీ బూర్జువా మేధావులను, శ్రామిక, కర్షక, సైనికుల కన్నా హెచ్చుగా పరిగణిస్తున్నారా? పరిగణిస్తున్నారనే నేను అనుకుంటున్నాను. అనేకమంది కామ్రేడ్‌లు పెటీ బూర్జువా మేధావులను అధ్యయనం చేయటంలోనూ, వారి మనస్తత్వాన్ని విశ్లేషించడంలోనూ తలమునక లవుతున్నారు. ఈ మేధావులను అభివర్ణించ డంలోనూ, వారి లోపాలను సమర్థించడం లోనూ తమ శక్తిని కేంద్రీకరిస్తున్నారు. అంతేగానీ ఆ మేధావులను తమతోపాటుగా శ్రామిక, కర్షక, సైనిక ప్రజా బాహుళ్యానికి చేరువగా తీసుకుపోవటానికీ, ప్రజా సమరంలో ప్రత్యక్షంగా పాల్గొనడానికీ, ప్రజా బాహుళ్యాన్ని అభివర్ణించి, సంస్కరించడానికి మార్గదర్శ కులుగా పనిచేయడం లేదు. చాలామంది కామ్రేడ్‌లు తాము పెటీ బూర్జువాలూ, మేధావులూ అయి వుండి, మేధావులలోనే స్నేహితులను చూసుకుంటున్నారు. వారిని అధ్యయనం చేయడంలోనూ, వర్ణించడంలోనూ మునిగిపోతున్నారు. ఈ అధ్యయనమూ, వర్ణనా శ్రామిక దృష్టితో సాగితే సక్రమమైనవే. కాని వారు చేసేది పూర్తిగా అది కాదు. వారు పెటీ బూర్జువా దృష్టి అవలంబించి, పెటీ బూర్జువాపరమైన రచనలు చేస్తారు. ఈ సంగతి అనేక రచనలలోనూ, కళాఖండాలలోనూ కనిపిస్తున్నది. తరచుగా వారు పెటీ బూర్జువా వర్గీయులైన మేధావుల పట్ల హృదయ పూర్వకమైన సానుభూతి చూపుతూ, వారి లోపాల పట్ల సానుభూతి మాత్రమే కాక, వాటిని మెచ్చుకునే దాకా కూడా పోతారు. మరొకవైపు, ఈ కామ్రేడ్‌లు సాధారణంగా శ్రామిక, కర్షక, సైనిక ప్రజా బాహుళ్యంతో సంబంధం పెట్టుకోరు. వారిని అర్థం చేసుకుని అధ్యయనం చేయరు. వారిలో ఆప్తమిత్రులను చూసుకోరు. వారిని అభివర్ణించడంలో సమర్థత చూపలేరు. అందువల్ల వారి దుస్తులైతే శ్రామిక ప్రజలవే

"వారు తమ పాదాలను క్రమంగా శ్రామిక, కర్షక, సైనిక పక్షానికి తిప్పి, శ్రామికవర్గం వైపు రావాలి. అందుకు వారు ప్రజల మధ్యకు వారి ప్రత్యక్ష పోరాటాల నట్టనడిమికి పోవాలి. మార్క్సిజాన్నీ, సమాజాన్నీ అధ్యయనం చేయాలి. ఇలా చేస్తేనే మనకు నిజమైన శ్రామిక, కర్షక, సైనిక సాహిత్యం, కళలు నిజమైన శ్రామికవర్గ సాహిత్యం, కళలూ లభ్యమవుతాయి."

గాని, వారి ముఖాలు మాత్రం పెటీ బూర్జువా మేధావులవి. కొన్ని విషయాలలో వారికి శ్రామిక, కర్షక, సైనికులన్నా, వారి లీడర్లన్నా ఇష్టమే. కాని ఒక్కొక్కప్పుడు, మరికొన్ని విషయాలలో వారంటే ఇష్టపడరు. వారి భావాలూ, పద్ధతులు గానీ, వారి ఆరంభ సాహిత్యమూ, కళ (గోడ వార్తా పత్రికలు, కుడ్య చిత్రాలు, జానపద పాటలు, జానపద కథలూ వగైరా) కాని నచ్చవు. ఒక్కొక్కప్పుడు అవి నచ్చుతాయి కూడాను. అది ఎప్పుడంటే కొత్తదనం కోసమో, తన రచనలను అలంకరించుకొనడానికో, కొన్ని పాత లక్షణాల కోసమో వెతుకుతున్నప్పుడు. మిగతా సమయాలలో వారు వీటిని బాహాటంగా నిరసించి, పెటీ బూర్జువా మేధావులకూ, బూర్జువాలకు సంబంధించిన వాటిపట్ల పక్షపాతం చూపుతారు. ఈ కామ్రేడ్స్ పాదాలు పెటీ బూర్జువా పొలిమేర్లలో పాతుకుని ఉన్నాయి. ఇంకా నాజూకుగా చెప్పాలంటే, వారి అంతరాత్మ ఇంకా పెటీ బూర్జువా మేధావి సామ్రాజ్యమే. అందుకే వారు "ఎవరి కోసం!" అన్న సమస్యను ఇంకా పరిష్కరించలేదు. ఈ మాట యేనాన్‌కు కొత్తగా వచ్చిన వారికి మాత్రమే వర్తించదు. పురోగాములుగా ఉంటూ, మన స్థావరాలలోను, ఎనిమిదవ రూట్, న్యూఫోర్త్ సైన్యంలోనూ అనేక సంవత్సరాలుగా పనిచేసిన కామ్రేడ్స్‌లలో కూడా చాలామంది ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించలేదు. దీన్ని పూర్తిగా పరిష్కరించ డానికి ఎంతోకాలం. కనీసం ఎనిమిది, పది సంవత్సరాలు పడుతుంది. ఎంతకాలం పట్టినప్పటికీ మనం దాన్ని పరిష్కరించి తీరాలి. నిర్ద్వంద్వంగానూ, సమగ్రంగానూ కూడా పరిష్కరించాలి. మన సాహిత్యకారులు, కళాకారులు తమ వైఖరి మార్చుకొని ఈ పని సాధించాలి. వారు తమ పాదాలను క్రమంగా శ్రామిక, కర్షక, సైనిక పక్షానికి తిప్పి, శ్రామికవర్గం వైపు రావాలి. అందుకు వారు ప్రజల మధ్యకు వారి ప్రత్యక్ష పోరాటాల నట్టనడిమికి పోవాలి. మార్క్సిజాన్నీ, సమాజాన్నీ అధ్యయనం చేయాలి. ఇలా చేస్తేనే మనకు నిజమైన శ్రామిక, కర్షక, సైనిక సాహిత్యం, కళలు నిజమైన శ్రామికవర్గ సాహిత్యం, కళలూ లభ్యమవుతాయి.

ఈ "ఎవరి కోసం!" అన్న సమస్య మౌలికమైనది. సూత్రబద్ధమైనది. లోగడ కొందరు కామ్రేడ్‌ల మధ్య చెలరేగిన వివాదాలూ, విభేదాలూ, విరోధాలు, అనైక్యతా ఈ మౌలిక సూత్రబద్ధ సమస్య గురించి కాదు. ఏ సూత్రానికి సంబంధించని విషయాలను గురించి. ఈ సూత్రాన్ని గురించి మటుకు ఉభయపక్షాల మధ్యా ఎలాంటి భేదాభిప్రాయమూ కలగలేదనే అనవచ్చు. ఉభయ పక్షాలూ దాదాపు పూర్తి ఏకాభిప్రాయమే ప్రకటించాయి. కొంతవరకు ఉభయపక్షాలకూ శ్రామిక, కర్షక, సైనికులంటే చిన్నచూపు ఉన్నది. వారు ప్రజాబాహుళ్యానికి దూరంగా ఉండేది కొమింటాంగ్‌లాగా కాదు. అయినప్పటికీ అలాంటి ధోరణి లేకపోలేదు. ఈ మౌలిక సమస్య పరిష్కారమైతేనే గాని, అనేక ఇతర సమస్యలు పరిష్కారం కావటం సులువు కాదు. ఉదాహరణకు సాహిత్య, కళారంగాలలో "పిడివాదాన్ని" (సెక్టేరియనిజం) తీసుకోండి. ఇది కూడా సూత్రానికి సంబంధించిన సమస్యే. అయితే పిడివాదాన్ని తుడిచిపెట్టాలంటే "కార్మిక, కర్షకుల కోసం!" ఎనిమిదవ రూట్, న్యూఫోర్తు సేవల కోసం!" "ప్రజల మధ్యకు వెళ్ళండి!" అన్న నినాదాలు లేవదీసి, వాటిని అమలు జరపడం ఒకటే మార్గం. లేనిపక్షంలో పిడివాదం సమస్య ఎన్నటికీ పరిష్కారం కాదు. లూసున్ ఒకప్పుడు ఇలా చెప్పాడు.

"ఐక్య సంఘటనకు ఉమ్మడి ఆశయం అవసరం.... మన సంఘటనలో ఐక్యత లేకపోవటాన్ని బట్టి, మన ఆశయాలను ఐక్యం చేసుకోలేక పోయామనీ, కొంతమంది చిన్న చిన్న ముఠాల కోసమే పనిచేస్తున్నారనీ, లేదా కేవలం తమ కోసం మాత్రమే పనిచేస్తున్నారనీ స్పష్టమవుతుంది. మనమందరమూ ప్రజల కోసమే సేవచేయడం ఆశయంగా పెట్టుకున్నట్లయితే మనది ఐక్య సంఘటన అవుతుంది."[4]

అప్పట్లో ఆ సమస్య షాంఘైలో ఉండింది. ఇప్పుడది చుంగ్‌కింగ్‌లో కూడా ఉన్నది. అలాంటి ప్రదేశాల (షాంఘై)లో సమస్యను పూర్తిగా పరిష్కరించడం దుస్సాధ్యం. ఎందుకంటే పాలకులు విప్లవ రచయితలను, కళాకారులనూ బాధించి, వారికి శ్రామిక, కర్షక, సైనిక ప్రజాబాహుళ్యం మధ్యకు వెళ్ళే స్వాతంత్ర్యం లేకుండా చేస్తారు. ఇక్కడ మన విషయంలో పరిస్థితి అందుకు పూర్తిగా భిన్నమైనది. విప్లవ రచయితలూ, కళాకారులూ, శ్రామిక, కర్షక, సైనికులతో సన్నిహిత సంబంధాలు పెట్టుకోవడానికీ, ప్రజల మధ్యకు వెళ్ళి నిర్దిష్టమైన విప్లవ సాహిత్యమూ, కళలు సృష్టించడానికి మనం ప్రోత్సాహం ఇస్తాం. అందుచేతనే, ఇక్కడ మనలో ఈ సమస్య పరిష్కారానికి దగ్గరలో ఉన్నది. దగ్గరలో ఉన్నంత మాత్రాన సమస్య పూర్తిగానూ, సమగ్రంగానూ పరిష్కారమై పోతుందని లేదు. మనం ముందే అనుకున్నట్లు పూర్తిగాను, సమగ్రంగానూ పరిష్కారం సాధించటానికి గాను మనం మార్క్సిజాన్నీ, సమాజాన్నీ అధ్యయనం చేయాలి. మార్క్సిజమంటే మన ఉద్దేశం, ప్రజా జీవితంలోనూ, ప్రజా పోరాటాలలోనూ సార్థకమైన పాత్ర వహించే సజీవమైన మార్క్సిజం, మాటల మార్క్సిజం (మార్క్సిస్టు పదజాలం) కాదు. మాటల మార్క్సిజమును ఆచరణలో మార్క్సిజంగా మార్చుకున్నట్లయితే పిడివాదం ఉండదు. పిడివాదం సమస్య తీరిపోవడమే గాక, ఇంకా అనేక సమస్యలు కూడా తీరిపోతాయి.

## 2

ఎవరికి సేవ చెయ్యాలన్న సమస్య తేల్చిన మీదట, ఎలా సేవ చెయ్యాలన్న సమస్యకు వద్దాం. మన కామ్రేడ్‌లు కొందరు అడిగినట్లు మనం ప్రమాణాలు పెంచడానికి పూనుకోవడమా, ప్రజాదరణ సాధించడానికి పూనుకోవటమా!

గతంలో కొందరు కామ్రేడ్‌లు ప్రజాదరణను చులకన చేసి, ప్రమాణాలు పెంచడానికి మితిమీరిన ప్రాముఖ్యం ఇచ్చారు. ప్రమాణాలు పెంచడానికి ప్రాముఖ్యం ఇవ్వవలసిందే. కానీ ఏకపక్షంగానూ, దాన్నే ఏకైక లక్ష్యంగా చేసుకుని, అమితంగా ప్రాముఖ్యం ఇవ్వడం తప్పు. నేను చెప్పినట్టు "ఎవరి కోసం?" అన్న సమస్యకు స్పష్టమైన పరిష్కారం లేకపోవటం ఈ సందర్భంలో కూడా వ్యక్తమవుతుంది. "ఎవరి కోసం?" అన్న

సమస్య గురించి ఈ కామ్రేడ్‌లకు స్పష్టత లేకపోవడం చేత, తాము చెప్పే "ప్రమాణాల పెంపు", "ప్రజాదరణ"లకు సరైన లక్షణాలేవో వారు చెప్పలేరు. ఈ రెంటికి గల సంబంధం ఎలా ఉంటుందో అసలే తెలుసుకోలేరు. మన సాహిత్యం, కళలు ప్రధానంగా శ్రామిక, కర్షక, సైనికుల కోసం గనుక, "ప్రజాదరణ సాధించ డమంటే" వారి ఆదరణ సంపాదించటమన్న మాట. "ప్రమాణాలు పెంచటమంటే" వారు ఇప్పుడున్న స్థితి నుంచి పురోగమించటమన్న మాట. వారికి దేనిపై ఆదరణ కనిపించాలి? ఫ్యూడల్ భూస్వామి వర్గానికి కావలసినదీ, వారికి ఆమోదయోగ్యంగా ఉండేదీనూనా? బూర్జువాలకు కావలసినదీ, వారికి ఆమోదయోగ్యంగా ఉండేదీనా? పెటీ బూర్జువా మేధావులకు కావలసినదీ, వారికి ఆమోదయోగ్యంగా ఉండేదీనా? లేదు. ఇదేదీ పనికిరాదు. శ్రామిక, కర్షక, సైనికులకు మాత్రమే కావలసినదీ, ఆమోదయోగ్యంగా ఉండేదీ ఆదరణ పొందేటట్టు చేయాలి. అందుచేత మనం శ్రామిక, కర్షక, సైనికులకు బోధించడానికి పూనుకునేముందు, వారి నుంచి నేర్చుకోవలసి వున్నది. ప్రమాణాలు పెంచడం విషయంలో ఇది మరింత నిజం. ఒక "పునాది" నుంచి పెంచడం జరగాలి. ఉదాహరణకు ఒక నీళ్ళ బకెట్ తీసుకోండి. దాన్ని నేల మీద నుంచి కాక మరెక్కడి నుంచి ఎత్తగలం? గాలిలో నుంచి ఎత్తలేం గదా? సాహిత్య, కళా ప్రమాణాలు ఎక్కడి నుంచి పెంచాలి? ఫ్యూడల్ వర్గం పునాది నుంచా, బూర్జువా పునాది నుంచా, పెటీ బూర్జువా మేధావి పునాది నుంచా? కానే కాదు. శ్రామిక, కర్షక, సైనిక జనబాహుళ్యపు పునాది నుంచి మాత్రమే. అంటే దీని అర్థం శ్రామిక, కర్షక, సైనికులను ఫ్యూడల్ వర్గ, బూర్జువా, పెటీ బూర్జువా మేధావి "శిఖరాలకు" లేవనెత్తటం కూడా కాదు. శ్రామిక, కర్షక, సైనికులు ఎటువైపు పురోగమిస్తున్నారో, శ్రామిక వర్గం ఎటువైపు పురోగమిస్తున్నదో అటువైపు సాహిత్య, కళల స్థాయిని పెంపొందించాలని దాని అర్థం. ఇందులో కూడా శ్రామిక, కర్షక, సైనికుల నుంచి నేర్చుకునే పని ఉంది. శ్రామిక, కర్షక, సైనికులతో ప్రారంభిస్తేనే మనకు ప్రజాదరణ సంపాదించటమూ, ప్రమాణాలు పెంపొందించటమూ అన్నవి అవగాహన అవుతాయి. ఆ రెంటి మధ్య గల సరైన సంబంధం తెలుస్తుంది.

> "ఇంతకూ సాహిత్యం, కళలకు మూలం ఏమిటి? ఒక సమాజానికి చెందిన జీవితం మెదడులో ప్రతిబింబించిన ఫలితంగా ఉత్పన్నమయ్యే భావచిత్రాలే రచనలూ, కళా వస్తువులూనూ. విప్లవ రచయితల కళాకారుల మెదళ్లలో ప్రతిబింబించే ప్రజా జీవితానికి ఫలితాలే విప్లవ సాహిత్యం. కళలు. సాహిత్యానికి, కళలకూ అవసరమైన ముడి పదార్థాల గని ప్రజల జీవితం. ఆ ముడి పదార్థాలు తమ స్వభావసిద్ధమైన రూపంలో, మొరటుగా ఉంటాయి. కానీ ఎంతో సంపన్నంగానూ, మౌలికంగానూ ఉంటాయి."

ఇంతకూ సాహిత్యం, కళలకు మూలం ఏమిటి? ఒక సమాజానికి చెందిన జీవితం మెదడులో ప్రతిబింబించిన ఫలితంగా ఉత్పన్నమయ్యే భావచిత్రాలే రచనలూ, కళా వస్తువులూనూ. విప్లవ రచయితల కళాకారుల మెదళ్లలో ప్రతిబింబించే ప్రజా జీవితానికి ఫలితాలే విప్లవ సాహిత్యం. కళలు. సాహిత్యానికి, కళలకూ అవసరమైన ముడి పదార్థాల గని ప్రజల జీవితం. ఆ ముడి పదార్థాలు తమ స్వభావసిద్ధమైన రూపంలో, మొరటుగా ఉంటాయి. కానీ ఎంతో సంపన్నంగానూ, మౌలికంగానూ ఉంటాయి. అవి సాహిత్యం, కళలకు తరగని, ఏకైక మూలాధారం. దానికి మించి మరో మూలాధారం ఉండటానికి వీలు లేదు. పుస్తకాలలోను, ప్రాచీనకాలానికీ, విదేశాలకూ సంబంధించిన సాహిత్యంలో వేరే మూలాధారం లేదా అని కొందరు అడగవచ్చు. నిజానికి గతానికి చెందిన సాహిత్యమూ, కళలు మూలాధారాలు కావు. అవి ప్రవాహాలు. మన పూర్వులు, విదేశీయులు తమ కాలపు, దేశపు ప్రజా జీవితంలో దొరికిన కళాన్వితమైన ముడిపదార్థాలతో వాటిని సృష్టించారు. మన సాహిత్యం, కళా సంప్రదాయాల నుంచి మంచినంతా మనం అందిపుచ్చుకుని మనకు పనికి వచ్చేదంతా జీర్ణం చేసుకుని, మన దేశానికీ, కాలానికీ చెందిన ప్రజా జీవితంలోని కళాన్వితమైన ముడిపదార్థాలతో కళాసృష్టి చేసేటప్పుడు గతానికి చెందిన సాహిత్యం, కళలను కూడా ఉదాహరణలుగా పెట్టుకోవాలి. అలాంటి ఉదాహరణలు ఉండటానికీ, లేకపోవడానికీ మధ్య ఉండే వ్యత్యాసం మొరటుతనానికీ– కరుకు తనం లేక నునుపుతనానికీ, తక్కువ స్థాయికీ–ఉన్నత స్థాయికీ, మందంగా జరిగే పనికీ–చురుకుగా జరిగే పనికీ మధ్య వుండే వ్యత్యాసం. అందుచేత మనం ఏ పరిస్థితిలోనూ ప్రాచీనుల నుంచీ, విదేశీయుల నుంచీ లభించే సంచితాలను తోసిపుచ్చరాదు. వాటినుంచి నేర్చుకోవటానికి నిరాకరించరాదు. అవి ఫ్యూడల్, బూర్జువా తరగతులకు చెందినవైనా సరే వాటిని సంచితాలు గాను, దృష్టాంతరాలుగానూ వుపయోగించుకుంటాం గదా అని మన కళా సృష్టికి వాటిని ప్రత్యామ్నాయాలు చేసుకోరాదు. మన సృష్టికి ఏదీ ప్రత్యామ్నాయం కాజాలదు. సాహిత్యంలోనూ, కళలోనూ అత్యంత ప్రయోజన రహిత, ప్రమాదకర పిడివాదం ఏదంటే ప్రాచీనుల నుంచీ, విదేశీయుల నుంచీ విమర్శనారహితంగా అరువు తెచ్చుకోవటం, వాటిని అనుకరించటమూను. చైనాలోని విప్లవ రచయితలు, కళాకారులు, వర్ధమాన రచయితలు, కళాకారులు ప్రజల మధ్యకు వెళ్ళాలి. వారు దీర్ఘకాలం పాటు నిస్సంకోచంగా, మనస్ఫూర్తిగా శ్రామిక, కర్షక, సైనిక సమూహాల మధ్యకు పోయి, తీవ్ర సంఘర్షణల మధ్యకుపోయి అత్యంత విస్తృతమూ, సుసంపన్నమూ అయిన ఒకే ఒక మూలాధారం వద్దకు వెళ్ళి సాహిత్యం, కళలకు ముడిపదార్థమైన వివిధ రకాల ప్రజలనూ, అన్ని తరగతులను, అన్ని జనసమూహాలను, అన్ని విస్పష్ట జీవిత విధానాలను, పోరాటాలను అధ్యయనం చేసి, విశ్లేషించాలి. అప్పుడే వారు సృజనాత్మకంగా పనిచేయగలుగుతారు. లేకపోతే ఇక మీకు పనిచేయడానికి ఏమీ మిగలదు. మీరొక కుహనా రచయితగా, కళాకారుడుగా అవుతారు. సరిగ్గా ఇలాంటి వాళ్ళలా తయారు కావద్దనే లూసున్ తన వీలునామాలో తన కొడుకును అంత తీవ్రంగా హెచ్చరించాడు.[5]

సాహిత్యానికీ, కళకూ మానవుడి సామాజిక జీవితం ఒకే ఒక మూలాధార మైనప్పటికీ, అది జీవంతో తొణికిసలాడేదీ, సారవంతమైనదీ అయినప్పటికీ ప్రజలు ఆ తొణికిసలాడే జీవితంతో తృప్తిపడి ఊరుకోరు. సాహిత్యం, కళలను కూడా కోరుతారు. ఎందుచేత? రెండూ ముఖ్యమైనవే అయినప్పటికీ, వాస్తవమైన నిత్యజీవితం కన్నా సాహిత్యం, కళలలో ప్రతిబింబించే జీవితం మరింత ఉన్నత స్థాయిలోను, మరింత గాఢంగాను, మరింత ఏకాగ్రంగాను, మరింత లక్షణంగాను, ఆదర్శానికి సన్నిహితంగాను ఉంటుంది. ఆ కారణం వల్ల మరింత

**"సాహిత్యానికీ, కళకూ మానవుడి సామాజిక జీవితం ఒకే ఒక మూలాధార మైనప్పటికీ, అది జీవంతో తొణికిసలాడేదీ, సారవం తమైనదీ అయినప్పటికీ ప్రజలు ఆ తొణికిసలాడే జీవితంతో తృప్తి పడి ఊరుకోరు. సాహిత్యం, కళలను కూడా కోరుతారు. ఎందు చేత? రెండూ ముఖ్యమైనవే అయినప్పటికీ, వాస్తవమైన నిత్య జీవితం కన్నా సాహిత్యం, కళలలో ప్రతిబింబించే జీవితం మరింత ఉన్నత స్థాయిలోను, మరింత గాఢంగాను, మరింత ఏకాగ్రంగాను, మరింత లక్షణంగాను, ఆదర్శానికి సన్నిహితంగాను ఉంటుంది."**

సార్వజనీనంగానూ ఉంటుంది, ఉండాలి కూడా. విప్లవ సాహిత్యం, కళలు వాస్తవ జీవితం నుంచి వివిధ రకాల పాత్రలను సృష్టించి, చరిత్రను పురోగమింపచేయడంలో ప్రజా బాహుళ్యానికి సాయపడాలి. ఉదాహరణకు ఒక వంక ఆకలితోను, చలికీ, హింసతో బాధపడటం ఉన్నది. మరొక వంక మనిషిని మనిషి దోచుకోవటమూ, హింసించటమూ ఉన్నది. ఈ విషయాలు సర్వత్రా ఉన్నవే. అయితే ప్రజలు వాటిని సామాన్య విషయాలుగా పరిగణిస్తారు. రచయితలూ, కళాకారులూ ఇలాంటి దైనిక సంఘటనలను ఏర్చికూర్చాలి. వాటిలోని వైరుధ్యాలను, పోరాటాలనూ లక్షణాలను సమన్వయం చేసి రచనలు సృష్టించి, ప్రజలను మేల్కొలిపి వారికి ఉత్సాహం చేకూర్చి, వారు తమ వాతావరణాన్ని మార్చుకోవడానికి గాను సమైక్యతతో సంఘర్షణ సాగించటానికి తోడ్పడాలి. అలాంటి సాహిత్యం, కళలు లేకుండా ఈ పని పూర్తి కాదు. కనీసం ఫలించదు, శీఘ్రంగానూ జరగదు.

రచయితలలోను, కళావస్తువులలోను ప్రజాదరణా, ప్రమాణాలూ పెంచడం అంటే ఏమిటి? ఈ రెండు కర్తవ్యాలకూ గల సంబంధం ఏమిటి? ప్రజాదరణ పొందే రచనలు సుగమంగానూ, సరళంగానూ ఉండి, ఈనాటి ప్రజా బాహుళ్యానికి మరింత ఆమోదకరంగా ఉంటాయి. ఇంకా హెచ్చు స్థాయి గల రచనలు, మరింత పరిష్కృతంగా ఉండేవి కావటం చేత, సృష్టించడం మరింత కష్టమై, ప్రస్తుతం ప్రజాబాహుళ్యంలో అంత తేలికగా ప్రచారం కావు. శ్రామిక, కర్షక, సైనికులను ఎదుర్కొంటున్న సమస్య ఏమిటంటే, వారు శత్రువుతో రక్తసిక్తమైన దారుణ సంఘర్షణలో మునిగి తేలుతున్నారు. అయితే దీర్ఘకాలం సాగిన ఫ్యూడల్, బూర్జువా వర్గాల పరిపాలనల పుణ్యమా అంటూ వారు నిరక్షరాస్యులు, విద్యాశూన్యులు. అందుచేత వారి జ్ఞానాన్నీ, విద్యనూ తమ అవసరాలకు ఉపయోగపడే సులభగ్రాహ్యమైన రచనలను, కళలనూ ఆత్రంతో కోరుతున్నారు. వాటి సహాయంతో వారు పోరాటానికి కావలసిన ఉత్సాహమూ, విజయంతో విశ్వాసమూ పొంది ఒకపట్టుదలతో, బలపడిన సమైక్యతతోనూ శత్రువుతో పోరాడుతారు. వారికి ముఖ్యంగా కావలసినది "చందన పవనాలు" కాదు "అగ్నికి ఆజ్యం". అందుచేత ప్రస్తుత పరిస్థితులలో ప్రజాదరణ సాధించడం మరింత ప్రధానమైన కర్తవ్యం. ప్రజాదరణను చిన్నచూపు చూడటం గానీ, ఉపేక్షించడం గానీ పొరపాటు.

అయినప్పటికీ ప్రజాదరణకూ, ప్రమాణాల పెరుగుదలకూ మధ్య ఖచ్చితమైన హద్దు పెట్టడం సాధ్యం కాదు. ఉన్నత స్థాయికి చెందిన రచనలకు ప్రజాదరణ లభించేటట్టు చేయడం ఈనాడైనా సాధ్యమేనా అన్నది అలా ఉండగా, ప్రజాబాహుళ్యపు సాంస్కృతిక స్థాయి క్రమంగా పెరుగుతున్నది. ప్రజాదరణ శాశ్వతంగా ఒకే స్థాయిలో నిలిచిపోయి, నెలలూ, సంవత్సరాలూ గడుస్తున్నా అదే "గొర్రెల కాపరి"[6] నాటికా, అదే మనిషి చెయ్యి, నీరు, కత్తి, ఆవు, మేక వంటి పదాలు చెబుతూ పోతే, బోధకులూ, బోధితులూ ఎక్కడివారక్కడే ఉండిపోరా? అలాంటి ప్రజాదరణ సాధించటంలో అర్థమేమిటి? ప్రజలకు ముందు సాహిత్యం, కళల పట్ల ఆదరణ కావాలి. అనంతరం ప్రమాణాల పెరుగుదల కావాలి. ఒక్కొక్క నెలా, ఒక్కొక్క సంవత్సరమూ గడిచే కొద్దీ వారు ప్రమాణాల పెరుగుదల కోరుతారు. ఇక్కడ ప్రజాదరణ అంటే ప్రజలలో ఆదరణ, ప్రమాణాల పెరుగుదల అంటే ప్రజల కొరకు స్థాయి పెరగటం. ఈ పెరుగుదల అన్నది గాలిలో నుంచి ఊడిపడదు. రహస్యంగా నాలుగు గోడల మధ్య జరగదు. ప్రజాదరణ ఆధారంగానే జరుగుతుంది. అది ప్రజాదరణచేత నిర్ణయం అవుతూనే, ప్రజాదరణకు దారి చూపుతుంది. చైనా మొత్తం మీద చూసినట్లయితే విప్లవ సంస్కృతుల పెరుగుదల ఎగుడుదిగుడుగా ఉన్నది. వాటి వ్యాప్తి నింపాదిగా సాగుతున్నది. ఒక ప్రాంతంలో ప్రజాదరణా, ప్రజాదరణ ఆధారంతో ప్రమాణాల అభివృద్ధి జరుగుతుంటే, మరికొన్ని ప్రాంతాల ప్రజాదరణ ప్రారంభమైనా కాలేదు. అందుచేత ఒక ప్రాంతంలో ప్రజాదరణ పెంపొందించడం ద్వారా ప్రమాణాలను పెంచే అనుభవాన్ని ఇతర ప్రాంతాలతో వినియోగించి, అక్కడ ప్రజాదరణనూ, ప్రమాణాల అభివృద్ధినీ సాధించే కృషిని కొనసాగించి, ఆ కార్యక్రమంలో వున్న అనేక అవకతవకలను దాటవేయవచ్చు. అంతర్జాతీయంగా ఇతర దేశాల నుంచి అనుభవమూ, ప్రత్యేకించి సోవియట్ అనుభవమూ కూడా మనకు మార్గదర్శకం కాగలవు. అందుచేత, మనకు సంబంధించినంతవరకు, ప్రమాణాలు పెంచడం, ప్రజాదరణపైన ఆధారపడి వున్నది. ప్రజాదరణకు మార్గం చూపేది ప్రమాణాల పెరుగుదల. ఇదే కారణం చేత, మనం చెప్పుకుంటున్న ప్రజాదరణ కృషి ప్రమాణాల పెరుగుదలకు ఎంత మాత్రమూ అంతరాయం కాకపోగా, ప్రమాణాలు పెంచే కృషికి ఆధారభూతంగా ఉంటుంది. మనం ప్రస్తుతం ప్రజాదరణకు చిన్న ఎత్తున కృషి చేస్తున్నాం. అంతేగాక ముందు ముందు ప్రమాణాలు పెంచే కృషి మరింత విస్తృతంగా జరగటానికి అవసరమైన పరిస్థితులు కూడా కలిగిస్తుంది.

ప్రజాబాహుళ్యానికి ప్రత్యక్షంగా అవసరమైన విధంగా ప్రమాణాలను పెంచటం అలా ఉండగా, వారి అవసరాలకు పరోక్షంగా అవసరమైన ప్రమాణాల పెరుగుదల కూడా ఒకటి ఉన్నది. అంటే, కేడర్లకు అవసరమైనది. కేడర్లు ప్రజాబాహుళ్యానికి పురోగాములు. వారు సాధారణంగా హెచ్చు విద్య అభ్యసించిన వారుగా ఉంటారు. వారికి హెచ్చు ప్రమాణాలు గల సాహిత్యం అత్యవసరం. దీన్ని ఉపేక్షించడం పొరపాటు అవుతుంది. కేడర్ల కోసం చేసేదంతా ప్రజాబాహుళ్యం కోసం చేసినట్టే. ఎందుకంటే కేడర్ల ద్వారానే మనం ప్రజాబాహుళ్యానికి ప్రబోధించి, నడిపించాలి. ఈ ఆశయానికి విరుద్ధంగా వెళ్ళినట్లయితే, మనం కేడర్లకు అందించే దాని ద్వారా వారు ప్రజాబా హుళ్యాన్ని ప్రబోధించి, ముందుకు నడిపించలేకపోతే, మనం ప్రమాణాలు పెంచడానికి చేసే కృషి గుడ్డివాడి చేతిరాయై, ప్రజాబాహుళ్యానికి సేవ చేయటమనే మౌలిక లక్ష్యానికి పెడగా పోతాం.

**సారాంశంలో :** విప్లవ రచయితల, కళాకారుల సృజనాత్మక కృషి ద్వారా ప్రజా జీవితంలో లభ్యమయ్యే ముడిపదార్థం భావరూపం పొంది, ప్రజలకు సేవ చేసే

సాహిత్యంగానూ, కళగానూ రూపొందుతుంది. ఇందులో, తక్కువ స్థాయి సాహిత్యం, కళల ఆధారం మీద అభివృద్ధి అయిన ఉన్నత సాహిత్యం, కళలు ప్రజా బాహుళ్యంలో హెచ్చు స్థాయి నందుకున్న వారికి, లేదా ప్రజలలోని కేడర్లకు అవసరం. అలాగే ఈనాటి ప్రజాబాహుళ్యంలో అత్యధిక సంఖ్యాకులకు కావలసిన తక్కువ స్థాయి సాహిత్యం కళలు, ఉన్నత సాహిత్యం, కళల మార్గదర్శకత్వం కింద ఉండాలి. తక్కువ, ఎక్కువ స్థాయిలదేదైనా, మన సాహిత్యం, కళలన్నీ ప్రజా బాహుళ్యం కోసమే. ప్రధానంగా శ్రామిక, కర్షక, సైనికుల కోసం, అవి శ్రామిక, కర్షక, సైనికుల కొరకే సృష్టియై, వారికి ఉపయోగపడతాయి.

> “విప్లవ రచయితల, కళాకారుల సృజనాత్మక కృషి ద్వారా ప్రజా జీవితంలో లభ్యమయ్యే ముడిపదార్థం భావరూపం పొంది, ప్రజ లకు సేవ చేసే సాహిత్యం, కళగా రూపొందుతుంది. ఇందులో, తక్కువ స్థాయి సాహిత్యం, కళల ఆధారం మీద అభివృద్ధి అయిన ఉన్నత సాహిత్యం, కళలు ప్రజా బాహుళ్యంలో హెచ్చు స్థాయి నందు కున్న వారికి, లేదా ప్రజలలోని కేడర్లకు అవసరం. అలాగే ఈనాటి ప్రజా బాహుళ్యంలో అత్యధిక సంఖ్యాకులకు కావల సిన తక్కువ స్థాయి సాహి త్యం కళలు, ఉన్నత సాహిత్యం, కళల మార్గదర్శకత్వం కింద ఉండాలి.”

ప్రమాణాల పెరుగుదలకూ, ప్రజాదరణకూ గల సంబంధానికి చెందిన సమస్యను తేల్చుకున్నాం గనుక నిపుణులకూ, ప్రజాదరణ సాధించేవారికి మధ్య ఉండే సంబంధానికి చెందిన సమస్య కూడా తేల్చవచ్చు. మన నిపుణులు కేడర్ల కొరకు మాత్రమే కాదు, ప్రజాబాహుళ్యం కొరకు కూడాను. ముఖ్యంగా ప్రజాబాహుళ్యం కొరకే. మన సాహిత్య నిపుణులు ప్రజల “గోడ వార్తా పత్రికల పట్లా” సైన్యం నుంచీ, గ్రామాల నుంచీ వెలువడే వార్తా రచనల పట్ల శ్రద్ధ వహించాలి. మన నాటక నిపుణులు సైన్యంలోను, గ్రామాలలోనూ ఉండే చిన్న నాటక సమాజాల పట్ల శ్రద్ధ వహించాలి. మన సంగీత నిపుణులు ప్రజల పాటల పట్ల శ్రద్ధ వహించాలి. మన లలిత కళా నిపుణులు ప్రజలకు సంబంధించిన లలిత కళల పట్ల శ్రద్ధ వహించాలి. ఈ కామ్రేడ్స్ అందరూ ప్రజాబాహుళ్యంలో సాహిత్యం, కళల పట్ల ఆదరణ కోసం కృషి చేస్తున్న కామ్రేడ్లతో సన్నిహిత సంబంధాలుంచుకోవాలి. ఒకవంక వారు ప్రజాదరణ కొరకు పాటుపడే వారికి మార్గదర్శకులుగా ఉంటూ, మరొక వంక వారి నుంచి నేర్చుకోవాలి. వారి ద్వారా ప్రజాబాహుళ్యం నుంచి సత్తాను గ్రహించి, తమ శక్తులను పూరించి, పెంచుకోవాలి. లేకపోతే ఈ నిపుణులు ప్రజా బాహుళ్యానికీ, వాస్తవానికీ దూరమైపోయి, సారమూ, జీవమూ కోల్పోయి, “ఒంటి స్తంభం మేడలు” అయిపోతారు. మనం నిపుణులను గౌరవిం చాలి. వారు మన ఉద్యమానికి ఉపయోగపడే వారు. అయితే, ప్రజలతో సన్నిహిత సంబంధం కలిగి, వారి ఆలోచనలను, భావాలను ప్రకటించి, వారికి విశ్వాసపాత్రుడైన ప్రతినిధి అయి సేవ చేస్తే తప్ప ఏ విప్లవ రచయితా, కళాకారుడూ అర్థవంతమైన పని చేయలేడని మనం వారికి చెప్పాలి. ప్రజల పక్షాన మాట్లాడటం ద్వారానే వారు ప్రజలకు ప్రభోదించగలరు. ప్రజలకు శిష్యులుగా ఉండటం ద్వారానే వారికి గురువులు కాగలరు. వాళ్ళు ప్రజాబాహుళ్యానికి యజమానులమనీ, “అలగా” జనాన్ని ప్రభువులు శాసించినట్లు శాసించగలమనీ అనుకుంటే, వారు ఎంత గొప్ప నిపుణులైనా కావచ్చు. ప్రజలకు వారితో పని ఉండదు. వారు సృష్టించే దానికి భవిష్యత్తూ ఉండదు.

ఈ మన దృక్పథం ప్రయోజనవాదం (యుటిలిటేరియనిజం) కిందకు వస్తుందా? భౌతికవాదులు సాధారణ ప్రయోజనవాదానికి అభ్యంతరం చెప్పరు. ఫ్యూడల్, బూర్జువా పెటీ బూర్జువా వర్గాల ప్రయోజనవాదాన్ని మాత్రమే ప్రతిఘటిస్తారు. ప్రయోజనవాదాన్ని మాటలతో ఖండిస్తూ, చేతలతో అత్యంత స్వార్థపూరితమూ, హ్రస్వదృష్టితో కూడినదీ అయిన ప్రయోజన వాదాన్ని అవలంబించే వంచకులను ప్రతిఘటిస్తారు. ప్రయోజన మూల చింతనకు అతీతమైన “ఇజం' ఏదీ ప్రపంచంలో లేదు. వర్గ సమాజంలో ఈ వర్గానిదో, ఆ వర్గానిదో అయిన ప్రయోజనం మాత్రమే ఉంటుంది. మనం శ్రామిక విప్లవ ప్రయోజనవాదులం. ప్రజాబాహుళ్యంలో 90 శాతం అయిన అత్యధిక సంఖ్యాకుల వర్తమాన, భవిష్యత్ ఐక్యత నుంచి మనం ముందుకు పోతాం. అందుచేత మనం అత్యంత విశాలమూ, దీర్ఘకాలికమూ అయిన లక్ష్యం గల విప్లవ ప్రయోజనవాదులం. పాక్షిక సత్వర లక్ష్యాలు గల సంకుచిత ప్రయోజన వాదులంకాము. ఉదాహరణకు మీరు ప్రజాబాహుళ్యపు ప్రయోజనవాదాన్ని ఖండిస్తూ, మీ ప్రయోజనం కోసం గానీ, ఒక చిన్న ముఠా ప్రయోజనం కోసం గానీ, కొద్దిమందికి మాత్రమే నచ్చి జనబాహుళ్యానికి నిరుపయోగం, అపాయకరం అయిన రచనలను విడుదల చేసి ప్రజలలో ప్రచారం చేస్తే అందువల్ల మీరు ప్రజలకు ద్రోహం చేసినవారు కావటమే గాక, మీకు ఆత్మ జ్ఞానం లేనట్టు బయట పెట్టుకున్నవారు కూడా అవుతారు. ప్రజాబాహుళ్యానికి నిజమైన లాభం కలిగించేదే మంచిదవుతుంది. మీ రచన “వసంత హిమం” అంత గొప్పది కావచ్చు. కాని ఇప్పుడున్న పరిస్థితిలో అది కొద్దిమందికే పనికివచ్చి, ప్రజాబాహుళ్యం ఇంకా “పల్లెటూరు పేదవాని పాట'' పాడుతూ వుంటే, మీరు వారి ప్రమాణాలను పెంచడానికి బదులు వారిని నిందించి ఏమీ సాధించలేరు (ఈ రెండు గేయాలూ క్రీ.పూ. 3వ శతాబ్దికి చెందిన చూ రాజ్యం నాటివి. “వసంత హిమం”లో సంగీతం “పేద గ్రామీణుల పాట”లో సంగీతం కన్న మిన్న. కాని చూ రాజధానిలో ఎవరో మొదటిపాట పాడినప్పుడు కొద్దిమంది వంత పాడారట. రెండోది పాడినప్పుడు వేలాది ప్రజలు తమ గొంతులు కలిపారట). ఇప్పుడున్న సమస్య ఏమిటంటే “వసంత హిమం”కూ, “గ్రామీణ పేదల పాట”కూ ఐక్యత సాధించటం. ఉన్నత ప్రమాణాలకూ, ప్రజాదరణకూ ఐక్యత కలిగించటం. అలాంటి ఐక్యత లేకపోతే ఎంత గొప్ప నిపుణుడి ఉత్తమ కళ అయినా అతి సంకుచిత ప్రయోజన మూలమైనదే అవుతుంది. దాన్ని మీరు “స్వచ్ఛమైన మహోన్నత” కళ అనవచ్చు. కానీ అది మీరు పెట్టే పేరే కాని దాన్ని ప్రజలు ఆమోదించరు.

శ్రామిక, కర్షక, సైనికులకు సేవ చేసే సమస్యను, ఎలా చేయాలన్న సమస్యను మనం పరిష్కరించిన మీదట, జీవితంలోని మంచిని గురించి రాయాలా, చెడును గురించి రాయాలా అనే సమస్యలూ, ప్రజల ఐక్యత లాంటి ఇతర సమస్యలు కూడా పరిష్కారమవుతాయి. ఈ ప్రాథమిక విధానాన్ని అందరూ ఆమోదించి నట్టయితే, సాహిత్యం, కళల రంగంలో మన సాహిత్య, కళా కలాపాలలోనూ పనిచేసే వారందరూ మన సమస్త విద్యాలయాలు, ప్రచురణలూ, సంస్థలూ దాన్ని అవలంబిం చాలి. ఈ విధానాన్ని అతిక్రమించటం తప్పు. దీనికి భిన్నంగా ఏదైనా ఉంటే దాన్ని సంస్కరించాలి.

> **" రాజకీయాలకు లోబడకుండా స్వతంత్రంగా వున్న కళలు ఎక్కడా లేవు. శ్రామిక వర్గ సాహిత్యమూ, కళలు అనేవి మొత్తం శ్రామికుల విప్లవోద్యమంలో ఒక భాగం. లెనిన్ అన్నట్టు అవి మొత్తం విప్లవ యంత్రంలో పళ్ళూ, చక్రాలన్నమాట. అందుచేత, సాహిత్యం కళల విషయంలో పార్టీ చేసే పని, పార్టీ నిర్వహించే మొత్తం విప్లవ కార్యాచరణలో ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన స్థానం కలిగి వుండి, ఒక ప్రత్యేక విప్లవ దశలో పార్టీ నిర్ణయించే విప్లవ బాధ్యతలకు లోబడి ఉంటుంది. "**

మన సాహిత్యమూ, కళా ప్రజాబాహుళ్యం కొరకు గనుక, పార్టీ అంతస్సంబంధాలకు సంబంధించిన ఒక సమస్యను చర్చించడానికి మనం పూనుకోవచ్చు. అది ఏమంటే పార్టీ చేసే మొత్తం పనికీ, సాహిత్యం, కళల పట్ల చేసే పనికీ గల సంబంధం, అలాగే పార్టీకి గల బాహిర సంబంధాలను గురించిన సమస్యను అంటే, సాహిత్య, కళారంగంలో పార్టీ చేసే పనికీ, పార్టీకి చెందని వారు చేసే పనికీ సంబంధించిన సమస్యను, సాహిత్య కళారంగాలలో ఐక్య సంఘటనకు చెందిన సమస్యను కూడా చర్చించవచ్చు.

మొదటి సమస్యను పరిశీలిద్దాం. నేటి ప్రపంచంలో సమస్త సంస్కృతీ, సమస్త సాహిత్యమూ, కళా విస్పష్ట వర్గాలకు చెంది వుండి, విస్పష్టమైన రాజకీయ పంథాలతో ముడిపడి వున్నాయి. వాస్తవానికి కళ కోసమేనన్న కళా, వర్గాలకు అతీతమైన కళా,

రాజకీయాలకు లోబడకుండా స్వతంత్రంగా వున్న కళలు ఎక్కడా లేవు. శ్రామిక వర్గ సాహిత్యమూ, కళలు అనేవి మొత్తం శ్రామికుల విప్లవోద్యమంలో ఒక భాగం. లెనిన్ అన్నట్టు అవి మొత్తం విప్లవ యంత్రంలో పళ్ళూ, చక్రాలన్నమాట. అందుచేత, సాహిత్యం కళల విషయంలో పార్టీ చేసే పని, పార్టీ నిర్వహించే మొత్తం విప్లవ కార్యాచరణలో ఒక స్పష్టమైన, నిర్దిష్టమైన స్థానం కలిగి వుండి, ఒక ప్రత్యేక విప్లవ దశలో పార్టీ నిర్ణయించే విప్లవ బాధ్యతలకు లోబడి ఉంటుంది. ఈ ఏర్పాటును వ్యతిరేకించినట్టయితే ద్వైదీభావం (డ్యూయలిజం), బహుళత్వం (ప్లూరలిజం) ఏర్పడి సారాంశంలో ట్రాట్స్కీ విషయంలో లాగా "రాజకీయాలు మార్క్సిస్టువీ, కళ బూర్జువాదీ" అవుతుంది. సాహిత్యం, కళల ప్రాముఖ్యాన్ని ఆకాశానికెత్తటం మనకు సమ్మతం కాదుగానీ, వాటిని తృణీకరించటం కూడా మనకు సమ్మతం కాదు.


సాహిత్యమూ, కళలు రాజకీయాలకు లోబడినవే అయినా, అవి రాజకీయాల మీద గొప్ప ప్రభావం కలిగిస్తాయి. మొత్తం విప్లవోద్యమంలో విప్లవ సాహిత్యమూ, కళలు ఒక భాగం. అవి అందులోని పళ్ళూ, చక్రాలు. ఇతర ముఖ్యమైన భాగాలతో పోల్చితే వాటి అవసరం తక్కువగా వుండి, వాటిది అప్రధాన స్థానం కావచ్చు కానీ మొత్తం యంత్రంలో అవి అవసరమైనవి. మొత్తం విప్లవోద్యమంలో అవి అవసరమైన భాగం. విస్తృత ప్రచారం గల సాధారణ సాహిత్యమూ, కళలు లేని పక్షంలో మనం విప్లవోద్యమాన్ని కొనసాగించి, విజయం సాధించలేం. ఇది గ్రహించకపోవటం తప్పు. అంతేకాదు, సాహిత్యం, కళలు, రాజకీయాలకు లోబడడం అంటే, వర్గ రాజకీయాలకూ, ప్రజా రాజకీయాలకూ లోబడి ఉండాలని. అంతేకాని కొద్దిమంది రాజకీయవాదులనబడేవాళ్ళ రాజకీయాలకు కాదు. విప్లవ రాజకీయాలుగానీ, విప్లవ వ్యతిరేకమైనవిగానీ – రాజకీయాలంటే ఒక వర్గానికీ మరో వర్గానికీ మధ్య సంఘర్షణ. అంతేగానీ అవి కొద్దిమంది కార్యకలాపం కాదు. సిద్ధాంత, కళారంగాలకు చెందిన విప్లవ పోరాటం రాజకీయ పోరాటానికి లోబడి ఉండాలి. ఎందుకంటే, రాజకీయాల ద్వారా మాత్రమే వర్గ అవసరాలూ, ప్రజాబాహుళ్య అవసరాలూ వ్యక్తమవుతాయి. విప్లవ రాజకీయ శాస్త్రం, విప్లవ విద్య అనేవి రాజకీయవేత్తలకు, జన బాహుళ్యపు నాయకులు మాత్రమే. వారి కర్తవ్యం ఈ కోట్లాది ప్రజల అభిప్రాయాలు సేకరించి, క్రమంలోపెట్టి, మెరుగులు దిద్ది, తిరిగి ప్రజలకు అందించడం. తరువాత ప్రజలు వాటిని అందుకుని, ఆచరణలో పెడతారు. అందుచేత వీరు గోప్యంగా వ్యవహరిస్తూ, విజ్ఞత అంతా తమ సొత్తే అనుకునే ఘరానా "రాజకీయవేత్తల" వంటి వారు కాదు. శ్రామికవర్గ రాజకీయవేత్తలకూ, క్షీణ బూర్జువా రాజకీయవేత్తలకూ సూత్రప్రాయమైన తేడా ఇందులోనే వున్నది. ఈ కారణం చేతనే మన సాహిత్యం, కళా రచనల రాజకీయ స్వభావానికీ, వాటి నిజాయితీకి సమగ్ర ఐక్యత సాధ్యమవుతుంది. ఇది గుర్తించక, శ్రామికులకు సంబంధించిన రాజకీయాలను గురించీ, రాజకీయవేత్తలను గురించీ చర్చించటం తప్పు.

ఇప్పుడు సాహిత్యం, కళారంగంలో ఐక్య సంఘటన సమస్య గురించి ఆలోచిద్దాం. సాహిత్యం, కళలు రాజకీయాలకు లోబడి ఉండాలనుకున్నాం కాదా. చైనా రాజకీయాలలో నేటి ప్రధాన సమస్య జపానును ఎదుర్కోవడం. అందువల్ల మన రచయితలూ, కళాకారులూ జపాన్‌ను ఎదుర్కొనే సమస్య విషయంలో పార్టీకి చెందని రచయితల, కళాకారులందరితోనూ సహకరించాలి. (పార్టీకి చెందని రచయితలు, కళాకారుల్లో పార్టీ అభిమానులు మొదలుకుని పెటీ బూర్జువా రచయితలూ, కళాకారులూ, జపానును నిరోధించగోరే బూర్జువా, భూస్వామ్య వర్గాలకు చెందిన రచయితలూ, కళాకారులూ దాకా ఉన్నారు). రెండవ సంగతి, మనం వారితో ప్రజాస్వామ్యం విషయంలో ఏకం కావాలి. ఈ సందర్భంలో మనతో ఏకీభవించని జపాను వ్యతిరేక రచయితల, కళాకారుల వర్గం ఒకటి ఉన్నది. అందుచేత మనతో కలిసివచ్చేవారి శ్రేణి పరిమితమవుతుంది. మూడవ సంగతి, మనం వారితో సాహిత్య, కళల విధానమూ, శైలీ లాంటి సమస్యల మీద ఐక్యత సాధించాలి. మనం సోషలిస్టు వాస్తవికత కోరే వాళ్ళమూ, కొందరు కారూ గనుక, ఇక్కడ మళ్లీ మనతో కలిసివచ్చే శ్రేణి మరింత కుంచించుకుపోతుంది. ఒక విషయంలో ఏకీభావం ఉంటే మరొక విషయంలో ఘర్షణా, విమర్శా ఉంటుంది. వివిధ విషయాల మధ్య ఒకే సమయంలో వేర్పాటు, సరస్పరసంబంధం ఉంటాయి. అందుచేత జపానును ఎదుర్కోవడం వంటి ఐక్యతకు దారితీసే విషయాలలో కూడా ఘర్షణా, విమర్శా ఉంటుంది. ఐక్య సంఘటనలో "ఐక్యతే గాని ఘర్షణ కూడదు", "ఘర్షణే గాని ఐక్యత కూడదు" అనేవి రెండూ తప్పుడు విధానాలే. గతంలో మన కేడర్లు రాజకీయాలలో మితవాద లొంగుబాటువాదం, "తోక"వాదం, లేదా అదివాద పిడివాదం అనుసరించడం ఎంత నిజమో సాహిత్యం, కళలలోనూ అవి అంతే నిజం.

చైనాలో ఐక్యసంఘటనకు సాహిత్యం, కళారంగాలలో పెటీ బూర్జువా రచయితలూ, కళాకారులూ ఒక ప్రబల వర్గం. వారి ఆలోచనలలోను, రచనలలోనూ కూడా అనేక లోపాలున్నాయి. అయితే తారతమ్యత రీత్యా వారు విప్లవానికి అనుకూలంగానూ, శ్రామిక వర్గానికి సన్నిహితంగానూ ఉన్నారు. అందుచేత వారు తమ లోపాలను సవరించుకునేటందుకు సహాయపడి, శ్రామిక ప్రజలకు సేవ చేసే సంఘటనలోకి ఆకర్షించబడటం ప్రత్యేకించి ముఖ్యమైన కర్తవ్యం.

❃

# భారత ఆర్థికాభివృద్ధి : గణాంకాల మిథ్య



రచయిత ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం ఆర్థిక అధ్యయనాల సంస్థలో ప్రొఫెసర్. ఈయన రాసిన పత్రాలు అనేక ఆర్థిక జర్నల్స్‌లో ప్రచురితమైనాయి. ఆర్థిక వ్యవహారాలపై అనేక గ్రంథాలు రాశారు.

సిపి చంద్రశేఖర్

**భా**రతదేశంలో ఈనాటి అభివృద్ధి చాలా వరకు, అత్యధిక ద్రవ్యత లభ్యత వలన ఏర్పడిన సట్టా బుడగల (స్పెక్యులేటివ్ బబుల్స్) కారణంగా ప్రేరేపించబడిన అభివృద్ధి. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి గల అభివృద్ధి.

భారతదేశ స్థూల జాతీయోత్పత్తి పెరుగుదలను చూపుతూ దాని చుట్టూ ఎంతో ఘనమైన ప్రచారాలు, వేడుకలు జరుగుతు న్నాయి. ఈ ఎదుగుదల గణాంకాలను చూస్తున్న సందర్భములో రెండు ప్రధానమైన అంశాలను విస్మరించడం జరిగిందని చాలామంది చెబుతున్నారు. మొదటి అంశం, ఈ వార్షిక పెరుగుదల గణాంకాలు కోవిడ్ కాలంలో బాగా పతనమైన ఆర్థిక వ్యవస్థ నుండి తిరిగి పుంజుకునే క్రమంలో వెలువడినవి. కోవిడ్ వ్యాప్తికి ముందున్న స్థాయికి చేరుకోవడంలో మనం ఇంకా సంతృప్తికరమైన పురోగతిసాధించలేదు. .రెండోది, కొత్త స్థూల జాతీయోత్పత్తి క్రమాన్ని 2011–12 సంవత్సరం ఆధారంగా నిర్ధారించడం. ఈ సంవత్సరాన్ని ఆధారంగా ఎంచుకోడంలోనూ, కొత్త గణాంకాల మూలాల ఎంపికలోనూ, లెక్కించే పద్ధతుల మార్పులలోనూ అనేక సమస్యలు ఉన్నాయి. వాటివలనే అభివృద్ధి స్థాయి, రేటు కూడా పెరిగాయి. భారతదేశం సాపేక్షంగా గణనీయమైన అభివృద్ధి చెందడమన్నది బహుశా గణాంకాల వలన ఏర్పడ్డ మిథ్య అయి ఉంటుంది.

2000 సంవత్సరం మధ్యనుండి పెరిగిన స్థూల జాతీయోత్పత్తి అభివృద్ధి గణాంకాలలోనూ, విశ్లేషణలలోనూ కనిపించిన ‘ చలనశీలతా ధోరణులు ఇటీవలి అభివృద్ధిలో ప్రతిబింబించలేదు. ఈ అభివృద్ధికి అసలు కారణం, ద్రవ్య సరళీకరణ కారణంగా ఆర్థిక వ్యవస్థలోకి జొప్పించబడిన ద్రవ్యత (లిక్విడిటీ) అనీ, ఈ అభివృద్ధి అంతా సట్టా బుడగలతో (స్పెక్యులేటివ్ బబుల్స్‌తో) నిండి ఉందని విమర్శకులు చెబుతున్నారు. అభివృద్ధిచెందిన దేశాలలో, ప్రధానంగా అమెరికాలో ఈ సరళీకరణ ధోరణి తీవ్రత దీర్ఘకాల ద్రవ్య విధానాల మార్పులతో ముడిపడి ఉంది. అంటే ఇదివరకటిలా విత్త (ఎకనామిక్) విధానాలలో మార్పుల ద్వారా అభివృద్ధికి దోహదపడాలని కాక, ద్రవ్య (ఫైనాన్స్) విధానాల్లో మార్పుల ద్వారా అభివృధి సాధించాలని భావించడం జరుగుతున్నది. అంటే అభివృద్ధి సాధించడానికి మరింత ఎక్కువగా ద్రవ్య సాధనాల మీద ఆధారపడాలనీ, రుణాలు మరింత చవకగా అందుబాటులో ఉండేటట్టు చూడాలనీ భావించడం జరుగుతున్నది. ద్రవ్యం అందుబాటులో ఉండడం లేదా డబ్బు సరఫరా పెంచి ‘నగదు’ సులభంగా అందుబాటులోకి తేవడం వలన రుణాలు అందుబాటులోకి వస్తాయనీ, తద్వారా అభివృద్ధి సాధ్యపడు తుందనీ భావించడం జరుగుతున్నది. ‘డబ్బు సరఫరా పెంచే’ విధానం వలన, దాదాపు సున్నా వడ్డీ విధానం అమలు చేయడం వలన 2008లో ఎదుర్కొన్నలాంటి ఆర్థిక సంక్షోభం నుండి బయటపడగలిగాము. ఈ విధానాల ఫలితంగా, అంతర్జాతీయ చలనశీలత గల అధిక లాభలను సమకూర్చుకునేందుకు ఆశపడే ద్రవ్య పెట్టుబడి కొత్త రంగాలలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తుంది.

పెట్టుబడులు పెట్టడానికి ఎంపికచేసుకునే చాలా దేశాలలో భారతదేశం ఒకటి. అందువలన ఇక్కడ ఇటువంటి పెట్టుబడి రాక, పోక కూడా నిరంతరం చంచలంగా ఉన్నది. ఎంతగా చలనశీలంగా ఉన్నప్పటికీ, అప్పుడప్పుడూ మదుపరులు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకుని పోతున్నప్పటికీ అంతిమంగా దేశంలోకి వచ్చిపడుతున్న పెట్టుబడులే అధికంగా ఉన్నాయి. ఫలితంగా భారతదేశంలో రుణ, వాటాల మార్కెట్‌లో, విదేశీ ద్రవ్య పెట్టుబడి సంచయనం కొనసాగుతున్నది. ఉదాహరణకి, 2004 జనవరి నుండి 2023 సెప్టెంబర్ మధ్య కాలంలో 26,200 కోట్ల డాలర్ల విదేశీ పోర్ట్ ఫోలియో పెట్టుబడులు వచ్చాయి. ఫలితంగా ద్రవ్య సంచయనంలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ప్రభుత్వ నియంత్రణలో పనిచేస్తున్న ప్రభుత్వ రంగ బ్యాంకుల మధ్యవర్తిత్వంలో రుణపరపతి పెరిగింది. ఇది పెట్టుబడులకు, వినిమయానికి మధ్యనున్న బేధాన్ని పూడ్చింది. ఫలితంగా డిమాండ్ పెరిగి వృద్ధి నమోదయింది.

అయితే ఈ తరహా అభివృద్ధి దుర్బలంగా ఉంటుంది. ఎందుకంటే, అభివృద్ధికి అనుగుణంగా రుణ పంపిణీలు కూడా పెరుగుతాయి కానీ రుణ చెల్లింపులు జరగవు. పారుబకాయిలు పేరుకుపోతాయి. ముఖ్యంగా అప్పులు తీసుకున్న వారు తిరిగి చెల్లించగల శక్తిపై ఎటువంటి వత్తిడి పడినా, దుర్బలంగా ఉన్న వ్యవస్థ కుప్పకూలిపోతుంది. అందువలనే రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా నవంబర్ నెల మధ్య వెలువరించిన ప్రకటనలో, బ్యాంకులు తాము మారు వ్యాపారాలకు, క్రెడిట్ కార్డులకు, ఇతర బ్యాంకేతర ఆర్థిక కార్యకలాపాలు నడిపే సంస్థలకు, అరక్షిత అప్పులకు ఇచ్చిన రుణాలపై, ‘భద్రతా భారాన్ని’ మరో 25 శాతం పెంచాలని ఆదేశించింది. ‘భద్రతా భారాన్ని’ పెంచడం అంటే బ్యాంకులు అప్పులు ఇవ్వగల మొత్తాల్లో అధికశాతం పక్కన పెట్టాల్సి ఉంటుంది. అంటే వసూళ్లు కాని రుణాల కోసం నిధులు నిరుపయోగంగా ఉంచవలసి ఉంటుంది. అంటే అప్పులివ్వగల మొత్తాలు తగ్గుతాయి. అందువలన రుణాల ఖరీదు పెరుగుతుంది. వడ్డీరేట్లు పెరుగుతాయి. వడ్డీరేట్లు పెరిగినందువలన తీసుకున్న రుణాలు చెల్లించలేని పెరిస్థితి తలెత్తే అవకాశాలు

> **"ఈ మధ్యకాలంలో వడ్డీ రేట్లు పెరుగుతుండడంతో, బకాయిలు కూడా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.అందువలన రిజర్వు బ్యాంకు మళ్ళీ రేట్లను తగ్గించవచ్చు. అదే జరిగితే మారువర్త కాలు, గృహాలు, ఇతర శాశ్వత వినిమయ సరుకులకు, సేవలకు పెట్టే ఖర్చులు తగ్గుతాయి. దీని ఫలితంగా వృద్ధిరేటు తగ్గుతుంది. అంటే స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం పడుతుంది."**

పెరుగుతాయి. ఈ మధ్య కాలంలో, ప్రత్యక్షంగా వ్యక్తులకు భద్రతలేని రుణాలు మంజూరు చేయడం, లేదా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ ద్వారా రుణాలు ఇవ్వడం, వ్యాపార పరపతి కన్నా వేగవంతంగా వృద్ధిచెందడం వలన రేజర్వు బ్యాంకు ఈ చర్య తీసుకోవలసి వచ్చింది. 2014 మార్చి -2023 మార్చి మధ్య కాలంలో బ్యాంకులు వ్యక్తులకి ఇచ్చే రుణ బకాయిలు, మొత్తం రుణాలలో 14.3% నుండి 28.3% కి పెరిగాయి. అదేకాలంలో వాణిజ్యానికి అందించే 'ద్రవ్యం' 8.6% నుండి 14.1% కి పెరిగింది. ఈ మధ్యకాలంలో వడ్డీ రేట్లు పెరుగుతుండడంతో, బకాయిలు కూడా పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.అందువలన రిజర్వు బ్యాంకు మళ్ళీ రేట్లను తగ్గించవచ్చు. అదే జరిగితే మారువర్త కాలు, గృహాలు, ఇతర శాశ్వత వినిమయ సరుకులకు, సేవలకు పెట్టే ఖర్చులు తగ్గుతాయి. దీని ఫలితంగా వృద్ధిరేటు తగ్గుతుంది. అంటే స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం పడుతుంది.

భారతదేశ విధాన నిర్ణేతలు ఇటువంటి పరిస్థితులను ఎదుర్కోవడం ఇదేం మొదటిసారి కాదు. 2004లో బ్యాంకింగ్ వ్యవస్థలో ద్రవ్య లభ్యత పెరగగానే రుణాల మంజూరు వేగవంతంగా పెరిగిన కారణంగానే 2014 తరువాత బ్యాంకుల ఖాతాలలో

పారుబకాయిలు బాగా వృద్ధి చెందాయి. ఆ రోజుల్లో మారు వ్యాపారాలకు అప్పులివ్వడం పెరిగినప్పటికీ, మౌలిక వసతులకు అప్పులివ్వడం మరింత విపరీతంగా పెరిగింది. (ఇంధనం, టెలికమ్యూనికేషన్స్ , పౌర విమాన శాఖ ,రోడ్లు, ..వగైరా)

2000 సంవత్సరంలో మౌలిక వసతులకు మొత్తం రుణపరపతిలో 7.3 % అప్పులివ్వగా 2016 నాటికి అది 35.3 % నికి చేరింది. అప్పులిచ్చినవాటిలో అధికశాతం చెల్లింపులు కాలేదు. రిజర్వు బ్యాంకు తిరిగిరాని అప్పులను పారుబకాయిలుగా వర్గీకరించడాన్ని కఠిన తరం చేయడంతో పెద్ద మొత్తాలు పారుబకాయిలుగా మారాయి. అందులో చాలావరకు రద్దు చేయాల్సి వచ్చింది. ఫలితంగా బ్యాంకులకు నష్టాలు వచ్చాయి. అందువలన కోవిడ్ 19 రాకముందే, బ్యాంకులు అప్పులిచ్చే వేగాన్ని తగ్గించాయి. అందువలన వృద్ధి కూడా మందగించింది.

మౌలిక సదుపాయాల కల్పనకు అప్పులిచ్చి చేతులు కాల్చుకున్న బ్యాంకులు, ఆ తరువాతి కాలంలో మారువర్తకానికి ప్రాధాన్యత నివ్వడం మొదలుపెట్టాయి. ఈ రంగంలో బకాయిలు పెట్టడం తక్కువుంటుందని చెప్పుకుంది. అయితే ఆ అభిప్రాయం

ప్రస్నార్ధకమే. అందువలనే ఇప్పుడు ఉన్న వృద్ధిరేటు కూడా దుర్బలంగా ఉన్నదని అనుకోవలసి వస్తున్నది.

అయితే, ఇదివరకు మౌలిక సదుపాయాల కల్పనకి ఇచ్చిన రుణాలకూ, ఇప్పుడు మారువర్త కాలకి ఇచ్చే రుణాలకూ ఒక బేధం ఉన్నది. రెండిటి కారణంగా వృద్ధి రేటు పెరిగినా, మౌలిక వసతుల కల్పనకు ఇచ్చిన రుణాలలో ఎక్కువభాగం ప్రభుత్వాలద్వారా ఇచ్చిన అప్పులు. కానీ, బ్యాంకులు మారువర్తకానికి రుణాలు మంజూరు చేయడంలో, పరిమితమైన పరిధిలోనే ఎంపికలు చేసుకోవాల్సి ఉంటుంది . బ్యాంకులు కూడా భారతదేశంలో ప్రభుత్వ ఆధీనంలోనే ఉండడం వలన మౌలిక వసతుల్లో పెట్టుబడులు పెట్టడానికి బ్యాంకులను ప్రోత్సహించడం, ప్రభుత్వానికి సులువయింది. బ్యాంకులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అవసరం ఉన్నప్పటికీ

అప్పులను మంజూరు చేసే క్రమంలో ద్రవ్యత్వానికి, పొదుపుల గడువులకు సమతూకం కుదరనప్పటికీ మౌలిక సదుపాయాల కల్పనలకు అప్పులివ్వడం జరిగింది. డిపాజిట్లు తిరిగి చెల్లించవలసిన సమయానికి ద్రవ్యం అందుబాటులో లేకుండా పోయే పరిస్థితి ఏర్పడే అవకాశాలు ఉన్నప్పటికీ, ఇచ్చిన అప్పులు పారుబకాయిలు అయ్యే రిస్క్ ఉన్నప్పటికీ బ్యాంకులు ఈ అప్పులు ఇచ్చాయి. ప్రభుత్వమే బ్యాంకుల యజమాని అవడం వలన బ్యాంకులను ఆ విధంగా ఒత్తిడికి గురిచేయడం జరిగింది. ప్రభుత్వ బ్యాంకుల వైఖరినే కొన్ని ప్రైవేటు బ్యాంకులు కూడా అనుసరించాయి.

ఈ పరిస్థితి కొన్నేళ్లుగా కొనసాగుతున్నా "అధిక ద్రవ్యత్వం" ఇతర అంశాలతో పాటుగా ఈ విధాన నిర్ణయం తీసుకోడానికి అవకాశం కల్పించింది. ఈ విధాననిర్ణయం తీసుకోడానికి దోహద పడిన మొట్టమొదటి అంశం , పెరుగుతున్న విదేశీ పెట్టుబడుల ప్రవాహం. ఇది బ్యాంకుల రుణ పరిమితిని విస్తృతపరుచుకునే అవకాశాన్ని కల్పించింది. 2004లో షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల ఆహారేతర రుణాల బకాయిలు స్థూల జాతీయోత్పత్తిలో 26% ఉండగా 2019 కి 52% కి పెరిగింది.

ఇది కోవిడ్ వ్యాపించడానికి ముందు మాట. అప్పటికింకా రుణాల ఉద్దీపనం జరగలేదు. రెండోది, పన్నుల వసూళ్ల సంక్షోభం (ఫిస్కల్ క్రైసిస్) కారణంగా సుదీర్ఘకాలంగా సంపన్నులపైనా, అత్యంత అధికాదాయాలు గలవారిపైనా అధికంగా పన్నులు వేయడానికి సమ్మతించలేకపోవడం జరిగింది దానికి తోడుగా లోటు బడ్జెట్లకు స్వయంగా పరిమితులు విధించుకోవడం. వీటివలన ప్రభుత్వం, తన బడ్జెట్లోనుండి మౌలిక సదుపాయాల కల్పనకు తగిన నిధులను వెచ్చించలేకపోయింది. అందువలన ప్రైవేటు వ్యక్తులకు ఆస్కారం కల్పించవలసిన పరిస్థితి ఏర్పడింది. సహజంగానే ప్రైవేటు వ్యక్తులు నష్టాలకు గురయ్యే అవకాశాలు గల రంగాలలో తమ పెట్టుబడులను పెట్టడానికి ఇష్టపడరు. అందువలన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద మొత్తాల్లో అవసరమైన రుణాలను ప్రైవేటు వ్యక్తులకు, సంస్థలకు మంజూరు చేయడానికి బ్యాంకులను ప్రోత్సహించడం జరిగింది.

ప్రభుత్వ రంగ బ్యాంకులు మౌలిక సదుపాయాల కల్పనకు రుణాలివ్వవలసి ఉందన్న సంకేతం వలన చాలా పెద్ద మార్పులు జరిగాయి. (బ్యాంకులు నష్టపోకుండా ఈ రుణాలకు భీమా కల్పించబడుతుందని చెప్పడం జరిగింది). మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థలో 2000 సంవత్సరంలో 7% గా ఉన్న మౌలిక వసతుల రుణపరపతి 2020 లో 36% నికి పెరిగింది. దీని వలన అనేక

> "వీటికి తోడు, సెబీ తాను రూపొందించిన నియమాలను ఉల్లంఘించి, అలా ఉల్లంఘిస్తున్నదని ఎత్తిచూపిన వారిని విస్మరించి కూడా అదానీ గ్రూపు వంటి వాటికి సంబంచిన విదేశీ సంస్థల నుండి పెట్టుబడులు తరలించుకోడానికి వెసులుబాటు కల్పించడంతో, వాటాల ధరలు బాగా పెరగడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. సాధారణ వాటాల నిర్మాణ నియమాలను అతిక్రమించడం జరిగింది."

రంగాల్లో మదుపరులు లాభపడ్డారు. లాంకో ఇన్‌ఫ్రాటెక్, కింగ్ ఫిషర్, జెట్ ఎయిర్వేస్, అనిల్ ధీరుభాయి అంబానీ గ్రూప్, ఇతర అనేక టెలికం సంస్థలు ఈ విధానం లేకపోతే మనుగడలో ఉండేవారు కాదు. వీటిలో కొన్నింటిలో యాజ మాన్యపు వైఫల్యాలవలన నష్టాలు సంభవించా యన్నది కొంతవరకు నిజమే అయినా, పూర్తిగా వాస్తవమని అనలేము. రిలయన్స్‌లో గానీ అదానీ గ్రూపులలో గానీ యజమాన్యపు వైఫల్యాలు లేనందువలనే అవి విజయాలు వచ్చాయని అనలేము. వాటి విజయాలకు, లాభార్జనకు, మద్దతుగా నిలిచిన అనేక విధానపరమైన అంశాలు, వాటిని ఆ విజయపథంలో నడపడానికి బాసటగా నిలిచాయి.

పైగా, అవసరాలకు సరిపడినంతగా చవకగా ద్రవ్యత అందుబాటులో ఉన్నందువలన, ఏ రకమైన నియంత్రణలు సరైనరీతిలో అమలవకపోవడం, వారికి కలిసి వచ్చిన అంశాలు. వాటాల అమ్మకాల మార్కెట్లలో, సట్టా వ్యాపారానికి రుణాలు అందుబాటులో ఉండడం వలన అనేక ఆకంపెనీల వాటాల ధరలు విపరీతంగా పెరిగాయి. అది వాటాలు అమ్మకాల ద్వారా అదృశ్య సంచయిత నిల్వపెంచుకోడానికి, షేర్ల ధరలనుపెంచి అధికధరలకు అమ్ము కోడానికి, తద్వారా నిల్వలను, ఆ వాటాల విలువలను పెంచుకుని వాటిపై బ్యాంకుల నుండి అధికమొత్తాలలో రుణాలు పొందడానికి అవకాశాలను కల్పించాయి, దానివలన అధికమొత్తాల్లో పెట్టుబడులు అవసరమైన రంగాలు వేగవంతంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడింది. కేవలం సొంత ద్రవ్య పెట్టుబడులమీదే ఆధారపడి వేగవంతంగా అభివృద్ధి సాధించడం సాధ్యపడదు. ప్రయోజనకరంగా ఉండదు కూడా. ఆర్థికావసరాలకు బ్యాంకులందించే ఆర్థిక సహాయం అందుబాటులోకి రావడం ఎంతగానో ఉపయోగపడింది. రుణ భారం, ఖరీదు ఎక్కువైనప్పటికీ ప్రభుత్వం పెట్టుబడులు లాభదాయకంగా ఉండడానికి అనువైన విధానాలను అనుసరించింది.

వీటికి తోడు, సెబీ తాను రూపొందించిన నియమాలను ఉల్లంఘించి, అలా ఉల్లంఘిస్తున్నదని ఎత్తిచూపినవారిని విస్మరించి కూడా అదానీ గ్రూపు వంటి వాటికి సంబంచిన విదేశీ సంస్థల నుండి పెట్టుబడులు తరలించుకోడానికి వెసులుబాటు కల్పించడంతో, వాటాల ధరలు బాగా పెరగడానికి అవకాశాలు ఏర్పడ్డాయి. సాధారణ వాటాల నిర్మాణ నియమాలను అతిక్రమించడం జరిగింది. హిడిన్బర్గ్ పరిశోధన సంస్థ, సంఘటిత నేరాలను, అవినీతిని నివేదించే ప్రాజెక్ట్‌లు తప్పుడువని, దురుద్దేశపూరితమైనవని కొట్టివేయడం జరిగింది.

ఈ ఆరోపణలు నిజామా కాదా అన్న విషయాన్ని పక్కన పెడితే, భారతదేశంలో ప్రభుత్వాలకి, పెట్టుబడికి మధ్య ఉన్న సంబంధంలో మార్పు వచ్చిందని ఈ పరిణామాలు సూచిస్తున్నాయి. స్వతంత్రం వచ్చిన కొత్తల్లో భారత ప్రభుత్వం బడావ్యాపార స్తులను నియంత్రించడం, లేదా వాళ్ళని క్రమశిక్షణలో పెట్టడం వంటి విషయాలలో కల్పించుకోడానికి ప్రయత్నం చేసింది. కానీ, అందుకు అనుసరించవలసిన విధానాలలో వైఫల్యం పొందింది. ఫలితంగా పెట్టుబడి ఒకే చోట మేటలు వేయడం మొదలయింది. ఒక విధంగా పెరిగింది కూడా.

పై స్థాయిలోనున్న 10, 20 లేదా 100 గ్రూపుల వాటా చాలా ఎక్కువగా ఉండడమే కాదు పెరిగింది కూడా. ప్రభుత్వ అధికారులకు, వ్యాపార సంస్థలకు మధ్య అనైతిక సంబంధాలు ఉన్నట్టు అప్పుడప్పుడు బయట పడుతూనే ఉంది. కానీ, కొన్ని సంస్థలనో, వ్యాపార వర్గాలనే ప్రోత్సహించేందుకు విధానరూపకల్పన చేసినట్టు ఆధారాలు ఏవీ లేవు.

### కొత్త మలుపులు తీసుకున్న నయా-ఉదారవాద విధానాలు

ప్రభుత్వాల నియమనిబంధనలు, చట్టబద్ధత కోల్పోయిన 1980లలో కూడా, అవినీతి పెరిగింది. పైగా అదానీ గ్రూపు వంటి వ్యాపార సంస్థలు, తాము విస్తృత పడడానికి ప్రభుత్వ విదానాల రూపకల్పనను ప్రభావితం చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కొన్ని వ్యాపార సంస్థలను మాత్రం ఎంపిక చేసుకుని వాటి ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి, చైతన్య వంతంగా విధాన రూపకల్పనలు చేస్తున్నట్టు ఈ మార్పులను చూడలేము. యునైటెడ్ ప్రోగ్రసివ్ అల్లయెన్స్ (యుపిఏ) ప్రభుత్వ హయాంలో, ప్రధానంగా 2009 - 2014 మధ్య కాలంలో నయా-ఉదారవాద విధానాలు, కొన్ని బడా వ్యాపారసంస్థలను మాత్రమే ప్రోత్సహించే రూపాన్ని సంతరించుకున్నాయి. సంపద ఒకమూలకు పోగుపడుతుందనీ, ఆదాయాలు కొన్ని సంస్థల దగ్గరకు చేరతాయనీ అంచనా ఉన్నప్పటికీ ఈ విధానాలు అమలయ్యాయి .

సంపదలు, ఆదాయాలు, కార్పొరేట్‌లపై పన్నులు తక్కువ స్థాయిలో ఉంచే పాలనావ్యవస్థ, స్వయం నియంత్రణల లోటు బడ్జెట్లు, సమర్థవంతంగా అభివృద్ధిని వేగవంతం చేయడం లో, అవసరాలకు తగిన విధంగా సంక్షేమం అందించడంలో, ప్రభుత్వాలు బలహీనపడేటట్టు చేసాయి. ప్రభుత్వాలు తమకు తాము, కనీస సంక్షేమ పథకాలకు పరిమితమై, ప్రభుత్వాల మద్దతుతో ప్రవేటు సంస్థలు, అభివృద్ధి చేయాలని కోరుకున్నాయి. అవినీతి ఉన్నప్పటికీ , ప్రభుత్వాల తీరుతెన్నులు, ప్రధానంగా యుపిఏ-2 హయాంలో, కేవలం నయా-ఉదారవాద విధానాలను అనుసరిస్తున్నట్టు కనిపిస్తుంది, కానీ ప్రభుత్వానికి, ప్రైవేటు పెట్టుబడికి అనైతిక సంబంధం ఉన్నట్టు కనిపించదు.

కానీ, బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన రెండు సార్లలో ప్రభుత్వానికీ ఎంపిక చేసుకున్న కొన్ని వ్యాపార సంస్థలకీ దగ్గరిసంబంధాలు ఉన్నట్టు, ఒకరినొకరు రాజకీయంగా, ఆర్థికంగా లాభపడేందుకు వినియోగించుకుంటున్నట్టు నిరూపించ బడింది. ఆ సంబంధం సంపద, ఆదాయాల అసమానతలు మరింతగా పెంచడానికి దోహద పడినట్టు కనిపిస్తున్నది. భారతదేశంలో ఈ మధ్యకాలంలో ఏ మాత్రమైనా నమోదయిన అభివృద్ధి వెలుగులను ఇది మసకబారుస్తున్నది

❋

# ప్రశ్నిద్దామా వద్దా అనేదే అసలు ప్రశ్న



రచయిత ప్రపంచంలో అత్యంత ప్రతిభావంతురాలైన చరిత్ర పరిశోధకులు. ప్రాచీన భారత చరిత్ర పరిశోధనలో ఆమె ప్రసంశనీయమైన కృషి చేశారు. 1961 ప్రచురితమైన ఆమె గ్రంథం 'అశోకుడు, మౌర్య సామ్రాజ్య పతనం' తరువాత ఆమె అనేక గ్రంధాలు రాశారు.

**మానవ పరిణామంలో ప్రశ్న పాత్ర గురించీ, యూరప్ చరిత్రలో, భారత చరిత్రలో ప్రశ్నించే సంప్రదాయపు పాత్ర గురించీ వివరిస్తూ ఇవాళ ప్రశ్నలు సంధించే ప్రజాహిత మేధావుల అవసరాన్ని చెపుతున్నారు రచయిత:**

**రొమిలా థాపర్**

ప్రజాహిత మేధావులు సాధారణంగా సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ మానవ హక్కుల సమస్యలనూ, సమాజం నడుస్తున్న తీరునూ పట్టించుకుంటారు. నిజానికి ఈ సమస్యల పరిధి విశాలమైనది. అటువంటి వాటిలో ప్రధానమైన కొన్నిటినే ఇక్కడ ప్రస్తావించదలిచాను. అది మతం అయినా, రాజ్యం అయినా, మరొకటేదైనా, అప్పటి చర్చను బట్టి మనం దేన్ని అధికారంగా గుర్తిస్తామనేదీ, ఎంపికను ఎలా అంచనా కడతామనేది మొద టిది. మనం జ్ఞానాన్ని ఎలా గ్రహిస్తాం, దాన్ని ఏ అవసరాలకు వినియోగిస్తామనేది రెండవది. ఉదాహరణకు, నూతనంగా సంపాదించుకున్న జ్ఞానం అమలులో ఉన్న ఛాందసాలను, లేదా సువ్యవస్థిత అధికారాలను వ్యతిరేకించాలని తప్పనిసరిగా ఆశిస్తాం. అయితే ఈ వ్యతిరేకతతో మనం ఎలా వ్యవహరిస్తాం? మనచుట్టూ ఉన్న ప్రపంచం గురించీ, దాని గతం గురించీ సహేతుకమైన, తార్కికమైన వాదనకే ప్రాధా న్యత అనే దాని మీద ఇది ఆధారపడి ఉంటుంది. హేతుబద్ధత గురించి నొక్కి చెపుతున్నప్పుడు నేనేమీ ఒక ఆలోచనా సరళిగా ఊహాశక్తి ప్రాధాన్యతను కొట్టివేయడం లేదు. కాకపోతే ఆ రెంటి మధ్య తేడాను విస్మరించడానికి వీలు లేదు.

ఇటువంటి ఆలోచనలు కొత్తవి కావు. వీటి మూలాలు ప్రాచీన కాలంలో ఉన్నాయి. ఇవే ప్రశ్నలు ఎన్నో శతాబ్దాల వెనుక తలెత్తాయి. సమాజ గతిని నిర్ణయిస్తున్న వారిని ప్రశ్నలు అడిగే మన వర్తమాన హక్కుకు పునాదులైన ఆలోచనలు చేసిన కొందరు గతకాపు వ్యక్తుల గురించి నేనిక్కడ ప్రస్తావించదలచాను. తొలిరోజుల్లో ఈ ప్రశ్నలు ఎక్కువగా హేతుబద్ధ వాదన నుంచీ, తార్కిక ఆలోచన నుంచీ తలెత్తాయి. ఆ ప్రశ్నల జవాబులు భూమి మీద ఒక మెరుగైన సమాజం వస్తుందనే ఊహాత్మక భవిష్యత్తుకు ముగింపు పలకలేదు. ఆ భవిషత్తు కోసం స్వర్గం వైపో, పునర్జన్మ వైపో వేచి చూడాలనీ చెప్పలేదు. అటువంటి ఆలోచనంతా తన సంప్రదాయమేనని యూరప్ అంటుంది. అటువంటి ఆలోచనలే భారతదేశంలోనూ ఉన్నాయనే మాట తరచుగా విస్మరణకు గురవుతుంది. కాని నేను ఆ విస్మరణను సవాలు చేస్తున్నాను. సమాజాలు ఏవైనా తప్పనిసరిగా ఛాందసం మీద, అధికా రం మీద కనీసం సంక్షుభిత సమయాలోనైనా, ప్రశ్నలు సంధించడానికి అనుమతించ వలసిందే. అలా అనుమతించకపోతే ఆ సమా జాలు అతి వేగంగా మరణశయ్య ఎక్కుతాయి. ఇప్పుడు యూరోపియన్ గతాన్ని చూద్దాం. ప్రజాహిత మేధావుల సంప్రదాయపు ప్రారంభ కులు తాత్విక ప్రశ్నలు సంధించారు. అయితే ఆ ఆలోచనా ధోరణి రాజకీయ రంగంలోకి కూడా చొచ్చుకు వచ్చింది. సామాజిక కార్యాచరణ ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. సోక్రటీస్ లాగా అటువంటి వ్యక్తులు కొన్ని సందర్భాలలో ప్రశ్నలు వేసినందుకు మూల్యం చెల్లించవలసి వచ్చింది. అయినప్పటికీ, అధికారాన్ని ప్రశ్నించే హక్కును నిలుపుకున్నారు. దైవం ఉనికిని ప్రశ్నించి నందుకూ, ఏథెన్స్‌లో న్యాయ వ్యవస్థ పద్ధతులను విమర్శించినందుకూ ఎథీనియన్ గ్రీక్ అధికార వర్గం ఆయనను తప్పు పట్టింది. అందుకు ఆయన విష పాన శిక్షను అనుభవించవలసి వచ్చింది.

క్రీ.పూ. ఐదో శతాబ్దంలో సోక్రటీస్ నెలకొల్పిన పద్ధతికి తాము వారసులమని చెప్పుకునే ఒక కీలకమైన యూరోపియన్ ఆలోచనా ధోరణి ఉంది. ఏదైనా ఒక ప్రకటన ఉందంటే దాన్ని అనేక రకాలుగా ప్రశ్నించాలి. దానిలోని అంత ర్గత అంశాల మధ్య అంతస్సంబంధాలను పరిశీలించడానికి దాన్ని విడదీసి చూడాలి. ఆ అంతర్గత సంబంధాలను ఒక కార్యకారణ ప్రాతిపదికతో ముడివేయాలి. ఆ ప్రాతిపదికను మళ్లీ పరీక్షకు గురిచేయాలి. ఒక ప్రతిపాదనను దాని వ్యతిరేక ప్రతిపాదనతో ఎదుర్కోవడమనేది వాదనలో గతితార్కి పద్ధతికి దారి తీస్తుంది. క్రీ.పూ.మొదటి శతాబ్దికి చెందిన రోమన్ వక్త సిసిరో రోమన్ పాలకుల అవినీతిని బహిర్గతం చేశాడు. దేన్నైనా సరే ప్రశ్నించడానికి హక్కు ఉండాలన్నాడు. తన న్యాయశాస్త్ర ప్రజ్ఞాపాటవా లను ఆ ప్రశ్నలను లేవనెత్తటానికి ఉపయో గించాడు.

### చర్చినీ ప్రశ్నించారు

క్రీ.శ. రెండో సహస్రాబ్దిలో కాథలిక్ చర్చి రాజుల మీద తిరుగులేని అధికారాన్ని చలాయించింది. ఆ తర్వాత ఆ అధికారాన్ని ప్రశ్నలు ఎదుర్కొన్నాయి. యూరప్‌లో పునరుజ్జీవనోద్యమానికి ఆలోచనలను రగిలించిన అనేక అంశాలలో అది ఒకటి. మనకు చిరపరిచితమైన తత్వవేత్తలు–లాక్, హ్యూమ్, వోల్టేర్, మాంటె స్క్యూ, డిడెరో, రూసో, తదితరులందరూ సాంప్ర దాయిక జ్ఞానాన్నీ, ఆచరణనూ ప్రశ్నించడం ప్రారంభించారు. వారిలో వారికీ, వారితో ఇతరులకూ భిన్నాభిప్రాయాలుండేవి. కాని మొత్తంగా చూసినప్పుడు వారి ప్రశ్నలు విమర్శనాత్మక హేతుబద్ధత పైన అధారపడినందువల్ల సామాజికామోదం పొందాయి. ఇవాళ మనం పౌర సమాజం అని పిలుస్తున్న విషయాలపై ప్రత్యేకంగా కాథలిక్ చర్చికున్న నైతికాధికారాన్ని వారందరూ ఉమ్మడిగా సవాలు చేశారు. విమర్శనాత్మక హేతుబద్ధతే వారిని ఏకం చేసింది. ఆ పౌర సమాజం అనేదాన్ని ఇవాళ ప్రధానంగా లౌకిక సంస్థలుగా చూస్తున్నాం. వాటిలో కొన్నిటిని రాజ్యం కూడా నిర్వహిస్తు

న్నది. అప్పుడు మతానికున్న ప్రత్యేకమైన హక్కులను, అసహనాన్ని అభివృద్ధి నిరోధకమైనవిగా భావించారు. ప్రగతి అనేది సమ్మిళితం చేస్తుందని, భిన్నాభిప్రాయాల పట్ల సహిష్ణుతను పాటిస్తుందని వాదించారు.

మతాన్ని దానికదిగా వ్యతిరేకించాలనే కోరికతో చర్చిని విమర్శించలేదు. కుటుంబం, విద్య, పాలన, న్యాయం వంటి సామాజిక సంస్థలపై మతానికి ఉండిన గట్టి పట్టుకు వ్యతిరేకత అది. ఈ సంస్థలకు దైవిక సమ్మతి ఉన్నదన దాన్ని వారు నిరాకరించారు. అందువల్ల పాలానాధికారానికి వనరు ప్రజల మధ్య సామాజిక ఒప్పందం మాత్రమేనని భావించారు. విశ్వాసాన్ని అనుసరించి దైవ వచనాన్ని ఉటంకించడం కాక, హేతుబద్ధ విశ్లేషణ వైపు మొగ్గు చూపారు. సమాజపు పనితీరుకు మూలా లేవో గుర్తించడానికీ, అవసరమైన చోట్ల మార్పు లు సూచించడానికీ మార్గం సుగమం చేశారు..

అయితే తత్వవేత్తల కన్నా భిన్నంగా, ప్రత్యేకంగా ప్రజాహిత మేధావి అనే గుర్తించ దగిన రూపం పంథొమ్మిదో శతాబ్దిలో,డ్రైఫస్‌తో ప్రారంభమైంది. డ్రైఫస్ అనే యూదు వ్యక్తి ఫ్రెంచి సైన్యంలో కెప్టెన్‌గా పనిచేస్తుండేవాడు. రాజకీయ వేత్తలతో కుమ్మక్కై సైనిక రహస్యాలు జర్మన్లకు చేరవేశాడనే తప్పుడు ఆరోపణలతో డ్రైఫస్‌ను శిక్షించారు.డ్రైఫస్‌ను అన్యాయంగా శిక్షించారని ఈ నిర్బంధాన్ని వ్యతిరేకించినవారు వాదిం చారు. ఈ వాదనను అక్షరబద్ధం చేసిన నవాలా కారుడు ఎమిలీ జోలా తన వాదనకు అనుకూ లంగా పెద్ద సంఖ్యలో రచయితలను, కళాకారు లను, విద్యావేత్తలను సమీకరించాడు. వారంద రినీ కలిపి ఉమ్మడిగా మేధావులు అని పిలవడం ప్రారంభించారు. చిట్టచివరికి భావోద్వేగాలు లేకుండా, యూదు వ్యతిరేకత లేకుండా జరిగిన విచారణ డ్రైఫస్ నిర్దోషి అని ప్రకటించింది. అతన్ని తిరిగి ఉద్యోగంలో చేర్చుకున్నారు. అలా మొదలైన మేధావి అనే మాటకు అర్థం ఆ వ్యక్తికి పాండిత్యమేమీ అవసరం లేదని భావిం చింది. మేధావి అంటే ఏదో ఒక గుర్తించ దగిన వృత్తిలో నైపుణ్యం ఉన్నవారూ, అధికారంలో ఉన్నవారి విధానాలను ప్రశ్నించేవారు అనే అర్థం స్థిరపడింది.

సమాజాన్ని విమర్శనాత్మక విశ్లేషణకు గురిచేసే మేథో సంప్రదాయం ఉన్నచోటనే ఇటువంటి ప్రశ్నలు సులభంగా మొలకెత్తుతాయి. ఆధారాలను పరీక్షించడం, విశ్లేషించడం ద్వారానే వాదనలను ఆమోదిత హేతుబద్ధ పద్ధతుల మీద నిలబెట్టగలం. కాకపోతే చారిత్రక సందర్భాలలో మార్పులు ఆ ప్రశ్నలు వేసే పద్ధతిలో మార్పులు కలిగించవచ్చు. (ఇప్పుడు విజ్ఞానశాస్త్రాలలో మాత్రమే కాక, సామాజిక శాస్త్రాలలోనూ ఇదే మౌలిక పద్ధతిగా ఉంది.

> ❝ అయితే హేతుబద్ధ వాదన అనే భావన గత రెండు శతాబ్దాలలో విమర్శలను ఎదుర్కొంది. హేతుబద్ధతకు అంత ఘనమైన స్థానం ఇస్తే సంపూర్ణ వివరణలకు అవకాశం దొరకదనీ, హేతుబద్ధమైనవైనా, కాకపోయినా అన్ని వివరణ సాధ్యమైనవేననీ వాదన వచ్చింది. అలాగే హేతు బద్ధ ఆలోచన మీద ఆధారపడిన విమర్శలు కూడా వాటి ఆధారాలను బట్టీ, వాటి కార్యకారణ సంబంధాల లోని తర్కాన్ని బట్టీ విభిన్నంగా ఉంటాయి. అయినప్పటికి విమర్శనాత్మక హేతు బద్ధత దానికదిగా కొన సాగుతుంది, ❞

ఆ పద్ధతి వల్లనే సామాజిక రాజకీయ వ్యవస్థ గురించీ, కార్యకలాపాల గురించీ అర్థవంతమైన వివరణలు దొరుకుతున్నాయి. అయితే దురదృష్ట వశాత్తూ, ఈ పద్ధతిని చారిత్రక పరిశోధనకు అన్వయించి సాంప్రదాయిక అభిప్రాయాలను ప్రశ్నించినప్పుడు మాత్రం అన్ని సమయాల్లోనూ ఆమోదం దొరకడం లేదు.)

అయితే హేతుబద్ధ వాదన అనే భావన గత రెండు శతాబ్దాలలో విమర్శలను ఎదుర్కొంది. హేతుబద్ధతకు అంత ఘనమైన స్థానం ఇస్తే సంపూర్ణ వివరణలకు అవకాశం దొరకదనీ, హేతుబద్ధమైనవైనా, కాకపోయినా అన్ని వివరణ సాధ్యమైనవేననీ వాదన వచ్చింది. అలాగే హేతు బద్ధ ఆలోచన మీద ఆధారపడిన విమర్శలు కూడా వాటి ఆధారాలను బట్టీ, వాటి కార్యకారణ సంబంధాలలోని తర్కాన్ని బట్టీ విభిన్నంగా ఉంటాయి. అయినప్పటికి విమర్శనాత్మక హేతు బద్ధత దానికదిగా కొన సాగుతుంది,

ఇప్పుడిక నేను భారతీయ సంప్రదాయంలో అప్పటికి కొనసాగుతున్న భావనలనూ, ఆచరణలనూ సవాలు చేసిన కొద్దిమంది వ్యక్తులను ప్రస్తావిస్తాను. వారు మార్పు కొరకు హేతుబద్ధ, తార్కిక వివరణలను ప్రచారం చేశారు. మన పూర్వీకులు హేతుబద్ధతను జ్ఞాన సముపార్జనా మార్గంగా అనుసరిం చలేదనే భావాల్ని మన మెదళ్లలో కూరిపెట్టారు. కాబట్టి సాధారణంగా మనం హేతుబద్ధ ఆలోచనా వారసత్వాన్ని విస్మరిస్తూ ఉంటాం.

**బుద్ధుడు**

క్రీ.పూ. ఐదో శతాబ్దిలోని సోక్రటిస్, బుద్ధుడు సుదూరావైన విభిన్న ఖండాలలో, ఎటువంటి సంబంధం లేకుండా జీవించినప్పటికీ ప్రశ్నలకు ప్రోత్సహించిన, కార్యకారణ సంబంధా లనూ, హేతుబద్ధ వివరణలనూ అన్వేషించిన సమకా లిక తత్వవేత్త లు. అదృష్టవశాత్తూ ఈ భారతీయ తత్వవేత్త గ్రీకు తత్వవేత్త లాగ విషం తాగాలనే శిక్ష అనుభవించలేదు. కాని ఆయన బోధనలను తొలి బ్రాహ్మణ ఛాందసం అత్యంత తీవ్రంగా వ్యతిరేకించింది. ఆ బోధనలు మాయావాద మనీ, తప్పుదారి పట్టించేవనీ నిందించింది. బౌద్ధం భారతదేశం నుంచి క్రమక్రమంగా కనుమరుగైపోవడానికి చాల కారణాల్లో ఆ నిందలు కూడ ఒక కారణం. బౌద్ధం పొరుగు దేశాలలోకి వెళ్లి, అక్కడ వికసించింది. కొన్ని చోట్ల క్రమంగా అది కూడా ఛాందసంగా మారిపోయింది.

ఈ తొలి గ్రంథాలలో మతం అనే మాట ఎప్పుడు వచ్చినా అది హిందూమతం ప్రస్తావన కాదు. ఎందుకంటే హిందూ అనే మాటే ఆ తర్వాతెప్పుడో పుట్టింది. భారతీయ మతం అనే దానిలో ఎన్నెన్నో శాఖలు ఉండగా వాటన్నిటినీ వాటి పేర్లతోనే గుర్తించేవారు. సాధారణార్థంలో చెప్పినప్పుడు కూడ అవన్నీ రెండు ప్రవాహాలుగా ఉండేవి. ఒకటి బ్రాహ్మణ- అంటే బ్రాహ్మణ విశ్వాసాలతో ఉండేది, మరొకటి శ్రమణ- అంటే బౌద్ధ, జైన బోధనలతో కూడినది. (బౌద్ధ సన్యాసులను శ్రమణకులు అనేవారు.) క్రీ.పూ. మూడో శతాబ్దిలో అశోకుడి శాసనాల నాటి నుంచి, క్రీ.శ. 11 శతాబ్దిలో భారతదేశం గురించి రాసిన అల్ బిరూనీ దాకా వెయ్యి సంవ త్సరాలకు పైగా ఈ రూపంలోనే మతాల గురించి ప్రస్తావించారు. ఈ రెండు మతాల మధ్య సంబంధం పాముకూ ముంగిసకూ మధ్య సంబంధం లాంటిదని క్రీ.శ. మొదటి సహస్రాబ్ది ప్రారంభంలో సంస్కృత వ్యాకరణ కర్త పతంజలి ఒక అదనపు దృక్పథాన్ని జోడించాడు. అంటే వీరి మధ్య చర్చలు విద్వేషపూరితంగా ఉండేవి. ప్రశ్నలు లేకుండా చెప్పిందంతా వినేవాళ్ళు కొందరూ, ప్రశ్నలు వేసేవాళ్ళు కొందరూ ఉండే అన్ని సమాజాలలోనూ ఇటువంటి తీవ్రమైన చర్చలు జరుగుతాయి.

**చార్వాకులు**

ఆ తర్వాత చార్వాకులు వచ్చారు. వారినే లోకాయతులని కూడ అంటారు. వాళ్ళు అప్పటికి ఉన్న అన్ని తాత్విక ధోరణులనూ వ్యతిరేకించారు. వారు జీవితం గురించి భౌతికవాద వివరణకు కట్టుబడి ఉన్నారు. మరొక రకమైన ఆలోచనా ధోరణికి ఎంతమాత్రం అవకాశం

> **"క్రైస్తవ శకం ప్రారంభమయ్యే సమయానికి బౌద్ధం జనాదరణతో పాటు రాజుల, వర్తకుల, భూస్వాముల ప్రాపకాన్ని కూడా సంపాదిం చింది. అప్పుడు ప్రధాన బ్రాహ్మణ గ్రంథాలు వారిని నాస్తికులుగా, సంప్రదాయ వ్యతిరేకు లుగా, అవిశ్వాసులుగా అభివర్ణిస్తూ తీవ్రంగా వ్యతిరేకించాయి. బ్రాహ్మణ దృక్కోణం నుంచి చూసినప్పుడు శ్రమణకులు, చార్వాకులు, అజీవకులు, నిరీశ్వర వాదులు, భౌతిక వాదులు, హేతువాదులు అందరూ నాస్తికులు అనే ఒకే తరగతికి చెందు తారు."**

ఇవ్వలేదు. వారి గ్రంథాలేవీ ఇవాళ లభ్యం కావడం లేదు. కాని మనకు తెలిసిన గ్రంథా లలో సందులలో, మూలల్లో అనూహ్యమైన చోట్ల వారి గురించి ప్రస్తావనలు తలెత్తుతుంటాయి. వీరిలో కొన్ని శాఖలవారి వాదనలు ('పాపమీను కదులి కల'(ఈ మాటల అర్థం తెలియలేదు.)లాగ ఉంటాయని బుద్ధుడు వర్ణించాడు.

క్రైస్తవ శకం ప్రారంభమయ్యే సమయానికి బౌద్ధం జనాదరణతో పాటు రాజుల, వర్తకుల, భూస్వాముల ప్రాపకాన్ని కూడా సంపాదిం చింది. అప్పుడు ప్రధాన బ్రాహ్మణ గ్రంథాలు వారిని నాస్తికులుగా, సంప్రదాయ వ్యతిరేకు లుగా, అవిశ్వాసులుగా అభివర్ణిస్తూ తీవ్రంగా వ్యతిరేకిం చాయి. బ్రాహ్మణ దృక్కోణం నుంచి చూసినప్పుడు శ్రమణకులు, చార్వాకులు, అజీవకులు, నిరీశ్వర వాదులు, భౌతికవాదులు, హేతువాదులు అందరూ నాస్తికులు అనే ఒకే తరగతికి చెందు తారు. ఎందుకంటే వారందరూ కూడ భగవం తుడి అస్థిత్వాన్ని ప్రశ్నించారు. వేదాలు అపౌరుషేయాలనీ, భగవంతుడే ప్రక టించాడని అనడాన్నీ ప్రశ్నించారు. కులా చారాల నియమాలను, ఆత్మ ఉనికిని ప్రశ్నిం చారు. కర్మ విషయం లో వారి అభిప్రాయాలు భిన్నంగా ఉన్నప్పటికీ వారిలో కొందరు కర్మ సిద్ధాంతాన్ని పూర్తిగా తిరస్కరించారు. (ఇది చెపుతున్నప్పుడు మన కాలంలో హిందుత్వ వాదులు కూడ తమను సమర్థించని వారందరూ ఒకటే అన్నట్టుగా, అందరినీ ఒకేగాటన కట్టి మార్క్సిస్టులుగా అభి వర్ణించడం గుర్తొచ్చింది! అలాగే భారతదేశంలో ముస్లింమత ఛాందన వాదులు కూడ తమ ఛాంద సాన్ని వ్యతిరేకించే ఉదారవాద ముస్లిం లందరినీ ఒకే గాటన కట్టి మార్క్సిస్టులు అని పిలుస్తార నేదీ ఆసక్తికరమైన విషయమే.)

సంప్రదాయ వ్యతిరేకుల పట్ల మనుధర్మ శాస్త్రం మానసిక రుగ్మత లాంటి అనుమానాన్ని ప్రదర్శించింది. వారిని నాస్తికులనీ, తప్పుడు సిద్ధాంతాల బోధకులనీ పిలిచింది. వారు రోగ గ్రస్తులైన మనుష్యులనీ, తమస్సుకు మూలాలనీ పిలిచింది. నిజంగానే కొన్ని రకాలుగా చూసి నప్పుడు ఛాందసానికి అది కష్టకాలమే. కొన్ని ప్రధాన తాత్విక శాఖలు నాస్తికవాద ఛాయలతో నిండిపోయాయి. కాని అదే ఆ కాలాన్ని మేధో పరంగా ఉత్సాహభరితమైన కాలంగా మార్చిం ది. ఈ సంప్రదాయ వ్యతిరేకులకు జనాదరణ ఎంత ఎక్కువగా ఉంటే వారి మీద దాడి అంత ఎక్కువగా జరిగింది.

ఎప్పుడూ ప్రత్యక్షంగా కనబడకపోయినా చార్వాకులు మొత్తంగా మన ఆలోచనల రంగస్థలం మీద కొనసాగుతూనే వచ్చారు. క్రీ.శ తొమ్మిదో శతాబ్దిలో శంకరాచార్యుడు ఆత్మ కన్నా భౌతిక పదార్థమే ప్రాథమికమని చెప్పిన సిద్ధాం తాన్ని ప్రస్తావించాడు. పద్నాలుగో శతాబ్దిలో అప్పటికి ఉన్న ప్రధానమైన తాత్విక ధోరణుల న్నిటినీ సంకలితం చేసిన మధ్వాచార్యుల సర్వదర్శన సంగ్రహం ప్రారంభంలోనే చార్వాక ఆలోచనల ప్రాసంగికత గురించి సుదీర్ఘ చర్చ ఉంటుంది. అది చివరికి చార్వాక ఆలోచనను తిరస్కరించినప్పటికీ, దీర్ఘంగానే చర్చిస్తుంది. చార్వాకుల ఆలోచనలకు ప్రభావమేమీ లేనట్టయితే, వాటిని విస్మరించడం జరిగేది. కొంత మంది వలసవాద రచయితలు భారత నాగరికతలో అసలు హేతుబద్ధ ఆలోచన అనేది లేదని, అదే భారతీయుల వెనుకబాటుతనానికి కారణమని వాదించారు. ఈ వాదన జాతీయ వాద ఆలోచనకు ఆమోదయోగ్యం కానప్పటికీ, భారతీయ పండితులు తగిన పద్ధతిలో ఆ వాదన ను ఎదుర్కోలేదు. ఎటువంటి నిరంకుశ అధికా రానికైనా ప్రశ్నించేవారంటే గిట్టదు. అలాగే హిందూ మతం పునాదిగా ఏకైక జాతీయ అస్థిత్వా న్ని నిర్మించ తలపెట్టిన వారు బ్రాహ్మణ ఆలోచ నలతో విభేదించిన బోధనల ప్రాధాన్య తను అంగీకరించకలేక పోయారు.

ఛాందసవాదం సంప్రదాయ వ్యతిరేకు లను కొట్టి పారేసింది. కాని, వారి భావాలలో కొన్నిం టి గురించి, అటువంటి ఇతర భావాల గురించి క్రీ.శ తొలి శతాబ్దాల తాత్విక ధోరణు లలో అన్వేషణ జరపక తప్పలేదు. పండిత స్థాయిలో, విజ్ఞులైన బ్రాహ్మణులకూ, బౌద్ధులకు మధ్య జరిగిన చర్చలలో విభిన్నమైన, ప్రశంస నీయ మైన తాత్విక ధోరణులు రూపుదిద్దుకు న్నాయి. తర్కమూ, హేతువిచారణా పద్ధతులూ పదును దేరాయి. భావవాద తత్వశాస్త్రానికి సన్నిహితమైన ఇతర ఆలోచనా పద్ధతులు కూడా మెరుగుతీరాయి. ఈ సమయంలో ప్రధానమైన తార్కికులలో ఎక్కువమంది, ఉ దాహరణకు నాగార్జునుడు, వసుబంధుడు, దిగ్నాగుడు, ధర్మకీర్తి వంటి వారు బౌద్ధులే కావ డం ఆసక్తికరమైన అంశం. వీరిలో కొందరు బ్రాహ్మణులుగా పుట్టి, ఆ పద్ధతిలోనే విద్యా వంతులై, బౌద్ధులుగా మారారు. వారు భావా లతో క్రీడలాడారు. మరీ ముఖ్యంగా నాస్తిక వాదపు సూక్ష్మ అంశాల గురించి చాలా చర్చ జరిపారు. ఆ భావాలు ఒకే రకమైనవేమీ కావు. విస్తారంగా చర్చ జరిగింది.కొన్నిసార్లు ఈ వాద నలు దాదాపు గతితార్కిక రూపం తీసుకున్నాయి.

దురదృష్టవశాత్తూ ఇప్పుడు లభించడం కష్టం గాని, విమర్శనాత్మక హేతుబద్ధతను ఉ పయోగించిన ఈ తత్వవేత్తలకూ, హేతుబద్ధ ఆలోచనకు మరింత సన్నిహితులైన ఖగోళ, గణిత శాస్త్రవేత్తలకూ జరిగిన సంభాషణలు దొరికితే వాటికి చాలా ఎక్కువ మేధో ప్రాధాన్యత ఉంటుంది. గణితశాస్త్ర లెక్కల ఆధారంగా ఆర్యభట్టు భూమి సూర్యుని చుట్టూ తిరుగుతు న్నదని వాదించాడు. కోపర్నికస్, గెలీలియోల కన్న వెయ్యి సంవత్సరాల ముందు ఆయన ఆ సిద్ధాంతం చెప్పాడు. ఈ సిద్ధాంతానికి బైబిల్‌ను, అంటే సమాజం మీద చర్చి అదుపును తిరస్క రించే శక్తి ఉందని యూరప్‌లో కాథలిక్ ఛాంద సవాదం గుర్తించి భయపడింది. గెలీలియో తన మాటను వెనక్కి తీసుకోవలసి వచ్చింది. ఈ సూర్యకేంద్రక సిద్ధాంతాన్ని ఆమోదిస్తే భారత దేశంలో ఖగోళ శాస్త్రవేత్తల కొన్ని జ్యోతిష్య శాస్త్ర గణనాలు తప్పయి ఉండేవనేది మరొక కారణం కావచ్చు. అయితే రాజుల అధికారాన్ని తమ అదుపులో ఉంచుకోవడానికి మత ఛాంద సవాదం జ్యోతిష్య శాస్త్రాన్ని ఒక సాధనంగా ఉపయోగించింది. అందువల్ల చాలా ప్రాంతా లలో పాత జ్ఞానమే చెక్కుచెదరకుండా కొనసా గింది. గణిత శాస్త్రం లోనూ, ఖగోళ శాస్త్రం లోనూ భారతీయ సిద్ధాం తాలు వాటికవి సృజనాత్మకంగా విస్తరించాయి. కాని విచిత్రం గా అవి అప్పటి పురావిజ్ఞానశాస్త్ర కేంద్రమైన బాగ్దాద్‌కు వెళ్లిన తర్వాత మాత్రమే ఎక్కువ ప్రభావశీలంగా మారాయి.

ఈలోగా, భారతదేశంలో ఇతర మత శాఖలు ఇటువంటి ప్రశ్నలు రేకెత్తడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించాయి. మతాధిపతులూ, పాలకులూ ఎత్తిపట్టిన నమ్మకాలనూ ఆచారాలనూ పండితులు ప్రశ్నిం చారు. వారు బ్రాహ్మణేతర ఛాందసాలను కూడా ప్రశ్నించారు. అలా ప్రశ్నించినవారిలో

కొందరు ఆండాళ్, అక్కమహాదేవి, మీరాలలాగ స్త్రీలు. వారు కుల నియమయాలను ధిక్కరించారు. వారు చెప్పేవి ప్రజలు విస్తారంగా, శ్రద్ధగా విన్నారు. ఆ ప్రజలు తమ సామాజిక ధర్మాలను ఏర్పాటు చేసుకున్నారు. కాని మనం ప్రధానంగా మతం మీద దృష్టి పెడుతూ, ఆ సంవాదాలలోని ఈ అంశం మీద తగినంత శ్రద్ధ చూపడం లేదు.

కొన్ని శతాబ్దాల తర్వాత మహారాష్ట్రలో ఏకనాథ్ కూడా మతానికి ఉన్న అదుపును ప్రశ్నించాడు. భాగవత పురాణాన్ని, రామాయణాన్నీ ఆయన తిరగరాసిన తీరు ఆయనకు ఉండిన బ్రాహ్మణ పాండిత్యాన్ని చూపుతుంది. ఆ పాండిత్యం ఉన్నప్పటికీ కొనసాగుతున్న సామాజిక ధర్మపు ఔచిత్యాన్నీ, కులాచారాల ఔచిత్యాన్నీ ప్రశ్నించడంలో ఆయన ఎక్కడా వెనుకకు తగ్గలేదు.

“వలస - వ్యతిరేక భారత జాతీయోద్యమ ప్రధాన స్రవంతీ, లౌకికంగా ఉండాలని ఆకాంక్షించిన ఉదారవాద ప్రజాస్వామ్య ఆవిర్భావమూ ఆ ప్రజాహిత మేధావుల దృశ్యమానమైన ఉనికికి తగిన స్థలం ఇచ్చాయి.ప్రత్యేకంగా స్వాతంత్ర్యం వచ్చిన వెనువెంటనే కొద్ది సంవత్సరాల పాటు చాల మందే ఈ పాత్ర నిర్వహించడానికి ముందుకొచ్చారు.విస్తారమైన చర్చలు జరగడానికి వారే కారణం.”

**జాతీయ వాదపు ప్రశ్నలు**

ఇక ఆధునిక కాలంలోకి వస్తే, జాతీయ వాదపు భావజాలం సమాజాన్ని పునర్వ్యస్థీకరించడానికి ప్రయత్నాలు చేసింది. ఆ జాతీయ వాదం వలసవాదాన్ని వ్యతిరేకించి ఉండవచ్చు గాని వలసవాద విజ్ఞానం నుంచి సిద్ధాంతాలను గ్రహించడాన్ని అన్ని వేళలా వ్యతిరేకించలేదు. బ్రహ్మ సమాజం, ప్రార్థనా సమాజం, ఆర్య సమాజం వంటి అగ్రవర్ణ హిందూమతానికి సంబందించిన సంఘ సంస్కరణ ఉద్యమాలు కొత్తరకమైన హిందూ మత సంస్థలను, కులం పాత్రను సూచించాయి. రాజా రామమోహన్ రాయ్ గురించి, ఆయన నడిపిన సంఘ–మత సంస్కరణ గురించీ మనందరికీ తెలుసు. కాని సరిగ్గా ఆయనకు సమకాలికుడైన తంజావూరుకు చెందిన చిన్న మహారాజు రెండవ శరభోజి గురించి చాల తక్కువ తెలుసు. ఆయన విద్యావ్యవస్థ సారం మీద కేంద్రీకరించి ఛాందసాన్ని ప్రశ్నించాడు. యూరోపియన్ పునరుజ్జీవ యుగం రచయితలను అధ్యయనం చేసి జ్ఞానం హేతుబద్ధ వాదనా క్రమం మీదనే ఆధారపడి ఉంటుందనే విశ్వాసానికి చేరాడు. ఆ హేతుబద్ధ వాదనా క్రమాన్ని విద్య ద్వారా నేర్పాలని నమ్మాడు. ఆయన నెలకొల్పిన పాఠశాలలు సరిగ్గా ఈ లక్ష్యానికి ఉద్దేశించినవే. అలాగే ఆ లక్ష్యంతోనే ఆయన సరస్వతీ మహల్ గ్రంథాలయం స్థాపించి, దానికోసం పుస్తకాలనూ వస్తువులనూ సేకరించాడు.

ఈ కదలికలేవీ మేధో సంప్రదాయాలను విమర్శనాత్మకంగా ప్రశ్నించడానికి ఉద్దేశించినవి కానప్పటికీ, అవి అప్పుడప్పుడూ అయినా ఉపరితలాన్ని గోకాయి. మతం సాధికారత కల్పించిన కుల అంతరాల వ్యవస్థకు కీలక స్థానం ఉన్నప్పటికీ మతానికీ కులానికీ మధ్య అంతస్సంబంధాన్ని పరిశోధించడానికి ప్రయత్నం జరగలేదు. ఆర్యులు తమ జన్మస్థలం నుంచి భారత దేశం దాకా దండయాత్ర సాగించినప్పటికీ భారత నాగరికతకు, అగ్రవర్ణ సంస్కృతికి ఆర్య పునాదులు ఉన్నాయనే సిద్ధాంతాన్ని పంథొమ్మిదో శతాబ్దిలో బాలగంగాధర తిలక్ సమర్థించాడు. కాని అదే సమయంలో కింది కులాల మీద సాగుతున్న అణచివేతకు తార్కిక వివరణ ఆర్యుల రాకలోనే ఉందని జ్యోతిబా పూలే భావించాడు. శూద్రులైన స్థానిక నివాసులను బ్రాహ్మణులైన ఆర్యులు పీడనకు గురిచేశారని ఆయన అన్నాడు. ఇలా అప్పటికి ఉనికిలో ఉన్న సమాజాన్ని వివరించడానికి తిలక్ ఆమోదిత అభిప్రాయాన్ని విస్తరించగా, పూలే దాన్ని ప్రశ్నించాడు. ఈ రెండు వ్యాఖ్యానాలూ చారిత్రకంగా పొరపాటే, కానీ పూలే నిశితమైన ప్రశ్న అడిగాడు.

కులానికి ఉన్న సాధికారతను ప్రశ్నించిన వారూ, బ్రహ్మణ విశ్వాసాల పట్ల విమర్శనాత్మకంగా ఉన్నవారూ ఇతరులు కూడా ఉన్నారు. పెరియార్ లేదా ఇవిఆర్ విద్యావేత్త కాకపోయినప్పటికీ, ఆయన సమకాలికులైన విద్యావేత్తలతో సమానంగా చదువుకున్నాడు. హిందూ పురాణాలలోని వైరుధ్యాలను ఒక హేతువాదిగా ఆయన విమర్శనాత్మకంగా చూశాడు. అవన్నీ ఇండో – ఆర్యన్ ప్రజలు కల్పించిన కట్టుకథలని కొట్టిపారేశాడు. సామాజిక సమానత్వం కోసం, ప్రత్యేకించి మహిళల సమానత్వం కోసం చాలా బలంగా వాదించాడు.

నేను ఇప్పటి వరకూ ప్రస్తావించిన వ్యక్తులందరూ ఆధునిక అర్థంలో ప్రజాహిత మేధావులు కారు. మెరుగైన సమాజాన్ని సాధించడానికి ఒక సాధనంగా అప్పటికి ఉన్న వాస్తవికత మీద ప్రశ్నలు సంధించిన వారు. వారు తమ తమ భిన్నమైన వృత్తులలో గౌరవాన్ని పొందినందు వల్ల వారి బోధనలను ప్రజలు విన్నారు. వారు వేసిన ప్రశ్నలు ఒకే రకమైనవా కాదా అనేది సమస్య కాదు. ఆయా కాలాల సమస్యలకు తగి నట్టుగా వారి ప్రశ్నల స్వభావం మారినప్పటికీ వారు వాదించిన పద్ధతి ప్రధానమైనది. ఆ ప్రశ్నలు యధేచ్ఛగా వేసినవి కావు. వాటిని గుర్తించ దగిన విమర్శనాత్మక హేతుబద్ధత నిర్ణయించింది. అంతేకాదు, అలా ప్రశ్నలు వేసేవారు అప్పుడైనా, ఇప్పుడైనా గణనీయమైన చారిత్రక మార్పులను వ్యక్తీకరిస్తారు.

చారిత్రక మార్పుల సమయాలు సమాజాన్ని పునర్వ్యవస్థీకరించే కొత్త పద్ధతుల అన్వేషణతో కలిసివస్తాయి. భారతీయ గతంలోనూ ఆ పునర్వ్యవస్థీకరణ ప్రయత్నాలు అప్పుడప్పుడు జరిగాయి. సామాజిక, ఆర్థిక పరిస్థితులను అర్థం చేసుకోవడానికి , అవి సమాజానికి ఒక రూపాన్ని ఎలా ఇస్తాయో తెలుసుకోవడానికి మనకిప్పుడు లోతైన , నిశితమైన మార్గాలు అందుబాటులో ఉన్నాయి. ఈ సంబంధాలను అన్వేషించవలసి ఉంది. అటువంటి అన్వేషణలు జరపడానికి , మన మేధో వారసత్వంలోని హేతుబద్ధ ఆలోచనల సంప్రదాయాలను వ్యక్తీకరించడానికి గుర్తించ దగిన పాత్ర నిర్వహించే ప్రజాహిత మేధావుల సంప్రదాయాన్ని ధ్వంసం చేయడానికి ప్రస్తుతం పథకం ప్రకారం ప్రయత్నాలు జరుగుతున్నాయి.

వలస – వ్యతిరేక భారత జాతీయోద్యమ ప్రధాన స్రవంతీ, లౌకికంగా ఉండాలని ఆకాంక్షించిన ఉదారవాద ప్రజాస్వామ్య ఆవిర్భావమూ ఆ ప్రజాహిత మేధావుల దృశ్యమానమైన ఉనికికి తగిన స్థలం ఇచ్చాయి. ప్రత్యేకంగా స్వాతంత్ర్యం వచ్చిన వెనువెంటనే కొద్ది సంవత్సరాల పాటు చాల మందే ఈ పాత్ర నిర్వహించడానికి ముందుకొచ్చారు. విస్తారమైన చర్చలు జరగడానికి వారే కారణం. కాని ఆ తర్వాతి పరిణామాలు, అది ఎమర్జెన్సీ కావచ్చు , లేదా మతపరమైన మైనారిటీల ఊచకోతలు కావచ్చు. కనీసం అటువంటి ఘటనలు పునరావృతం కాకుండా గళమెత్తడానికి, అడ్డుకోవడానికి ప్రజాహిత మేధావులు అవసరమనే అవగాహనను పెంచాయి. నిఖిల్ చక్రవర్తి, రమేష్ థాపర్ వంటి వారెందరో అన్నిరకాల సెన్సార్ షిప్‌నూ, ప్రత్యామ్నాయ గళాలను నిశ్శబ్దంలో ముంచే ప్రయత్నాలనూ వ్యతిరేకించారని మనం గుర్తు చేసుకోవల్సి ఉంది.

(తరువాయి వచ్చే సంచికలో)

# భగవద్గీత-ఒక పరామర్శ

(2వ పేజీ తరువాయి)

స్వామి మాశుభ:

కృష్ణుడు ఇతర విశ్వాసాలు, ఆచారాలు, కర్మకాండలు అన్ని ఒదిలేసి కేవలం నన్ను మాత్రమే నమ్ముకో. భయపడకు. నేను అన్ని పాపముల నుండి విముక్తి చేస్తానంటాడు.

అర్జునుడు తన బంధువులను చంపటానికి ఎందుకు వెనకాడకూడదంటే యుద్ధం చేయటం క్షత్రియుడిగా నీధర్మం కాబట్టి అని కృష్ణుడు అంటాడు. ఎవరి వర్ణ ధర్మాలు వారు ఆచరించాలి అంటూనే సర్వ ధర్మములను విడిచి ఇతర విశ్వాసాలు, ఆచారాలు కర్మ కాండలు అన్నీ వదిలేసి నన్ను శరణువేడితే అన్ని పాపాల నుండి విముక్తం చేస్తానంటాడు. క్షత్రియుడికి యుద్ధభూమి నుండి పారిపోవటం కంటే మరణించటమే మేలు అని కృష్ణుడు అర్జునుడికి ఉపదేశిస్తాడు.

యుద్ధభూమిలో చిన్న అపాయం ఎదురైనా కృష్ణుడికి తట్టినన్ని అపాయకర ఉపాయాలు ఎవరికీ తట్టవు. భీష్ముడి ప్రతిజ్ఞను అవకాశంగా తీసుకొని అర్జునుడికి శిఖండిని డాలుగా అడ్డం పెట్టుకొని భీష్మణ్ని సంహరించటం, నిరాయుధుడిగా ఉన్న కర్ణుడిపై ఆయుధం ప్రయోగింపజేసి హతమార్చటం, జయద్రధుడిని చంపటానికి సూర్యాస్తమయ భ్రమను కల్పించటం, ద్రోణున్ని చంపటానికి ధర్మరాజుతో అశ్వత్థామ హత: కుంజరః అనిపించటం, ధుర్యోధనుని వధించటానికి అతడి తొడలపై కొట్టమని భీముడిని సైగ చేయటం ఇవన్నీ కృష్ణుడు ఇచ్చిన సలహాలు. ఇలాంటి ఘోరమైన పనులు ఇంకా ఉన్నాయి. శల్యపర్వంలో చివర వీటన్నింటి గురించి ప్రశ్నించగా వాళ్ళను చంపటానికి వేరే మార్గం లేదని, మరో రకంగా విజయం సాధించటం సాధ్యం కాదని చెపుతాడు కృష్ణుడు. ఇలాంటి కార్యకలాపాలు అర్థశాస్త్రంలో ఆచరణాత్మక రూపంలో అనేకం ఉన్నాయి. గీతా బోధన చేయటానికి కల్పించబడిన కృష్ణుడు ద్వైవత్వం ఆపాదించబడిన మానవ మాత్రుడే. చాలా విషయాలలో అసాధారణ వ్యక్తి కావొచ్చు. కానీ లోటుపాట్లున్న మనిషే. అందుకే కొన్ని చోట్ల తనను మానవుడుగాను, మరొకొన్ని సందర్భాలలో దేవుడిగాను చెప్పుకుంటాడు. కృష్ణుడి శేష జీవిత కథ-యాదవుల కులక్షయం, అందులో పుత్రుడు ప్రద్యుమ్నుడి చావు, అన్న బలరాముడు క్షతగాత్రుడవటం, తుదకు తన సాధారణ దయనీయ మరణం ఇవన్నీ అతడు కేవలం మానవమాత్రుడే అనటానికి సాక్షాలు.

అర్జునుడిని యుద్ధానికి సంసిద్ధం చేసే క్రమంలో కృష్ణుడు అంతకు ముందున్న తాత్వాక సిద్ధాంతాలన్నింటిని క్రోడీకరించాడు. వాటిని తనకు అనుకూలంగా మలచి అన్నిటి గమ్యము ఒక్కటేనని అందువలన తనను సర్వోన్నత దేవుడిగా విశ్వసించమని చెప్పాడు.

కృష్ణుడు జ్ఞానయోగం, కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం, సాంఖ్యయోగం ఇలా రకరకాల తాత్విక భావాలను బోధించి నప్పటికి అర్జునుడు నిర్వికారంగానే ఉంటాడు. కృష్ణుడికి సహనం నశిస్తుంది. ఇప్పుడిక దండధారణ చేయటం తప్ప మరో గత్యంతరం లేదు. అందుకని మహా భయంకర విశ్వరూపం దాలుస్తాడు. నా ఆశీర్వాదం వలన అన్ని అవరోధాలు అధిగమించగలుగుతావు. కానీ అహంభావంతో నా సలహాను పెడచెవిని పెడితే నాశనం అయిపోతావు అని బెదిరింపుగా చెప్పుతాడు. కృష్ణుడు అగ్రహోదగ్రుడు అయ్యాడని, విశ్వరూపం ధరించాడని అలంకారిక భాషలో చెప్పటం దీని అర్థం. కానీ కృష్ణుని యొక్క అంత భీకర స్వరూపం ముందెన్నడూ చూడలేదు. దానితో అర్జునుడు మెత్తబడగాడు. చిట్ట చివరకు అర్జునుడు తన భ్రమలన్ని తొలగిపోయాయని, కృష్ణుడి సలహా ప్రకారం చేయటానికి తాను సిద్ధపడతాడు. అర్జునుడిని మానసికంగా లోబరుచుకోవటంలో విజయం సాధించానని కృష్ణుడు భావిస్తాడు. యుద్ధానికి సన్నిద్ధుడ్ని చేస్తాడు. యుద్ధం చేయటానికి అర్జునుడు ఎందుకు విముఖత చూపాడు ? అర్జునుడు తెగల జీవితానికి అలవాటుపడిన గణవ్యవస్థను నమ్మిన తత్వం గలవాడు. గణవ్యవస్థలో ఇతర గణాలకు చెందినవారితో యుద్ధం చేయటం, వాళ్ళను హతమార్చటం, దోచుకోవటం, వాళ్ళ సంపదలను నాశనం చేయటం అన్నీ కూడా నీతివంతమైన పనులే. కాని గణంలోపల మాత్రం పరస్పరం ఏమాత్రం హాని కలిగించకూడదు. ఒక కుదురుకు చెందినవారంతా సజాతుల క్రిందే లెక్క. వారికి హాని తలపెట్టకూడదు. అంటే ఇంకా గణవ్యవస్థ నియమ నిబంధనల నుండి బయట పడని స్థితి అర్జునుడిది. అందువల్లనే సజాతులపై, అంటే అన్నదమ్ములు, గురువులు, దాయాదులపై యుద్ధానికి సంశయిస్తాడు. కాని కృష్ణుడు మారుతున్న కాలానికి, మారుతున్న నీతి సూత్రాలకు, కొత్త యుగానికి దూత. ఆస్తికోసం, రాజ్యం కోసం తోబుట్టువులను కూడా చంపవచ్చును. ఎటువంటి కుటిల నీతిని అయినా ప్రయోగించవచ్చును. అలా మారిన కాలానికి ప్రతీక కృష్ణుడు. కాబట్టే మహాభారత యుద్ధం రాజ్యాధికారానికి, రక్త సంబంధానికి పొత్తులేదనే రుజువు చేసింది.

వేదాలలో కాని, ఉపనిషత్తులలోకాని, కర్మ సిద్ధాంతం లేదు. వేదాలలో కర్మలు అంటే యజ్ఞాల సందర్భంగా ఆచరించే కర్మకాండలు లేదా కార్యక్రమాలు. ఆ తరువాతి కాలంలో దానికి వేరే అర్థం వచ్చింది. కర్మలు అంటే (బహుశా గత జన్మలో) చేసిన పనులు అని అవి భవిష్యత్తులో నిర్ణయిస్తాయని కొత్త సిద్ధాంతం పుట్టుకొచ్చింది. దానికి మూలం వ్యవసాయం అభివృద్ధి అవుతున్న క్రమంలో వచ్చింది. నేలలో నాటే విత్తనం మొలకెత్తి ఫలాన్నిస్తుంది. విత్తనం నాటటం అన్నది కర్మ, ఫలాలను లేదా పంటలను ఇవ్వటం అన్నది ఫలితం. ఈ అనుభవం నుండే చేసిన పనులు పరిపక్వం అయ్యి ఫలితంగా దారితీస్తాయి అనే భావన పుట్టింది. అదే కర్మ సిద్ధాంతంగా రూపొందింది. అసలు కర్మ, పరిపక్వం కావటం, ఫలం ఇవ్వటం అనే మాటలోనే వ్యవసాయ సంబంధ ధ్వని ఉన్నది. ఈ రకమైన భావనయే తరువాతి కాలంలో పూర్వజన్మలో చేసుకున్న పాప పుణ్యాల ఫలితాలను ఈ జన్మలో అనుభవించక తప్పదన్న భావనకు దారితీసింది. అలాగే అహింస అనే భావన ఆరంభమవటానికి యజ్ఞక్రతువుల సందర్భంగా విపరీతమైన పశు బలులు. యజ్ఞాల పేరుతో ఆవు, ఎద్దు, గుఱ్ఱం, గొర్రె, మేక మొదల్కైన వాటిని బలి ఇవ్వటం సర్వ సాధారణమైపోయింది. అది యజుర్వేద కాలానికి మరింత పెరిగింది. యజ్ఞంలో బలికాని పశువంటూ లేదంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా ఆవులను, ఎద్దులను బలి ఇవ్వటం వలన అప్పుడే అభివృద్ధి అవుతున్న వ్యవసాయానికి పశువుల కొరత ఏర్పడిరది. బలి ఇవ్వటం ద్వారా వచ్చే మాంసాహారం ఎక్కువ కాలం నిల్వ ఉండదు. దాని స్థానంలో వ్యవసాయానికి ఎద్దులను విరివిగా వాడితే వచ్చే పంట మాంసాహం భుజించేవారికన్నా అనేకరెట్ల మందికి ఆహారం అందించవచ్చు. సమాజం ఎప్పుడూ ఒకడుగు ముందుకు అభివృద్ధివైపుకే అడుగులు వేస్తుంది. ఇది చరిత్ర సత్యం. ఈ కారణంగానే యజ్ఞాలకు క్రతువుల, కర్మ కాండలకు వ్యతిరేకంగా వ్యవసాయకులు తిరగబడ్డారు. ఆ తిరుగుబాటు అహింసా సిద్ధాం తానికి దారితీసింది. ఆనాడు వ్యవసాయాన్ని ప్రోత్సహించింది ప్రధానంగా క్షత్రియులు. దానికి చరిత్ర సాక్షి గౌతమబుద్ధుడు. బుద్ధుడు యజ్ఞయాగాలను తీవ్రంగా వ్యతిరేకించాడు. అహింసను ఒక తాత్విక సిద్ధాంతంగా ప్రతి పాదించాడు. వ్యవసాయం అభివృద్ధి అయ్యేకొద్ది, యజ్ఞక్రతువులను వ్యతిరేకించేకొద్ది బుద్ధుని

తాత్విక సిద్ధాంతమైన అహింస సమాజాన్ని మరింతగా ప్రభావితం చేసింది. దానితో మాంసాహారులైన పురోహితవర్గం సహితం శాఖాహారులుగా మారక తప్పలేదు. పురోహిత వర్గానికి సమాజంలో తగు స్థానం, విలువ ఉండాలంటే విధిగా శాఖాహారులు కావలసి వచ్చింది. భారత ఉపఖండంలో అహింసా కర్మ సిద్ధాంతాలను ప్రతిపాదించి ప్రజలను ప్రాభావితం చేసింది బుద్ధుడు బౌద్ధమతం. అయితే అవే సిద్ధాంతాలు తరువాతి కాలంలో బ్రాహ్మణ మతానికి కీలకమయ్యాయి. బౌద్ధాన్ని దేశాన్నుండి పారదోలుతూ బౌద్ధుల అహింసా కర్మ సిద్ధాంతాన్ని తమ సొంతం చేసుకున్నారు. వస్తారంగా ప్రాచుర్యం పొందిన కృష్ణ పరమాత్మ చేత ఈ రెండు సిద్ధాంతాలను చెప్పించి, ఈ ఉపదేశాన్ని భగవద్గీతగా మహా భారతంలో ప్రవేశపెట్టారు. బుద్ధుడే లేకపోతే భగవద్గీత సాధ్యమయ్యేదే కాదు. యజ్ఞకాండకు వ్యతిరేకంగా పుట్టిన ఈ అహింసా సిద్ధాంతం, జనమే జయుడు నాగజాతిని హింసాత్మకంగా నాశనం చేయటానికి జరుపుతున్న యజ్ఞసందర్భంలో వైశంపాయనుడు చెప్పిన కథ భారతం. హింసాకాండకు వెరుస్తున్న అర్జునుడికి హింస చేయటం నీ ధర్మం అని కృష్ణుడు చేసే ఉపదేశంలో భాగంగా ఈ భగవద్గీతను మహాభారతంలో ప్రవేశపెట్టటం జరిగింది.

మహాభారతం, సంజయుడు దృతరాష్ట్రుడకిలా చెప్పాడని, జయేజయునికి వ్యాసుడు చెప్పాడు. వ్యాసుడు ఇలా చెప్పాడని నైమిశారణ్యంలోని ఉగ్రశ్రవుడు అనే కవిగాయకుడు తన చుట్టు చేరిన ఋషులతో చెప్పాడు. ఆ ఋషులు వారి శిష్యులకు, ఆ శిష్యులు ప్రశిష్యులకు ఆ ప్రశిష్యులు ప్రప్రశిష్యులకు చెప్పారు. అలా 8800 శ్లోకాలతో మొదలైన జయం లేదా జయేతిహాసం 24000 శ్లోకాలుగా పెరిగి భారతమై, తరువాతి కాలంలో లక్ష శ్లోకాల మహా భారతమయ్యింది. 24000 శ్లోకాలు ఉన్న భారతంలో భగవద్గీత ప్రస్థావనే లేదు. భగవద్గీతలోని మరి కొన్నింటిని పరామర్శిద్దాం :

గీత 2-22 –వాసాంసి జీర్ణాని యధా విహాయ నవాని గృష్ణతి వరోపరాణి

తథాశరీరాణి విహాయ జీర్ణాన్ అన్యాని సంయాతి నవానిదేహి

మనిషి చిరిగిన బట్టలు విడిచి కొత్త బట్టలు ఎలా ధరిస్తాడో, అదే విధంగా జీవాత్మ

జీర్ణించిన శరీరాన్ని విడిచి క్రొత్త శరీరాన్ని ధరిస్తుంది. అలాంటప్పుడు సంతోషించి బారసాల పాటలు పాడుకోవాలిగాని, బాధపడటం ఎందుకు ?

గీత 2-11 –గతాసూనగ తాసూంశ్చ నామశోచంతి పండితా:

జ్ఞానులైన వారు మరణించినవారి గురించిగాని, జీవించి ఉన్నవారి గురించిగాని శోకించరు. –మరి అభిమన్యుడిని చంపినప్పుడు ఈ జ్ఞానం ఏమైంది, ఎక్కడికి పోయింది.

గీత 2-55 – ప్రజహాతి యదాకామాన్ పర్వాన్ పార్థ మనోగతాన్

ఆత్మన్యేవాత్మనా తుష్ట: స్తితప్రజ్ఞాస్త దోచ్యతే

ఎవరైతే అన్ని కోరికలు త్యజించి తమలో తామే సంతృప్తులై ఉంటారో వారే నిజమైన స్థితప్రజ్ఞులు. –

అలాంటప్పుడు చస్తే వీరస్వర్గం జయిస్తే రాజభోగాలు అని ఆశచూపటం ఎందుకు ?

గీత 2-37 –హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వానా భోక్ష్యసే మహీమ్

తస్మాదుత్తిష్ట కౌంతేయ యుద్ధాయ కృతనిశ్చయః.

అర్జునా! చనిపోతే స్వర్గం ప్రాప్తిస్తుంది. జయం పొందితే రాజభోగాలు. రెండు విధాలా లాభమే. అందువల్ల కృతనిశ్చయుడవై యుద్ధానికి లే.

గీత 2-38–సుఖ దు:ఖే సమే కృత్వాలాభ లాభౌ జయం జయౌ

తతో యుద్ధాయ యుజ్యస్వ నైనం పాపమవాప్స్యపి.

సుఖ దుఃఖాలను, లాభనష్టాలను, జయాపజయాలను సమానంగా భావించి యుద్ధానికి సన్నిద్ధుడవుకా. దీనివల్ల నీకు పాపం అంటదు.

గీత 11-33 తస్మాత్ త్వముత్తిష్ట యశో లభస్వ జిత్వాశతన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధమ్

కాబట్టి లే అర్జునా ! యశస్సు పొందు. శత్రువులను జయించి సమృద్ధమైన రాజ్యం అనుభవించు. –మరి సుఖం, దు:ఖం, గెలుపు, ఓటమి, కీర్తి, అపకీర్తి అన్ని సమానమైనప్పుడు కృష్ణుడు జయము, కీర్తి వీటి ఆశ ఎందుకు చూపుతున్నట్లు.

గీత 2-18 –అంతనంత ఇమే దేహా: నిత్యస్యోక్తాః శరీరిణ:

అనాశినో2ప్రమేయస్య తస్మాద్యు ధ్యస్వభారత

ఆత్మ ధరించే శరీరాలన్ని నశించిపోయేవే. కానీ జీవాత్మ నాశనము లేనిది. నిత్యమైనది. కావున అర్జునా యుద్ధం చేయి. –కానీ ఎప్పుడో ఒకసారి చావాలి కాబట్టి ఇప్పుడే చచ్చిపో అనే తర్కం కనిపిస్తుంది ఇక్కడ.

దేవుడి యొక్క గుణగణాలు ఎలాంటివి అయినా వాటిని ప్రశ్నించకుండా, నిర్భిబంధంగా విధేయత చూపటమే గీతలోని భక్తి సారాంశం.


చివరగా ముగింపు :

14వది అయిన అశ్వమేధపర్వంలో మరో గీతను చేర్చారు. అర్జునుడు కృష్ణున్ని అడుగుతాడు. బావా, భారత యుద్ధానికి ముందు నీవు చెప్పిందంతా మర్చిపోయాను. మళ్ళీ మరొక్కసారి చెప్పాలని కోరతాడు. అప్పుడు చెప్పిన దానిని మొత్తం జ్ఞాపకం చేసుకోవటం తనకు కూడా సాధ్యం కాదని కృష్ణుడు అంటాడు. దానికి బదులు మరో గీతను చెబుతాడు. అదే అణుగీత. దీనిని మొదటి భగవద్గీతతో ఏమాత్రం పోల్చటానికి వీలు లేదు. కాకుంటే ఈ అణుగీత బ్రాహ్మణులను ఆకాశానికి ఎత్తుతుంది. ఈనాడు దానిని ఎవరూ చదవరు.

అయితే భగవద్గీత ఈ ఆధునిక యుగానికి ఏ విధంగా, ఎలా ఉపయోగపడుతుంది. భూయజమాని లేదా భూస్వామి ఆ భూమిమీద పనిచేసేవారు, పాలేర్లు భూస్వామి ఎన్ని ఆగడాలు చేసినా నిర్నిబంధంగా విధేయత చూపటం నేర్చుకోవాలా ? ఒక కంపెనీ యజమాని కార్మికులను ఎంతో దోచుకుంటున్నా నిర్నిబంధంగా విధేయత చూపాలా ? నా విష్ణు: పృథివీపతి: రాజును మించిన దేవుడు లేడని ఇప్పుడు పరిపాలిస్తున్న పాలకులే దైవాంశ సంభూతులని, వారిని ప్రశ్నిస్తున్న వారిమీద అరాచక చట్టాలను ప్రయోగిస్తూ జైళ్ళపాలు చేస్తున్న ఈ పాలకులకు, ఈ దైవాంశ సంభూతులకు నిర్భిబంధంగా విధేయత చూపుతూ బ్రతకాల్సిందేనా ? ఇదేనా భగవద్గీత ఆధునిక యుగానికి ఇచ్చే సందేశం? అలాగే కుళ్ళి కంపు కొడుతున్న కుల వ్యవస్థ, కోరలు చాచుతున్న కుల వ్యవక్షత కొనసాగాలని భగవద్గీత మనకు ప్రభోదిస్తుంది. ఈ ఆధునిక యుగంలో కూడా కుల వ్యవస్థను కొనసాగించాల్సిందేనా ? మనిషిని మనిషిగా చూసే సమాజం నిర్మించుకోవద్దా ? అయితే బహుళ ప్రాచుర్యం పొందిన ఈ భగవద్గీతను పాలక వర్గాలు సమాజంలో వివిధ రంగాలలో అమలు పర్చటానికే ప్రయత్నిస్తున్నారు. ప్రజలకు తెలియకుండానే దానిని సాధనంగా ఉపయోగించుకుంటూనే ఉన్నాయి పాలకవర్గాలు. దానికి తోడు కొంతమంది కలాల సైన్యం, సమాజంలోని కొన్ని వర్గాలు ప్రజలను అణచిపెట్టి ఉంచటానికి, ప్రశ్నించటమే నేరంగా భావిస్తూ పాలకుల అడుగులకు మడుగులొత్తే సాహిత్యాన్ని వెదజల్లుతూనే ఉన్నారు. అందువల్ల ఆధునిక యుగంలోని సమస్యలకు, వాటి పరిష్కారానికి భగవద్గీత ఏమాత్రం సమాధానం చెప్పలేదు. ఉపయోగపడదు కూడా. చాలా మంది భగవద్గీతను ఉత్తినే గౌరవిస్తారు. గౌరవించేవారిలో అతి కొద్దిమంది మాత్రమే చదువుతారు. మరీ కొద్దిమంది మాత్రమే అర్థం చేసుకుంటారు. మన భౌతిక జీవితంలోని వాస్తవికపై ఆధారపడి నిర్దిష్టంగా ఆలోచించాల్సిన తరుణంలో ఈ రకమైన మిశ్రమభావాలు ఎందుకూ పనికిరావు. సాహిత్య సౌందర్యం కోసం చదువుకోవచ్చు. ❋

Date of Publication : 30th of every month. Date of Posting : 5th & 7th of every month.
Postal Regd. No. D/VJ/172/2021-23, Marxistu Monthly Magazine, Volume 19, issue: 9 Vijayawada
RNI Reg. No. APTEL/2006/17554 - Rs. 15/- Total Pages : 36

# సోషలిజం అంటే సరికొత్త, మేలైన సమాజం



మేము కొత్త, మేలైన సమాజిక వ్యవస్థను సాధించదలచుకున్నాము. ఈ కొత్త, మేలైన సమాజంలో ధనికులు ఉండకూడదు, బీదలు ఉండకూడదు. అందరూ పనిచేయవలసి ఉంటుంది. శ్రమజీవులందరి సమిష్టి శ్రమ ఫలితాలను కొద్దిమంది ధనికులు కాకుండా శ్రమజీవులందరూ అనుభవించాలి. యంత్రాలూ ఇతర అభివృద్ధీ అందరి శ్రమనూ సులభపరచడానికి ఉపయోగపడాలిగానీ, కోటానుకోట్ల ప్రజల పొట్టలు కొట్టి కొద్దిమంది ధనికులయ్యేటట్లు చేయకూడదు. ఈ కొత్త, మేలైన సమాజాన్ని సోషలిస్టు సమాజం అంటారు.

----------

మేము మార్క్సిజాన్ని సర్వ సంపూర్ణమైన, అనుల్లంఘనీయమైన సిద్ధాంతంగా పరిగణించబోము. అది శాస్త్రం పునాదిరాయిని మాత్రమే వేసింది. కమ్యూనిస్టులు తమ జీవితంతోబాటే దానిని సకల దిశలలోనూ అభివృద్ధి చేసి తీరాలని మా నమ్మకం.

----------

కమ్యూనిస్టు పార్టీకి చెందిన వార్తాపత్రిక పాత్రను ప్రచారానికీ, ఆందోళనకూ మాత్రమే పరిమితం చేయకూడదు. అది పార్టీ నిర్మాతకూడా కావాలి.

----------

కొత్త శక్తులతో, యువకులతో, కొత్తగా ఏర్పడిన బృందాలతో మాకు ప్రత్యక్ష సంబంధం కలిగించడం మరవ వద్దు. విప్లవ సంస్థ బలం దానికి గల విస్తృత సంబంధాల సంఖ్యపై ఆధారపడి ఉందని మరిచిపోవద్దు.

----------

కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమం అంటే పార్టీ వేటి కోసం కృషి చేస్తున్నదో, పోరాడుతున్నదో ఆ సమస్త విషయాల సంక్షిప్తమైన, స్పష్టమైన, కచ్చితమైన ప్రకటన.

----------

అధికారం కోసం తాను చేసే పోరాటంలో కార్మికవర్గానికి నిర్మాణం తప్ప మరొక ఆయుధం లేదు.

----------

పార్టీ కార్మిక వర్గానికి మార్గదర్శక సంస్థగా ఉండాలి. అది లేకుండా సోషలిస్టు విప్లవాన్ని జయించడమూ కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడమూ అసాధ్యం.

----------

రైతాంగం తోటి పొత్తుతో విప్లవించే కార్మికవర్గం, కేవలం బూర్జువా ప్రజాతంత్ర విప్లవ విజయంతో ఆగదు. పోరాట గతిలో అది తన బలాలను సంఘటితపరిచుకుని, గ్రామీణ పట్టణ పేదలను తనవెంట నడిపిస్తూ, పెట్టుబడిదారీ వ్యవస్థ మీద దెబ్బతీస్తుంది. ఆ విధంగా బూర్జువా ప్రజాతంత్ర విప్లవం సోషలిస్టు విప్లవంగా అభివృద్ధి చెందుతుంది.

----------

**చిరునామా**

**మేనేజర్,**

**మార్క్సిస్టు (సైద్ధాంతిక మాసపత్రిక), ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ, అరవింద స్కూల్ వద్ద, తాడేపల్లి , పిన్ : 522501, గుంటూరు జిల్లా. సెల్: 94900 99422**

**చందా వివరాలు**

విడిపత్రిక: **రూ.15,** సంవత్సర చందా:**రూ.150,** పోస్టు ద్వారా **రూ. 180**
పోస్టు ద్వారా లేదా ఏజెంటు ద్వారా తెప్పించుకోవచ్చు. లేదా మీ స్థానిక పార్టీ కార్యాలయంలో సంప్రదించండి. ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలోనూ లభిస్తాయి.

**చందాదారుని చిరునామా**

**పోస్టు స్టాంపు**

**ఇంటి నెంబరు** ..................................................

**వీధి**..........................................................

**గ్రామం**........................................................

**మండలం లేదా పట్టణం** ........................................

**జిల్లా**.........................................................

e m a i l : marxistap@gmail.com
venkataraosankarapu@gmail.com

Printed and Published by B.V. Raghavulu on behalf of CPIM AP Committee. Printed at Prajasakti Printers & Publishers Private Ltd. D .No 14-12-19, Krishna Nagar, Tadepalli (M) Guntur Dt. 94900 99422.
Editor : S. Venkatarao.